www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

సంపుటి 28, సంచిక: 169 | మంగళవారం | 09-12-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

ఇక జిహెచ్ఎంసిలో
**300 వార్డులు**
నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

04




## ఒప్పందాలు వివరాలు

- దీప్ టెక్, ఫ్యూచర్ సిటీ, కోర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రూ. 1,04,000 కోట్లు
- బ్రూక్ఫీల్డ్ యాక్సిస్ వెంచర్స్ కన్సార్షియం నుండి రూ 75వేల కోట్లు ( భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ఈ నిధులు వినియోగం).
- పునరుత్పత్తి శక్తి, పవర్ సెక్యూరిటీ రూ. 39,700 కోట్లు.
- ఎరో స్పేస్, డిఫెన్స్ లాజిస్టిక్ గేట్వేట రూ. 19,350 కోట్లు,
- అడ్వాన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ , కోర్ ఇండస్ట్రీ రూ.13,500 కోట్లు
- వివిధ రంగాలకు చెందిన పెట్టుబడులతో కలిపి మొత్తంగా రూ. 1.88 లక్షల కోట్లు

### నేడు విజన్ – 2047 డ్యాకుమెంట్ ఆవిష్కరణ

తెలంగాణ రైజింగ్ విజన్ –2047 డ్యాకుమెంట్ను మంగళవారం సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్రెడ్డి ఆవిష్కరించనున్నారు. రెండో రోజు సమ్మిట్లో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలపై ప్యానెల్ డిస్కషన్లు కార్యక్రమాలు జరగనున్నాయి. అనంతరం రాత్రి 7 గంటలకు డ్రోన్ షోతో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ముగియనుంది.

# రూ.1.88 లక్షల కోట్లు

## తెలంగాణలో పెట్టుబడులకు కుదిరిన ఒప్పందాలు

- అట్టహాసంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం
- ప్రపంచ ఆర్థిక సదస్సును తలపించేలా అంతర్జాతీయ సదస్సులు
- సమ్మిట్ను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- తొలిరోజు 12 అంశాలపై చర్చా కార్యక్రమాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల (2047) నాటికి తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ల ఆర్థిక ప్రగతి సాధించడమే లక్ష్యంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రపంచ ఆర్థిక సదస్సును తలపించేలా రెండు రోజుల పాటు ప్రభుత్వం నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి సదస్సును ముఖ్యఅతిథి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం ప్రారంభించారు. తెలంగాణ'రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో మొదటి రోజు సోమవారం రూ.1.88 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. దీనికి సంబంధించి సుమారు 35 ప్రధాన ఒప్పందాలు కుదిరినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇందులో దీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, వ్యూహాత్మక తయారీ, ఏరోస్పేస్ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలలో భారీగా పెట్టుబడులు రావడం రాష్ట్ర ఆర్థిక శక్తివంతనను మరింత బలోపేతం తరువాయి 12లో

### నిర్దేశిత లక్ష్యాలతో రాష్ట్రం

## ముందుకెళ్తోంది

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



నిర్ణీత లక్ష్యాలు నిర్దేశించుకుని తెలంగాణ రాష్ట్రం ముందుకెళుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాష్ట్రం 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలన్నదే లక్ష్యమని చెప్పారు. లక్ష్యాలను నిర్దేశించడం, వ్యూహాత్మకంగా ప్రణాళిక వేయడం, క్రమశిక్షణతో అమలు చేయడంలో స్పష్టత, భవిష్యత్తును చూసే ఆలోచన విధానం అవసరమని, 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా దృఢ సంకల్పంతో కదులుతున్నందున, తెలంగాణ కూడా 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా విశ్వాసంతో ముందుకు సాగుతోందని, అలాంటి పురోగతి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తుందన్నారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ – 2025' ను సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. సదస్సు ప్రాంగణంలో తెలంగాణ తల్లి డిజిటల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ రంగాల ప్రముఖులు ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగిస్తూ తరువాయి 2లో

### తెలంగాణ రైజింగ్కు తిరుగులేదు

## పోటీ విదేశాలతోనే

- రాష్ట్ర సమగ్రాభివృద్ధికోసం భవిష్యత్ ప్రణాళికలతో సాగుతున్నాం
- సహకరించండి.. పెట్టుబడులు పెట్టండి... రాష్ట్రానికి మద్దతివ్వండి
- పారిశ్రామికవేత్తలు, నిపుణులు, మేధావులకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి విజ్ఞప్తి



''రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్తు ప్రణాళికలతో సాగుతున్న తెలంగాణ రైజింగ్కు తిరుగు లేదు. ఒక మంచి సంకల్పంతో వేసిన ఈ ముందడుగులో తెలంగాణ రాష్ట్ర లక్ష్యాలను సాధించడానికి మీరంతా భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను.' తెలంగాణ రైజింగ్–2047' విజన్ లక్ష్యాలు కొంత కష్టంగా అనిపించవచ్చు. కానీ వాటిని సాధించగలమన్న విశ్వాసం మాకుంది. ఈ విషయంలో మా బృందానికి చెబుతున్నదేమంటే. కష్టంగా ఉంటే దానిని వెంటనే చేసి చూపిద్దాం. మీరది అసాధ్యమని భావిస్తే మరి కొంత గడువిస్తాను'' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి తెలంగాణ రాష్ట్రం ప్రేరణ పొందామని, మేమిప్పుడు ఆ దేశాలతో పోటీ పడదలచుకున్నామని, అందుకోసం తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో సహకరించాలని, పెట్టుబడులు పెట్టాలని, తెలంగాణకు మద్దతు ఇవ్వాలని ఆహ్వానిస్తున్నామన్నారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ (రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్ పేట్) లో అత్యంత అద్భుతంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025' ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి తరువాయి 2లో

### 'వందేమాతరం' దేశానికి...

## శక్తి, ప్రేరణనిచ్చింది



- లోక్సభలో ప్రధాని మోదీ ఉద్ఘాటన
- సామాజిక సామరస్యం ముసుగులో జాతీయ గేయాన్ని కాంగ్రెస్ ముక్కలు చేస్తోందని మండిపాటు
- బుజ్జగింపు రాజకీయాలను అనుసరిస్తున్నదని ఆరోపణ
- మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూపైనా విమర్శలు

**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య పోరాట సమయంలో వందేమాతరం మంత్రం మొత్తం దేశానికి శక్తిని, ప్రేరణను ఇచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'ఈ మంత్రం భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి శక్తిని, ప్రేరణనిచ్చింది. ధైర్యం, దృఢ సంకల్ప మార్గాన్ని చూపించింది. నేడు పవిత్రమైన వందేమాతరంను గుర్తుంచుకోవడం ఈ సభలో మనందరికీ గొప్ప గౌరవం. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చారిత్రాత్మక సందర్భాన్ని మనం చూస్తున్నందుకు గర్వకారణం' అని ఆయన అన్నారు. 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆ గేయంపై సోమవారం పార్లమెంట్లో ప్రత్యేక చర్చ జరిగింది. చర్చను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సామరస్యం ముసుగులో జాతీయ గేయం వందేమాతరంను కాంగ్రెస్ ముక్కలు చేస్తోందని, ఇప్పటికీ బుజ్జగింపు రాజకీయాలను అనుసరిస్తోందని ఆరోపించారు. వందేమాతరంను ముస్లింలు వ్యతిరేకించవచ్చనే సూచనతో ఏకీభవించినందుకు మాజీ ప్రధాని తరువాయి 12లో

### 'వందేమాతరం' చర్చకు

## రాజకీయ రంగు



- చరిత్ర తిరగరాసే లక్ష్యంతో ప్రధాని మోదీ ప్రసంగం
- లోక్సభలో బిజెపిపై ప్రతిపక్షాలు ధ్వజం
- మీ పూర్వీకులు వందేమాతర నినాదం చేశారా?
- బ్రిటిష్ పాలకులను ఎదిరించారా? అని నిలదీత

**న్యూఢిల్లీ:** 'వందేమాతరం' గీతంపై చర్చకు రాజకీయ రంగు పూయడం, 'చరిత్ర తిరగరాయడం' అనే రెండు లక్ష్యాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ప్రయత్నం చేశారని కాంగ్రెస్పార్టీ సహా ప్రతిపక్షాలు లోక్సభలో విమర్శించాయి. 'వందేమాతరం' గీతం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా లోక్సభలో సోమవారం రోజంతా జరిగిన చర్చను తొలుత కాంగ్రెస్పార్టీ ప్రారంభించింది. బిజెపి ఎన్ని ప్రయత్నాలు చేసినాగానీ జవహర్లాల్ నెహ్రూ చేసిన తరువాయి 2లో

### ఫ్యూచర్ సిటీలో

## అంతర్జాతీయ జూపార్క్

వంతరాతో ఎంఒయు కుదుర్చుకున్న ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వం నిర్ణయించిన నాలుగో నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా జూ ఏర్పాటు చేసే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు అడుగు వేసింది. ఈ లక్ష్యంతో, రాబోయే కొత్త ' జూ' రూపకల్పన, సాంకేతిక సూచనలు, అంతర్జాతీయ బెస్ట్ ప్రాక్టీసులపై మార్గదర్శకత్వం అందించే దిశగా తరువాయి 12లో

### ఆ ఆలోచన

## విరమించండి

- విత్తన మార్కెట్ ప్రైవేటీకరణ వద్దు
- రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్
- రైతులకు, చిన్నతరహా ఉత్పత్తిదారులకు తీవ్ర హాని కలిగించేలా కేంద్ర విధానాలు ఉన్నాయని మండిపాటు
- దేశవ్యాప్తంగా విత్తన ముసాయిదా బిల్లు ప్రతులు దహనం



ప్రజాపక్షం/తుర్కయంజాల్

విత్తన మార్కెట్ ను కార్పొరేటీకరణ చేయాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం తుర్కయంజాల్ కూడలిలో రైతు సంఘం తరువాయి 12లో

### 10 మంది నక్సల్స్

## లొంగుబాటు

- సమష్టిగా వీరి తలలపై రూ.2.36 కోట్ల రివార్డు
- మధ్యప్రదేశ్లోని దిండోరి, మండ్ల జిల్లాలకు మావోయిస్టుల ప్రభావం నుంచి విముక్తి
- మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడి



**బాలాఘాట్ :** ఆయా రాష్ట్రాల్లో మావోయిస్టులు దఫా దఫాలుగా లొంగిపోతున్నారు. ఇటీవలి కాలం నుంచి ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణలో లొంగుబాట్ల పర్వం కొనసాగుతోంది. తాజాగా మధ్యప్రదేశ్లోని బాలాఘాట్ జిల్లాలో కరుడుగట్టిన పది మంది నక్సల్స్ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. సమష్టిగా వీరి తలలపై రూ. 2.36 కోట్ల రివార్డు ఉంది. తాజాగా లొంగుబాటుతో దిండోరి, మాండ్లాలు నక్సల్ ప్రభావం నుండి పూర్తిగా విముక్తి పొందాయని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ప్రపంచ స్థిరత్వానికి చైనా–రష్యా–భారత్ బంధం కీలకం

**బీజింగ్:** చైనా, రష్యా,భారత్ దేశాలమధ్య బంధం ప్రపంచ స్థిరత్వానికి దోహదపడుతుందని చైనా విదేశాంగమంత్రిత్వశాఖ ప్రతినిధి గెంగ్ షువాంగ్ వ్యాఖ్యానించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటలీవల భారతదేశ పర్యటనపై సోమవారం బీజింగ్‌లో పైవిధంగా వ్యాఖ్యానించారు. ఈ బలమైన సంబంధాలు మూడు దేశాలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని ఆయన అన్నారు. ఈ మూడు దేశాలమధ్యా బలమైన బంధం ప్రపంచ భద్రతకు ఒక మూలస్తంభంగా ఉపయోగపడుతుందన్నారు. గ్లోబల్ సౌత్‌లో భారత్,చైనా,రష్యా దేశాలు అభివృద్ధి చెందుతున్న కీలకమైన ఆర్థిక వ్యవస్థలనీ, ఈ మూడుదేశాలనూ ప్రపంచపటంపై కీలకమైన ఆటగాళ్ళుగా అభివర్ణించారు. ఈ మూడు దేశాలు తమ మధ్య బంధాన్ని అన్నివిధాలుగా బలోపేతం చేసుకుంటూ ప్రాదేశికంగా, ప్రపంచవ్యాప్తంగా భద్రత వస్తుందన్నారు. చైనా–భారత్ మధ్య వాణిజ్య అవకాశాలు, సంబంధాల గురించి మీడియా ప్రశ్నించినప్పుడు ఈ విషయంపై చర్చలు పునరుద్ధరించడానికి చైనా సంసిద్ధంగా ఉందన్నారు.

# బంగ్లాదేశ్‌లో ఎన్నికల కోలాహలం

### సర్వత్రా సందడి



**ఢాకా :** బంగ్లాదేశ్‌లో ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. సర్వత్రా సందడి నెలకున్నది. కొత్త కూటములు పుట్టుకువస్తున్నాయి. కొత్త ఫ్రంట్‌లు ఆవిర్భవిస్తున్నాయి. ఇప్పటివరకూ చీలికలు పీలికలుగా ఉన్న వర్గాలన్నీ ఒక్కచోటకు చేరుతున్నాయి. జులై తిరుగుబాటు ఉద్యమ లక్ష్యాల సాధనే తమ ప్రధాన ఉద్దేశాలని అన్ని పార్టీలు ప్రకటిస్తున్నాయి. దేశాన్ని సాంఘికంగా, ఆర్థికంగా సంస్కరిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నాయి. ఒకవైపు బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధినేత్రి ఖలీదా జియా (80) చావుబ్రతుకులమధ్య కొట్టుమిట్టాడుతుండగా, మరోవైపు జులై తిరుగుబాటు కారణంగా పదవీచ్యుతురాలైన షేక్ హసీనా ఐసిటి తీర్పుతో ఉరిశిక్షను తలమీద మోస్తూ అజ్ఞాతంలో ఉన్న తరుణంలో సరికొత్త బంగ్లాదేశ్‌ను రూపుదిద్దేందుకు కొత్త ముస్లిం పార్టీలు ఉవ్విళ్ళూరుతున్నాయి. ఈ స్ఫూర్తితో కొత్త కూటములు ఆవిర్భవిస్తున్నాయి.

ఆదివారం ఎన్నికల సంఘం నిర్వహించిన కీలక సమావేశంలో 13వ పార్లమెంటు ఎన్నికలు–రిఫరెండం ఒకేసారి నిర్వహించాలని నిర్ణయించింది. బంగ్లాదేశ్ పార్లమెంటులో మొత్తం 350 స్థానాలు ఉండగా 50 స్థానాలను మహిళలకు కేటాయించారు. మిగిలిన 300 సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. 151 స్థానాలు గెలుచుకున్నపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.

### 18 పార్టీల జాతీయ ఫ్రంట్ ఆవిర్భావం

మరో రెండు నెలల్లో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్న తరుణంలో 18 పార్టీలతో దేశంలో ఒక జాతీయ కూటమి ఆవిర్భవించింది. ఇందులో అధికారికంగా రిజిస్టర్ చేసుకోని 12 పార్టీలు ఉన్నాయి. న్యూ నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎన్ఎన్‌డిఎఫ్) పేరుతో ఈ సరికొత్త సంఘటన రూపుదిద్దుకుంది. మాజీ ఎంపి,మంత్రి అనుసుల్ ఇస్లామ్ మహ్మద్ సోమవారం ఉదయం ఎమ్మాన్యుయేల్ పార్టీ సెంటర్‌లో ఈ జాతీయ ఫ్రంట్ ఆవిర్భావం గురించి ప్రకటన చేశారు. గత ఏడాది జులైలో జరిగిన తిరుగుబాటు ఏ లక్ష్యంతో జరిగిందో ఆ ఆకాంక్షలను తమ జాతీయ ఫ్రంట్ ముందుకు తీసుకువెళుతుందని ఆయన చెప్పారు. జతియా పార్టీకి చెందిన అనేక వర్గాలు, ఒక్కచోట చేరాయి. ముఖ్యంగా అనుసుల్ ఇస్లామ్ మహ్మద్, అన్వర్ హుస్సేన్ మహ్మద్‌లు చేతులు కలిపి ఒక్కటిగా మారడంతో ఈ కొత్త ఫ్రంట్ బంగ్లాదేశ్ రాజకీయ తెరమీదకు వచ్చింది. ఈ కొత్త సంకీర్ణ కూటమి బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య పరివర్తనను ముందుకు తీసుకువెళుతుందని, ప్రస్తుతం దేశంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఒక ఏకాభిప్రాయాన్ని ఈ కూటమి నిర్మిస్తుందని చెప్పారు. విముక్తి యుద్ధం స్ఫూర్తిని ఈ కూటమి నిలబెడుతుందని, జులై తిరుగుబాటు ఆంకాక్షలను ముందుకు తీసుకువెళుతుందని చెప్పారు. దేశానికి అవసరమైన సంస్కరణలతో ముందుకు వెళ్ళడం, ఫాసిజాన్ని నిర్మూలించడం, సుపరిపాలన కోసం ఆరాటపడే దేశ బలహీన వర్గాల వాదనలను పటిష్టంగా ముందుకు తీసుకురావడం తమ కూటమి లక్ష్యాలని ఆయన చెప్పారు. జతియాపార్టీ చీలికవర్గం నాయకుడు అన్వర్ హుస్సేన్ మంజు ఈ సభలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనుసుల్ ఇస్లామీ జతియా పార్టీ ప్రధాన కార్యదర్శి రాహుల్ అమిన్ హౌలాదర్ స్వాగతోపన్యాసం చేశారు.

### మూడు పార్టీల కూటమి 'గోనోతాంత్రిక్ సాంగ్‌స్కర్' ఏర్పాటు

బంగ్లాదేశ్‌లో ఒకవైపు పాత రాజకీయపార్టీలు, కొత్త పార్టీలు బహిరంగ సభలతో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తుండగా మరోవైపు కొత్త కూటములు ఆవిర్భవిస్తున్నాయి. నెలల తరబడి జరిగిన చర్చోపచర్చల తర్వాత బంగ్లాదేశ్‌లో మూడు పార్టీలతో 'గోనో తాంత్రిక్ సాంగ్‌స్కర్' కూటమి కొత్తగా ఆవిర్భవించింది. నేషనల్ సిటిజన్ పార్టీ, అమర్ బంగ్లాదేశ్ పార్టీ (ఎబిపార్టీ),బంగ్లాదేశ్ రాష్ట్రో సాంగ్‌స్కర్ ఆందోళన్ (బిఆర్ఎస్ఎ)లు కలిసి ఈ కొత్త కూటమిని ఏర్పాటు చేశాయి. కొద్ది నెలలుగా సంప్రదింపులు చేసిన తర్వాత ఈ కొత్త కూటమి ని నాయకులు ప్రకటించారు. రాజధాని ఢాకాలోని రిపోర్టర్స్ యూనిటీలో సోమవారం జరిగిన పత్రికాగోష్ఠిలో నేషనల్ సిటిజన్ పార్టీ కన్వీనర్ నహిద్ ఇస్లాం కొత్త కూటమి ఆవిర్భావ ప్రకటన చేశారు. ఈ కూటమికి ఆయన ఇకమీదట అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తారు. ఈ పత్రికాగోష్ఠిలో అమర్ బంగ్లాదేశ్ పార్టీ ఛైర్మన్ మొజిబుర్ రెహ్మాన్ మంజు, రాష్ట్రో సాంగ్‌స్కర్ ఆందోళన్ అధ్యక్షుడు హస్నత్ కాయుం సమక్షంలో సహిద్ ఇస్లాం ఈ ప్రకటన చేశారు. ఈ కూటమిని మరిన్ని పార్టీలను కలుపుకుని ముందుకు వెళ్ళడం ద్వారా మరింతగా విస్తరిస్తామన్నారు. జతియా సమాజ్ తాంత్రిక్ దళ్ (జెఎస్‌డి–ఆర్ఓబి), నాగరిక్ ఓయిక్యాపార్టీలతో ప్రస్తుతం ఇంకా సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. మొదట ఈ కూటమిలో చేరాలని ఉవ్విళ్ళూరినప్పటికీ చివరకు గోనో ఓధికార్ పరిషత్ దీనికి దూరంగా వెళ్ళిపోయింది. ఐతే జులై తిరుగుబాటు లక్ష్యాల స్ఫూర్తి ఉన్న పార్టీలు, ఆర్థిక,సాంఘిక సంస్కరణలకు మొగ్గుచూపే పార్టీలను తమ కూటమిలోకి ఆహ్వానిస్తున్నట్లు సహిద్ ఇస్లాం ప్రకటించారు.

# కాంబోడియా–థాయ్ మధ్య మళ్ళీ ఘర్షణ

### ఆరుగురు మృతి
### గ్రామాలు ఖాళీచేస్తున్న ప్రజలు



**ఫెనోమ్‌పెన్ :** కాంబోడియా–థాయ్‌లాండ్ మధ్య మరోసారి సరిహద్దుల్లో సంఘర్షణలు ప్రారంభమయ్యాయి. కాంబోడియా వైపు నుండే మొదట ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఈ దాడుల్లో ఒక థాయ్‌లాండ్ సైనికుడు మరణించగా తర్వాత థాయ్‌లాండ్ ప్రారంభించిన దాడుల్లో మరో ఐదుగురు కాంబోడియా పౌరులు మరణించారు. కాంబోడియా సైనిక కేంద్రాలు, ఆయుధ డిపోలను లక్ష్యంగా చేసుకుని దాడులు ప్రారంభించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ ఘర్షణలు చెలరేగగానే తీవ్ర అభద్రతాభావంలో ఉన్న ప్రజలు వేలాదిమంది కాంబోడియా సరిహద్దు గ్రామాలను వదలి ఇళ్ళు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపో తున్నారు. రెండు దేశాల మధ్య హింసాకాండ విస్తరించడంతో ప్రజలు ఇళ్ళుఖాళీచేసి పరారవుతున్నారు. వివాదాస్పద సరిహద్దు ప్రాంతంలో కాంబోడియా సైనికులు దుందుడుకుతనంతో వ్యవహరించి కాల్పులు జరిపారని, ఈ కాల్పుల్లో ఒక థాయ్‌లాండ్ సైనికుడు మరణించాడని, దీంతో తాము తిరిగి కాల్పులు ప్రారంభించడంతో ఘర్షణ విస్తరించిందని ఆ దేశ సైనికుడు ఒకరు బ్రిటిష్ మీడియాకు చెప్పారు. థాయ్‌లాండ్ ఉత్తర సరిహద్దు ప్రాంతాలైన ప్రీహ్ విహార్, ఒడ్డార్‌మీన్చేల వద్ద థాయ్‌లాండ్ సైనికులు ప్రతీకార కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో కాంబోడియా సరిహద్దు గ్రామీణ ప్రజలు మరణించారు. దీంతో భయభ్రాంతులైన వేలాదిమంది ప్రజలు గ్రామాలు ఖాళీచేసి వెళ్ళిపోతున్నారు. సరిహద్దుల్లో విధంగా తరచు తమ జీవనానికి విఘాతం కలగడంతో, తాత్కాలిక శిబిరాలలోకి పరుగులు తీయలేక స్థానిక గ్రామీణ ప్రజలు తీవ్ర మనోవ్యథ చెందుతున్నారు. థాయ్‌లాండ్ ఈశాన్య సిసా కెట్, ఉబోన్ రాట్చథాని ప్రాంతాలలో కూడా రెండు దేశాల సైనికులమధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఏడాది జులైనెలలో ఈ రెండు దేశాల మధ్య సరిహద్దు ఘర్షణలు జరిగాయి. ఇరువైపులా సైనిక నష్టం,పౌర నష్టం సంభవించింది. మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం ఈ రెండు దేశాలమధ్య మధ్యవర్తిత్వం చేశారు. ఆ తర్వాత అక్టోబరునెలలో డోనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఒక ఒప్పందం కుదిరింది. తర్వాత చైనా కూడా జోక్యం చేసుకుని సర్దుబాటు చేసింది. జులై తర్వాత మళ్ళీ అంతపెద్దస్థాయిలో సరిహద్దు ఘర్షణ చెలరేగడం ఇదే. మీరంటే మీరే మొదట కాల్పులకు పాల్పడ్డారంటూ రెండు దేశాలూ తగవుపడ్డాయి. కానీ ఇప్పుడు కాంబోడియా మొదట తమ సైనికుణ్ణి చంపడంవల్లనే ఘర్షణ మొదలైందని థాయ్‌లాండ్ చెబుతున్నది. తాజా ఘర్షణలపై థాయ్‌లాండ్ ప్రధానమంత్రి అనుతిన్ ఛర్న్‌విరాకుల్ స్పందిస్తూ, తగిన పద్ధతులలో తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామన్నారు. 1950లో ఫ్రాన్స్ నుండి కాంబోడియా స్వాతంత్ర్యం పొందినప్పటినుండీ థాయ్‌లాండ్‌తో సరిహద్దు ఘర్షణలు మొదలయ్యాయి. కాంబోడియాలోని డాంగ్రెక్ పర్వతాలలో ఖ్మెర్ సామ్రాజ్యకాలంలో నిర్మించిన పురాతన హిందూ దేవాలయం 'ప్రీహ్‌విహార్' (దేవతల విహారం)పై ఆధిపత్యం కోసం ఈ రెండు దేశాలమధ్యా ప్రధానంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణలను కుదుటపరచడానికి తాము మళ్ళీ మధ్యవర్తిత్వం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పొరుగున ఉన్న మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం ప్రకటించారు. సంయమనం పాటించాలని కోరారు.

## పోటీ విదేశాలతోనే (మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించారు. దేశ, విదేశాల నుంచి ప్రముఖులు హాజరైన సదస్సులో ముఖ్యమంత్రి తెలంగాణ భవిష్యత్తు కోసం నిర్దేశిత లక్ష్యాలను సవివరంగా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ తెలంగాణను దేశంలో ఒక సమున్నతమైన స్థానంలో నిలపాలన్న దృఢ సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్–2047 విజన్‌తో ముందుడుగు వేసిన తెలంగాణ రాష్ట్ర ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభిలషించారు. దీక్షా సంకల్పంతో నిర్దేశించుకున్న లక్ష్య సాధనలో అందరి మద్దతు, సహాయ సహకారాలు కావాలని పారిశ్రామిక వేత్తలు, నిపుణులు, మేధావులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'నిన్నటి కంటే నేడు నాలో మరింత నమ్మకం పెరిగింది. నిన్నటి రోజున అదొక కల, ఒక ప్రణాళిక. ఇప్పుడు మీరంతా మాకు మద్దతుగా నిలిచారు. దృఢసంకల్పంతో సాగిస్తున్న తెలంగాణ ప్రయాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నాం. మీ అందరి మద్దతు, సహకారంతో లక్ష్యాలను సాధించగలం' అని సిఎం అన్నారు.

''దేశానికి స్వాతంత్రం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకుని ఉత్సవాలు చేసుకునే 2047 నాటికి యువ రాష్ట్రమైన తెలంగాణ ఏం సాధించగలదని నిపుణులతో ఆలోచన చేసినప్పుడు 'తెలంగాణ రైజింగ్–2047' ఆలోచనలకు బీజం పడింది. భవిష్యత్తు కోసం లక్ష్యాలను నిర్ణయించుకుని సాధించాలని సంకల్పించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో దేవుళ్ల ఆశీర్వాదం తీసుకోవడం, ప్రజల మద్దతు, సహకారం కోరడం తమ సంప్రదాయం. తెలంగాణ భవిష్యత్తు కోసం రూపొందించుకున్న విజన్ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రాన్ని సేవా రంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం అనే మూడు ప్రాంతాలుగా విభజన చేశాం. ఈ మూడు ప్రాంతాల్లో స్పష్టమైన విధానాలతో దేశంలోనే తెలంగాణను మొట్ట స్థానంలో నిలపాలన్న లక్ష్యాలను నిర్దేశించాం. వాటినే కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్), పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), గ్రామీణ వ్యవసాయ రీజియన్ ఎకానమీ (రేర్) అనే మూడు ప్రత్యేక మండళ్లుగా విభజన చేశాం. ఈ లక్ష్యాల రూపకల్పనలో ప్రజల నుంచి అభిప్రాయాలను కోరాం. వారి అంచనాలు, ఆలోచనలు, కలలను మాతో పంచుకున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాం గం, అధికారులు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణులతో సంప్రదింపులు జరిపి వారి సహాయ, సహకారాలను తీసుకున్నాం'' అని అన్నారు.

తెలంగాణలో పదేళ్ల తర్వాత ఇప్పుడు దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నాలు ప్రారంభించామని, దేశంలో తెలంగాణ యువ రాష్ట్రం. తెలంగాణ రాష్ట్రం ఎంతో పెట్టుబడులకు సానుకూల వాతావరణం, ఎన్నో అవకాశాలున్నాయన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, అలాగే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దేశ జనాభాలో తెలంగాణ దాదాపు 2.9 శాతం కలిగి ఉందని, జాతీయ జిడిపిలో దాదాపు 5 శాతం వాటాను అందిస్తున్నామని, 2047 నాటికి, దేశ జిడిపిలో 10 శాతం వాటాను తెలంగాణ అందించే విధంగా తీర్చిదిద్దాలనుకుంటున్నామని సిఎం వివరించారు. 'చైనాలోని గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ ఆర్థిక వ్యవస్థ చైనాలోని ఏ ఇతర ప్రావిన్స్‌లోనైనా అతిపెద్దది. ఇరవై ఏళ్లలో వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులు సాధించడమే కాకుండా వృద్ధిని సాధించారు'' అని సిఎం ఉదహరించారు. గ్వాంగ్‌డాంగ్ తరహాలో తెలంగాణలో కూడా ఆ నమూనాను అందిపుచ్చుకోవాలని నిర్ణయించామన్నారు.

## రాజకీయ రంగు (మొదటి పేజీ తరువాయి)

సేవలకు చిన్న కళంకాన్ని కూడా వారు ఆపాదించలేరని ఉద్ఘాటించింది. 'వందేమాతరం' గీతానికి ఒక అర్హనీయమైన ప్రాముఖ్యత ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ, ఈ గీతంలో 'వందేమాతరం' ను స్వాతంత్ర్య పోరాటంలో ఒక రాజకీయ నినాదంగా మాత్రమే చూడకుండా దానికి జాతీయగీతం హోదాను ఇచ్చింది కాంగ్రెస్‌పార్టీ అని స్పష్టం చేసింది. 'వందేమాతర గీతాన్ని, దాని సారాంశాన్ని పూర్తిగా ప్రజలకు చేరనివ్వకుండా సామాజిక సామరస్యం పేరుతో ఆ గీతాన్ని కాంగ్రెస్‌పార్టీ ముక్కలు ముక్కలు చేసేసిందని నరేంద్రమోదీ విమర్శించడంతో లోక్‌సభలో కాంగ్రెస్ తీవ్రస్థాయిలో పైవిధంగా ప్రతిస్పందించింది.

రోజంతా జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ పక్ష ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ, 'వందేమాతరం' మొత్తం గీతాన్ని బహిష్కరించాలని ఒక్క ముస్లిం లీగ్ పార్టీ మాత్రమే కోరుకుందని గుర్తుచేశారు. వందేమాతర గీతంతో తనకు ఎలాంటి సమస్యలూ లేవని కాంగ్రెస్ నేత మౌలానా అబుల్ కలాం ఆజాద్ చెప్పారని, మహ్మద్ అలీ జిన్నాకు, కాంగ్రెస్‌పార్టీకి మధ్య ఉన్న తేడా అదేనని అన్నారు. ముస్లిం లీగ్, హిందూమ హాసభ ఎంతగా ఒత్తిడి తీసుకువచ్చినా గానీ, ఎంతగా నిరసన తెలియజేసినాగానీ లొంగిపోకుండా 1937 నాటి కాంగ్రెస్ సమావేశంలో 'వందేమాతరం' గీతంలోని మొదటి రెండు చరణాలను జాతిజనులందరికీ చేరువ చేయాలని పార్టీ తీర్మానించిందన్నారు. బ్రిటిష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించేందుకే కాంగ్రెస్‌పార్టీ 'వందేమాతరం' నినాదం ఇచ్చిందన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో మీ పూర్వీకులు ఎప్పుడైనా వందేమాతర నినాదం చేశారా? మీ పూర్వీకులు ఎప్పుడైనా బ్రిటిష్ పాలకులను వ్యతిరేకించారా? ఎప్పుడు వ్యతిరేకించారు? క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపు ఇచ్చినప్పుడు మీ రాజకీయ పూర్వీకులు ఎక్కడున్నా రు? అని ప్రశ్నించారు. ఒక్కరు కూడా ఆ ఉద్యమం లో పాల్గొనలేదని ఆయన గుర్తుచేశారు. యావత్ దేశం 'జనగణమన' గీతాన్ని జాతీయ గీతంగా ఆమోదించిన తర్వాత 52 సంవత్సరాలపాటు మీ రాజకీయపూర్వీకులుగానీ, మీరు గానీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయలేదు, మీ బ్రాంచీ కార్యాలయాలలో జనగణమన గీతాన్ని ఆలపించలేదని విమర్శించారు. ఈనాడు దేశ ప్రజలు ఎన్నో సమస్యలను ప్రస్తావిస్తున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలో వాటికి పరిష్కారాలు చెప్పలేదన్నారు. దేశ రాజధానిలో బాంబు పేలుడు జరిగితే ప్రధానమంత్రి సమాధానం చెప్పలేదని విమర్శించారు. ''ఈనాడు వందేమాతరగీతోత్సవా న్ని చేసుకుంటున్నాం, కానీ ప్రస్తుత భారతావనికి మనం భద్రతను సమకూర్చగలుగుతున్నామా?'' అని గొగోయ్ ప్రశ్నించారు.

### బెంగాల్ ఎన్నికలకోసమే ఈ చర్చంతా ప్రియాంకాగాంధీ విమర్శ

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు సమీపిస్తున్నందువల్లనే వందేమాతర గీతంపై కేంద్ర ప్రభుత్వం చర్చను కోరుకుంటున్నదని కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి, ఆ పార్టీ ఎంపి ప్రియాంకా గాంధీ వాద్రా విమర్శించారు. వందేమాతర గీతంపై జరిగిన చర్చలో ఆమె పాల్గొంటూ, నరేంద్ర మోదీ ఆత్మవిశ్వాసం రోజు రోజుకూ దిగజారుతోందని, ఆయన విధానాన్ని దేశాన్ని బలహీన పరుస్తున్నాయని, ఆయన ప్రధానమంత్రి కాదని విమర్శించారు. దేశ స్వాతంత్ర్యంకోసం పోరాటం చేసినవారిపై ఆరోపణలు గుప్పించడంకోసమే ప్రభుత్వం ఈ చర్చ ప్రారంభించిందని విమర్శించారు. జాతీయ గీత ప్రాముఖ్యతను, పూర్వపు దేశ నాయకులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఆమె వివరించారు.ఈ ప్రభుత్వం వర్తమానాన్ని, భవిష్యత్తును పట్టించుకోవాలని కోరుకోవడంలేదన్నారు. వందేమాతరగీతానికి ఉన్న ప్రాముఖ్యతను, దాని చారిత్రక పరిణామ క్రమాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలని ప్రియాంకాగాంధీ వాద్రా కోరారు.

### హిందూగీతంగా భావించినవారే ఈ వివాదం సృష్టించారుఃడిఎంకె

వందేమాతర గీతాన్ని హిందూమత జాతీయ గీతంగా భావించినవారే ముస్లింలను వేరుచేసి ఈ గీతంపై వివాదం సృష్టించారని డిఎంకె ఎంపి ఎ. రాజా లోక్‌సభలో విమర్శించారు. వందేమాతరగీతంపై చర్చలో ఆయన పాల్గొంటూ, ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో ముస్లింలను వేరుచేసి ఈ గీతాన్ని హిందూమత గీతంగా భావించినవారే ఈ వివాదం సృష్టించారన్నారు. ప్రధానమంత్రి ప్రసంగం ప్రధానంగా నాలుగు మౌలిక ప్రశ్నలు అందరి బుర్రల్లో లేవనెత్తాయన్నారు. వందేమాతర గీతాన్ని ముక్కలు ముక్కలుగా చేసింది ఎవరని తాను తెలుసుకోవాలనుకుంటున్నానని, వందేమాతర గీతం దేశాన్ని విభజించిందా? అని ప్రశ్నించారు. ఒకవేళ విభజన వస్తే ఆ విభజన ఏమిటో ఈనాడు ఎవరు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందో చెప్పాలన్నారు. ఆలోచనల్లో గనుక ఈ గీతంలో భేదాభిప్రాయాలు వస్తే భేదం ఎక్కడ ఉంది? ఎవరిలో ఉంది? అని తాను ఈ సభను అడిగి తెలుసుకోవాలనుకుంటున్నానన్నారు. వందేమాతర గీతం కేవలం బ్రిటిష్ వారికి మాత్రమే కాకుండా ముస్లింలకు కూడా వ్యతిరేకం అని నమ్మేవారు, లేదా అలాంటి నిర్ణయానికి వచ్చిన వారే ఆలోచనలలో భేదాభిప్రాయాలకు కారణమన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి కకోలీ ఘోష్ దస్తిదర్ మాట్లాడుతూ, వందేమాతరం కేవలం భారతదేశ జాతీయ గీతం మాత్రమే కాదని, స్వాతంత్ర్యపోరాటంలో లక్షలమంది పాడుకున్న గొప్పవారసత్వ గీతమని అన్నారు. ఈ గీతాన్ని రాసిన బంకిం చంద్ర చట్టోపాధ్యాయను కించపరిస్తే బెంగాలీ ప్రజలు సహించబోరని అన్నారు. బెంగాల్‌పట్ల అగౌరవాన్ని సహించబోమని, దీనికి న్యాయం జరగాలని తాము కోరుకుంటున్నామన్నారు. ఎలా పోరాటం చేయాలో బెంగాలీయులకు బాగా తెలుసుననీ, జైహింద్ నినాదాన్ని సుభాష్ చంద్రబోస్ ఇచ్చారని గుర్తుచేశారు. జనగణమన గీతాన్ని రవీంద్రనాథ్ రాశారని, ఆయనను బిజెపి ఎంపి విశ్వేశ్వర్ హెగ్డే అగౌరవించారని విమర్శించారు.

### స్వాతంత్ర్యపోరాటం చేయనివారా మాట్లాడేది?

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొననివారంతా ఈరోజు వందేమాతర గీతం గురించి మాట్లాడుతున్నారని సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ బిజెపిని ఉద్దేశించి లోక్‌సభలో విమర్శించారు. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొననివారు ఈరోజు వందేమాతరం విలువల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఒకరి నమ్మకాలను ఇతరులపై రుద్దడానికి ఒక ఆయుధంగా జాతీయ గీతాన్ని ఉపయోగించుకోకూడదని హెచ్చరించారు. దేశంలోఇతరులను విమర్శించడానికి వందేమాతర గీతం ఒక రాజకీయ ఆయుధం కాద ని అన్నారు.

ఈనాడు దేశంలో భేదాభిప్రాయాలు సృష్టించే శక్తులు వందేమాతర గీతాన్ని విభేదాలు సృష్టించడంకోసం ఆయుధంగా ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. దేశాన్ని ఐక్యం చేయడంలో వందేమాతరగీతం స్వాతంత్ర్యపోరాటకాలంలో కీలకపాత్ర వహించిందన్నారు.

# దారుణ హత్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్/ బైంసా:** రాష్ట్రంలో సోమవారం రెండు వేరు వేరు ప్రాంతాలలో జరిగిన దారుణ హత్యలు తీవ్ర కలకలం సృష్టించాయి. ఒకటి పెళ్లికి నిరాకరించడంతో.. ఇంటర్ విద్యార్థిని దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగు చూడగా రెండవది అక్రమ సంబంధం అనుమానంతో హత్య చేసిన సంఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలోని బైంసా పట్టణంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వారాసిగూడలో ఓ యువకుడు ఇంటర్ విద్యార్థినిని ఆమె తల్లి కళ్లెదుటే గొంతుకోసి అతి కిరాతకంగా హత్య చేశాడు. మృతురాలిని పవిత్రగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఇంటర్ చదువుతున్న పవిత్ర (17)కు ఉమాశంకర్ వరుసకు మేనమామ అవుతాడు. ఆమెను వివాహం చేసుకోవాలని భావించాడు. అయితే, ఉమాశంకర్ మద్యానికి బానిస అనే కారణంతో ఆమె అతడితో పెళ్లికి నిరాకరించింది. ఈ క్రమంలో ఉమాశంకర్ పవిత్రపై కోపం పెంచుకున్నాడు. పవిత్రతో మాట్లాడుతూనే, అకస్మాత్తుగా తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతు కోశాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. కూతురిని కాపాడుకునేందుకు తల్లి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. హత్య చేసిన వెంటనే నిందితుడు ఉమాశంకర్, తన కత్తిని, మొబైల్ ఫోన్‌ను ఘటనాస్థలంలోనే వదిలేసి పరారయ్యా డు. సమాచారం అందుకున్న వారాసిగూడ పోలీసులు, క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆధారాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు పోలీసులు తెలిపారు. 'హత్యకు గల కచ్చితమైన కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసు అధికారులు వెల్లడించారు.

### అక్రమ సంబంధం అనుమానంతో హత్య

నిర్మల్ జిల్లాలోని బైంసా పట్టణంలో కుంసర గ్రామానికి చెందిన జోంద్లె అశ్విని (30) అనే మహిళను ఆమె ప్రియుడు కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. హత్య అనంతరం నిందితుడు మృతదేహం పక్కనే కూర్చుండిపోవడం స్థానికంగా భయాందోళనలకు గురి చేసింది. వివరాల్లోకి వెళ్తే జోంద్లె అశ్విని గత పది సంవత్సరాలుగా తన మొదటి భర్త జోంద్లె సంతోష్‌కు దూరంగా ఉంటోందని, గత సంవత్సరం నుండి బైంసాలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఇప్పారె నాగేశ్‌తో సహజీవనం చేస్తోంది. వీరిద్దరూ బైంసాలో కలిసి ఉంటున్నారు. సుమారు ఐదు నెలల క్రితం నాగేశ్ తన సొంత డబ్బులతో అశ్విని కి బైంసాలోని ఒక కాలనీలో టీ స్టాల్ ఏర్పాటు చేశాడు. అయితే, ఇటీవల అశ్విని వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటూ చాటింగ్ చేస్తోందనే అనుమానం నాగేశ్‌కు బలపడింది. ఈ అనుమానంతో రగిలిపోయిన నాగేశ్, సోమవారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో ఆమె టీ స్టాల్‌లోకి వెళ్లి తీవ్ర వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత ఆగ్రహంతో వెం ట తెచ్చుకున్న కత్తితో అశ్వినిని విచక్షణారహితంగా పొడిచి దారుణంగా హత్య చేశాడు. హత్య సమయంలో అశ్విని వేసిన కేకలు విన్న స్థానికులు



షట్టర్ తెరవడానికి ప్రయత్నించినా కుదరలేదు. దీంతో వెంటనే వారు బైంసా పోలీసులకు సమాచారం అందించారు. ఘట నా స్థలానికి చేరుకున్న పోలీసులు షటర్‌ను తెరిచి చూడగా.. రక్తపు మడుగులో అశ్విని మృత దేహం, ఆమె పక్కనే నాగేశ్ కూర్చుని ఉండడం చూసి నిర్ఘాంత పోయారు. పోలీసులు నాగేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ సంబంధం అనుమానమే ఈ హత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు లోతుగా దర్యాపు చేస్తున్నారు.

### వేట కొడవళ్లతో నరికి, గన్‌తో షూట్ చేసి నడి రోడ్డుపై రియల్టర్ దారుణ హత్య

**మేడ్చల్ మల్కాజిగిరి:** స్కూటర్‌పై వెడుతున్న రియల్టర్ వెంకటరత్నం(46)ను మాటు వేసి నడిరోడ్డుపై దుండగులు కత్తితో నరికి గన్‌తో షూట్ చేసి అతి కిరాతకంగా హతమార్చిన ఉదంతం సోమవారం మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సాకేత్ కాలనీలోని ఫోస్టర్ బిల్లా బాంగ్ స్కూల్ సమీపంలో చోటు చేసుకొంది. ధూల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో హతుడిపై రౌడీ షీట్ నమోదు అయి ఉందని, గతంలో జరిగిన జంట హత్యల కేసులో నిందితుడని పోలీసులు తెలిపారు. పాత పగల కారణంగా ప్రత్యర్థులు



పథకం ప్రకారం హతమార్చారా లేక మరేదైనా కారణాలున్నాయా అన్న కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. మల్కాజిగిరి ఎసిపి శ్రీధర్ మాట్లాడుతూ క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందాలతో కేసు విచారిస్తున్నామన్నారు.

## ముందుకెళ్తోంది (మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత, భవిష్యత్తు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా వృత్తి, సాంకేతికత ఆధారిత శిక్షణ ద్వారా నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని నిర్మించడంపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించిందన్నారు. సమ్మిళిత వృద్ధి, స్థిరత్వం, ఆవిష్కరణలపై నిర్మించబడిన వికసిత్ భారత్ జాతీయ లక్ష్యంతో తెలంగాణ అభివృద్ధి రోడ్ మ్యాప్ సమానంగా ఉంటుందన్నారు. బలమైన మౌలిక సదుపాయాలు, ప్రగతిశీల పాలన తెలంగాణను ఈ మార్గంలో దృఢంగా ఉంచుతాయన్నారు. ప్రభుత్వాలు ప్రజల నిర్వాహకులుగా వ్యవహరిస్తాయని, జవాబుదారీతనం విశ్వాసాన్ని బలపరుస్తుందన్నారు. తెలంగాణ దార్శనికత స్పష్టమైన మైలురాళ్ళు, స్థిరమైన పురోగతి ద్వారా నిర్వచించబడుతుందన్నారు. భవిష్యత్తును నిర్మించడానికి గతం నుండి నేర్చుకోవడం చాలా అవసరమని, న్యాయం, శ్రేయస్సు, ఐక్యత కోసం దాని సాధన ద్వారా తెలంగాణ అభివృద్ధి ఈ అవగాహనను ప్రతిబింబిస్తుందన్నారు. దూరదృష్టి, సంకల్పం రాష్ట్రాన్ని ప్రణాళికలను స్పష్టమైన ఫలితాలుగా మార్చడానికి, మొత్తం సమాజానికి ప్రయోజనం చేకూర్చే వృద్ధి నమూనాను రూపొందించడానికి వీలు కల్పించాయన్నారు. తెలంగాణలో ఏర్పడుతున్న అవకాశాలను ప్రపంచం గమనిస్తున్నందున, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే తెలంగాణ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని తాను దృఢంగా చెప్పగలనన్నారు. ప్రజాస్వామ్య, సామాజిక, ఉదారవాద విలువలపై కొత్త దృష్టి ఉందని, ఇక్కడ పౌరుల గొంతులు మరింత స్పష్టంగా వినిపిస్తాయని, పారదర్శకత, జవాబుదారీతనం, చురుకైన నిర్ణయాలు, క్రమం తప్పకుని కార్యాచరణను నివేదించడం వల్ల ప్రజలు, ప్రభుత్వం మధ్య నమ్మకం బలపడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మహిళలు, రైతులు, యువత, పిల్లలతో కూడిన సమ్మిళిత వృద్ధి కథను తెలంగాణ ఎంచుకుంటోందన్నారు. 'స్వయం సహాయక బృందాలు, రిటైల్ సంస్థలు, సౌర ప్రాజెక్టులు నడుపుతున్న ఎలక్ట్రిక్ బస్సులు వంటి చొరవల ద్వారా మహిళా సాధికారత ముందుకు సాగుతోంది. మహిళలను ఆర్థిక వ్యవస్థకు చురుకైన సహకారులుగా చేస్తుంది. మహిళా సంఘాల ద్వారా చెరువుల నిర్వహణతో సహా పర్యావరణ పునరుద్ధరణ, పర్యావరణ శాస్త్రం, జీవనోపాధి రెండింటికీ మద్దతు ఇస్తోంది. మహాత్మా గాంధీ యంగ్ ఇండియా స్ఫూర్తితో పాఠశాలల్లో సమాజిక భాగస్వామ్యం ద్వారా విద్య అభివృద్ధి చెందుతోంది. నైపుణ్యాలు, క్రీడా విశ్వవిద్యాలయాలు యువతను ప్రస్తుత, భవిష్యత్తు అవకాశాల కోసం సిద్ధం చేస్తున్నాయి. భవిష్యత్తు నేడు చేసే పనిపై ఆధారపడి ఉంటుంది. తెలంగాణ విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు, పునరుత్పాదక ఇంధనం, రవాణా నెట్‌వర్క్‌లు, స్మార్ట్ జోనింగ్ 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకునే లక్ష్యంతో ఆధునిక రాష్ట్రాన్ని రూపొందిస్తున్నాయి స్థిరమైన, స్పష్టమైన విధానాలు పెట్టుబడులు, ఆవిష్కరణలను ఆకర్షిస్తూనే ఉన్నాయి. మహిళా కళాకారులకు మద్దతు ఇవ్వడం, విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేయడం అనే గిగ్‌వర్కర్ల విధానం, ఏర్పడుతున్న అవసరాలకు, ప్రతిస్పందనకు ఒక ఉదాహరణ అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఫ్యూచర్ సిటీకి అన్నపూర్ణ స్టూడియోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫ్యూచర్ సిటీకి అన్నపూర్ణ స్టూడియోస్ వెళ్తుంది. గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున మీడియాతో మాట్లాడుతూ.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సులో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చింది అని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్ చాలా అద్భుతంగా ఉందని నాగార్జున ప్రశంసించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న 'ఫ్యూచర్ సిటీ'కి తమ అన్నపూర్ణ స్టూడియోస్‌ను కూడా తీసుకురాబోతున్నట్లు నాగార్జున ప్రకటించారు. అలాగే, ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ఒక ప్రత్యేకమైన 'ఫిలిం హబ్'ను ఏర్పాటు చేసే దిశగా ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రణాళికలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి కూడా చోటు కల్పించడం పట్ల హీరో నాగార్జున హర్షం వ్యక్తం చేశారు.

## 'త్రీ ట్రిలియన్' సంఖ్య కాదు...

TELANGANA RISING GLOBAL SUMMIT

# తెలంగాణ రూపాన్ని మార్చే శక్తి

### తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



తెలంగాణ విజన్ డాక్యుమెంట్ మూసిన గదుల్లో రాసిన పత్రం కాదని, ప్రముఖుల సలహాలు, నిపుణుల చర్చలు, పౌరుల అభిప్రాయాలతో వచ్చిన ప్రజాస్వామ్యబద్ధంగా రూపొందించిన విధాన పత్రమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇది ప్రభుత్వ పత్రం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల పత్రమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ దూరదృష్టి ఒక సంవత్సరం కోసమో, ఒక ఎన్నికల కాలం కోసమో కాదని, 2047 వరకూ ఉన్న దీర్ఘకాల లక్ష్యంతో నిర్మించిన విజన్ అన్నారు. తెలంగాణ విజన్ నాలుగు స్తంభాలపై నిలబడి ఉందని, అందులో మొదటిది 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యామన్నారు. ఇది కేవలం నినాదం కాదని, అన్ని రంగాల వారీగా, జిల్లాల వారీగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అని వివరించారు. ఆర్థికాభివృద్ధి, పర్యావరణం ఒకదానికొకటి విరుద్ధం కాదని, ఇకపై ఇవి పరస్పర సహకారాలుగా ఉండనున్నాయని అన్నారు. 2047 నాటికి నెట్ జీరో సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తెలంగాణకు ఆశయాల కొరత ఎప్పుడూ లేదని, కానీ ఎంతో కాలంగా ప్రజల శక్తిని, వారి ఆశలను, సామర్థ్యాన్ని ఒకే దారిలో నడిపించే సమగ్ర దృష్టి మాత్రమే కొరవడిందని, అందుకే నేడు ఆ సమగ్ర డాక్యుమెంటును ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం సంఖ్య కాదని, తెలంగాణ వాస్తవాన్ని మార్చే శక్తి అన్నారు. ప్రతి పాఠశాలకు, ప్రతి ఆవిష్కరణకు, ప్రతి గ్రీన్ ఇనిషియేటివ్‌కు కావాల్సిన ఆర్థిక బలం, ఇది మూలధనంపై నమ్మకం మాత్రమే కాదని సృజనాత్మకత, సామర్థ్యం, ధైర్యంపై తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి వివరించారు.

### హైదరాబాద్ కేవలం రాష్ట్రానికి రాజధాని నగరం కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం
### కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



హైదరాబాద్ కేవలం ఓ రాష్ట్రానికి రాజధాని నగరం కాదని, దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభం లాంటిదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం దేశంలోనే నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఉందని, త్వరలోనే మూడో స్థానానికి ఎగబాకుతుందనడంలో సందేహం లేదన్నారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో మంత్రి కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ ప్రధాని మోదీ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణకు, ముఖ్యంగా హైదరాబాద్‌కు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నానన్నారు. హైదరాబాద్ నగరం అంటేనే సాంకేతికతతో సంప్రదాయం, శాస్త్రపరిజ్ఞానంతో ఆధ్యాత్మికత, వారసత్వ సంపదతో సృజనాత్మకత కలగలిసి ఉంటాయని, తెలంగాణ ఏర్పడిన 2014లోనే మార్పు, పారదర్శకత నినాదంతో ప్రధాని మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చారన్నారు. ఐటి హబ్‌గా, ఇన్నొవేషన్ కారిడార్‌గా, ఫార్మాసూటికల్ క్యాపిటల్‌గా, ఏరోస్పేస్ టెక్నాలజీ సెంటర్‌గా వర్ధిల్లుతోందని, ఈ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని మరింత పెంచేందుకు అందరం కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2047 నాటికి భారతదేశం వికసిత్ భారత్‌గా వెలుగొందాలని తరచూ ప్రధాని మోదీ పిలుపునిస్తున్నారని, రాష్ట్రాల కీలక సహకారంతోనే ఈ కల సాకారమవుతుందన్నారు. 2014 నుంచి 25 వరకు 748.78 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయని, అంతకుముందు దశాబ్దంతో పోలిస్తే ఏకంగా 143 శాతం వృద్ధి నమోదు కావడం విశేషమన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పాలన పెరిగిందని, దీంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరిగిందని, భారత్‌ను పెట్టుబడులకు సురక్షితమైన దేశంగా అంతర్జాతీయ పెట్టుబడిదారులు భావిస్తున్నారన్నారు. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పన్నుల, గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల రూపంలో రూ.10 లక్షల కోట్లకు పైగా నిధులను అందించిందని, తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.1.5 లక్షల కోట్లు కేటాయించి, కారిడార్లు, రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారులు, ఎకనామిక్ కారిడార్లను కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. రైల్వే కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు, ఎలక్ట్రిఫికేషన్, సిగ్నలింగ్ వంటి పనుల కోసం రూ.32 వేల కోట్లు కేటాయించిందని, ఇవన్నీ కూడా తెలంగాణను దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు.

### 'ఫీనిక్స్' పక్షి స్ఫూర్తితోనే 'తెలంగాణ రైజింగ్'కు శ్రీకారం
### మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



భావితరాల ఆశయాలు, అవసరాలకు అనుగుణంగా 'రేపటి తెలంగాణ' కోసమే 'ఫీనిక్స్' పక్షి స్ఫూర్తితో ఇన్నోవేషన్, హ్యూమన్ క్యాపిటల్, సస్టైనబులిటీ, గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్‌గా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతోనే 'తెలంగాణ రైజింగ్'కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న 'ఎకనామిక్ రీఅలైన్‌మెంట్స్, టెక్నలాజికల్ డిస్రప్షన్, క్లైమేట్ అన్‌సెర్టైనిటీ' లాంటి సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు దార్శనికతతో కూడిన అడుగులు వేస్తున్నామన్నారు. ఈ ప్రయాణంలో తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో తమ ప్రభుత్వం వేసిన తొలి అడుగు 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' అని అన్నారు. భౌగోళిక విస్తీర్ణం, జనాభాలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ చిన్నదే అయినా దేశ జిడిపిలో మాత్రం 5 శాతం వాటాను కలిగి ఉందన్నారు. 2024–2025 లో రాష్ట్ర జిఎస్‌డిపి వృద్ధి రేటు 10.1 శాతం కాగా, జాతీయ సగటు 9.9 శాతంగా నమోదు అయ్యిందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు, జాతీయ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ అని వివరించారు. రాష్ట్ర ఇండస్ట్రియల్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎకానమీ వృద్ధి రేటు 7.6 శాతం కాగా, జాతీయ సగటు 6.6 శాతం మాత్రమే అన్నారు. రాష్ట్ర సేవల రంగం వృద్ధి రేటు 11.9 శాతంగా కాగా, అదే జాతీయ సగటు 10.7 శాతంగా ఉందన్నారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ జిఎస్ విఎ 12.6 శాతం వృద్ధి రేటుతో రూ.2.46 లక్షల కోట్ల నుంచి రూ.2.77 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, మైనింగ్, క్వారీయింగ్, ఎలక్ట్రిసిటీ, గ్యాస్, వాటర్, ఇతర యుటిలిటీస్ లాంటి ఇండస్ట్రియల్ సబ్ సెక్టార్లలోనూ తెలంగాణ వృద్ధి రేటు జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదు కావడం తమ ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు నిదర్శనమని మంత్రి వివరించారు.

### రూ.25వేల కోట్లతో గ్రీన్ డేటా సెంటర్ :
### కరణ్ అదానీ



తెలంగాణ విజన్‌ను గ్లోబల్ సమ్మిట్ ప్రతిబింబిస్తోందని, రూ.25వేల కోట్లతో 48 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ ప్రకటించారు. తెలంగాణలో ఇప్పటికే అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టిందని, 'గ్రీన్ డేటా సెంటర్స్, రెన్యువబుల్ ఎనర్జీలో ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్నామన్నారు. సిమెంట్ రంగంలో కూడా అదానీ గ్రూప్ పెట్టుబడులు పెడుతోంది. డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్ ఏర్పాటు చేసిందన్నారు. లాజిస్టిక్స్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నిస్తోందని, రూ.4వేల కోట్లతో రహదారి సౌకర్యాలు కల్పించనున్నామని, రాష్ట్రంలో జిల్లాలను కలిపే రహదారులను అదానీ గ్రూప్ నిర్మిస్తోందని, రూ.2 వేల కోట్లతో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసిందన్నారు. దేశంలో తొలిసారిగా యుఎవి టెక్నాలజీ హైదరాబాద్‌లో రూపొందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో తయారయ్యే యువిలను సైన్యానికి అందిస్తామని, ప్రపంచ మార్కెట్లోనూ విక్రయిస్తామన్నారు.

### వికసిత్ భారత్ లక్ష్యం దిశగా తెలంగాణ
### కైలాస్ సత్యార్థి




తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తున్నదని నోబెల్ బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి అన్నారు. దాదాపు 20 లక్షల మంది రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడం గొప్ప విషయమన్నారు. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా తెలంగాణ రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూ మార్గంలో రేవంత్ రెడ్డి పాలన నడుస్తోందని కితాబిచ్చారు.

### తెలంగాణలో ట్రంప్ మీడియా టెక్నాలజీస్ లక్ష కోట్ల పెట్టుబడులు
### ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ ప్రకటన



తెలంగాణలో ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. రానున్న పదేళ్లలో తెలంగాణలో 1 లక్ష కోట్లపెట్టుబడులు పెట్టడానికి నిర్ణయించుకున్నట్లు ట్రంప్ మీడియా టెక్నాలజీస్ సంస్థ డైరెక్టర్ ఎరిక్ స్వైడర్ ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. భారత దేశంలో అద్భుతమైన నైపుణ్య మానవ వనరులున్నాయని, ప్రపంచ టెక్నాలజీ రంగంలో ఇండియానే పెద్దన్నగా కనబడుతుందని, ఇది ఎవరికి కనబడడంలేదన్నారు. ఇండియా రైజింగ్ రానున్న పదేళ్లలో భారతదేశం ప్రపంచ టెక్నాలజీ రంగంలో ముందుంటుందని చెప్పారు.'పెట్టుబడుల విషయానికొస్తే పెట్టుబడులు పెట్టే ముందు అంతా ఆలోచిస్తారు.
మన డబ్బు తిరిగి వస్తుందా, లాభాలు వస్తాయా అని. అంతిమంగా అంతా డబ్బే. నాకే కాదు ఎవరికైనా అంతే . అయితే అదే ప్రధానం కాకూడదు. స్వల్ప కాలిక ప్రయోజనాలు కాకుండా దీర్ఘకాలిక అంశాలు, అభివృద్ధి దృష్టిలో ఉంచుకోవాలి' అని అన్నారు.
ఈ ప్రపంచంలో పెట్టుబడులు అనేవి ఎక్కడ అభివృద్ధికి ఆస్కారం ఉంటే అక్కడికి నీటి ప్రవాహం వలే వెళతాయి. మన పెట్టుబడులకు ఆహ్వానం, గౌరవం అభివృద్ధి కనిపించిన చోటికే వెళ్లాలి. గత కొన్ని నెలలుగా మమ్మల్ని తెలంగాణకు ఆహ్వానిస్తునే ఉన్నారు కానీ కుదరలేదు ఆలస్యం జరిగింది. తెలంగాణ ముఖ్యముంత్రి రేవంత్ రెడ్డి మా పెట్టుబడులను ఆహ్వానించారు. ఇక్కడ అభివృద్ధికి గొప్ప అస్కారం ఉంది. చివరికి రాక తప్పలేదు' ఆయన వివరించారు.

### తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధం : సిఐఐ మాజీ చైర్మన్



ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరం ఆలోచన అభినందనీయమని కాన్ఫెడరేషన్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) మాజీ చైర్మన్ దినేశ్ అన్నారు. తెలంగాణ ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలను ఒకే వేదికపైకి రప్పించడం గొప్ప విషయమని, తెలంగాణ విజన్‌లో భాగస్వాములయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## విద్య, వైద్య రంగాలదే కీలక పాత్ర

### ప్యానెల్ డిస్కషన్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడంలో వైద్య, విద్యారంగాలు కీలక పాత్ర పోషించనున్నాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. తెలంగాణను ప్రపంచ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా విద్యా రంగంలో తెలంగాణను గ్లోబల్ సెంటర్‌గా తీర్చిదిద్దే వ్యూహం (తెలంగాణ యాజ్ ఏ గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్) అనే అంశంపై జరిగిన చర్చా వేదికలో మంత్రి మాట్లాడుతూ గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌లో జ్ఞాన సంపద పరస్పర మార్పిడి, నైపుణ్యశిక్షణకే అధిక ప్రాధాన్యం ఉంటుంది తప్పితే, కేవలం లాభార్జనే ధ్యేయంగా ఉండే విద్యా వ్యవస్థ ఉండబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వం బాలికా విద్యకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. 'పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చే అమ్మాయిలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి నర్సింగ్ వంటి వృత్తి విద్యా కోర్సులు ఎంతో దోహదపడతాయని, వారి కలలను సాకారం చేసేందుకే ప్రభుత్వం గతేడాది కొత్తగా 16 నర్సింగ్ కళాశాలలను ప్రారంభించిందన్నారు. కేవలం డిగ్రీలు ఇవ్వడమే కాకుండ, అంతర్జాతీయ స్థాయిలో వారికి ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.. ఇందుకోసం నర్సింగ్ విద్యార్థులకు జర్మన్, జపనీస్, ఇంగ్లీష్ భాషల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. తద్వారా మన ఆడబిడ్డలు విదేశాల్లోనూ రాణించేలా తీర్చిదిద్దుతున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. నైపుణ్యంతో కూడిన విద్యే అసలైన ఆస్తి అని, సామాన్యుడి ఆశయ సాధనకు విద్యే ప్రధాన ఆయుధమని అందుకే అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్యను అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు.
రాష్ట్రంలో ప్రస్తుతం 47 విశ్వవిద్యాలయాలు, 1,951 ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయని, దేశంలోనే అత్యధిక కళాశాల సాంద్రత కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానం కాగా, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో తెలంగాణ దేశంలోని టాప్5లో నిలిచింది.' అని మంత్రి వెల్లడించారు. సామాజిక అసమానతలను తొలగించి, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల కోసం 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని నెలకొల్పామన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆస్ట్రియాకు చెందిన ఆల్ఫా సంస్థతో కలిసి డ్యుయల్ అప్రెంటిస్‌షిప్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు.

## సమ్మిట్‌లో ఆకర్షణగా నిలిచిన రోబో




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2025' అట్టహాసంగా ప్రారంభం అయింది. అయితే ఈ సమ్మిట్లో ఏర్పాటు చేసిన హ్యూమనాయిడ్ రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమ్మిట్‌కు వస్తున్న అతిథులకు రోబో స్వాగతం పలుకుతూ సందడి చేసింది. సదస్సుకు వచ్చిన ప్రతినిధులు రోబోతో ఫోటోలు, వీడియోలు తీసుకోవడానికి ఎంతో ఆసక్తి చూపుతున్నారు.

## గ్లోబల్ సమ్మిట్‌లో స్పోర్ట్స్ స్టాల్, పర్యాటక స్టాల్

### ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ స్టాల్, డైరీ స్టాల్‌ను రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక, యువజన సర్వీసుల, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం ప్రారంభించారు. స్పోర్ట్స్ స్టాల్‌లో గోల్ఫ్, వాలీబాల్ ను కాసేపు సరదాగా ఆడారు. మంత్రి శ్రీహరితోపాటు స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబరితి, ఫిషరీస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పర్యాటకాన్ని విశ్వవ్యాప్తం చేయడమేలక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ పర్యాటక రంగాన్ని సరికొత్తగా ప్రపంచానికి పరిచయం చేస్తామని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు.

## రానున్న రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా ఫోర్ లేన్ల రోడ్లు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న రోజుల్లో తమ విజన్ ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా పూర్తిగా నాలుగు లేన్ల రోడ్లు రాబోతున్నాయని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైసింగ్ నినాదంతో మంత్రులందరం యూనిటీగా పనిచేస్తున్నామని చెప్పారు. ప్రపంచమంతా గ్లోబల్ సమ్మిట్ వైపు ఆసక్తిగా చూస్తున్నదని, 2034 వరకు 1 ట్రిలియన్ ఎకానమీ, 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, కొత్త ఎయిర్‌పోర్టులు, డ్రైపోర్ట్ నుండి కోస్టల్ ఏరియా కనెక్టివిటీ, సౌత్ ఇండియా స్టేట్స్ కనెక్టివిటీ కారిడార్, గ్రీన్ ఫీల్ హైవేలు లాంటి ప్రణాళికతో వెళ్తున్నామని వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, భారత్ ఫ్యూచర్ సిటీ నుండి అమరావతి, భారత్ ఫ్యూచర్ సిటీ నుండి బెంగళూరు, చెన్నై గ్రీన్ ఫీల్ రహదారులు, బుల్లెట్ ట్రైన్ కారిడార్లు రాబోతున్నాయని, ఇది రాష్ట్ర అభివృద్ధిలో గేమ్ చేంజర్‌గా నిలవబోతున్నాయన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో నంబర్ వన్ చేయడమే మా లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంతి పేర్కొన్నారు.

## తెలంగాణ కొత్త ఆశయంతో పురోగమిస్తుంది

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కొత్త ఆశయంతో పురోగమిస్తున్నందున తమ ప్రభుత్వం క్లీన్ మొబిలిటీని కేవలం పర్యావరణ లక్ష్యంగానే కాకుండా, ప్రజారోగ్యం, ఆర్థిక వృద్ధి, ఇంధన భద్రతతో పాటు పట్టణ నివాసయోగ్యతకు ప్రాథమిక స్తంభంగా చూస్తుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రీన్ మొబిలిటీ అనేది కేవలం నినాదం కాదని, ఇది ఒక సమిష్టి బాధ్యత, ఆర్థిక అవకాశమని చెప్పారు. 2047 నాటికి తెలంగాణ జీరో ఎమిషన్ మొబిలిటికి దిక్సూచిగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రీన్ మొబిలిటీ 2047 విజన్ కోసం సురక్షితమైన, స్మార్ట్, డిజిటల్, పారదర్శకమైన, స్థిరత్వ లక్ష్యాలతో పూర్తిగా అనుసంధానించబడిన రవాణా పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఎలక్ట్రిక్ మొబిలిటీని వేగవంతం చేయడానికి, తెలంగాణ రాష్ట్రం దేశంలో అత్యంత ఉదారమైన ఈవి ప్రోత్సాహక విధానాలలో ఒకదాన్ని ప్రవేశపెట్టిందన్నారు. డిసెంబర్ 31, 2026 వరకు అన్ని ఈవిలకు రోడ్డు పన్నుతో పాటు రిజిస్ట్రేషన్ రుసుమును 100 శాతం మినహాయింపు చేశామని చెప్పారు. పారదర్శక, సాంకేతికతతో నడిచే పరీక్షా పర్యావరణ వ్యవస్థను నిర్మించడం కోసం 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను (ఎటిఎస్) ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తోంది కాబట్టి చివరి మైల్ మొబిలిటీని స్థిరమైన పద్ధతిలో పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విభాగాలతో పాటు రాష్ట్ర కార్పొరేషన్లు తమ విమానాల కోసం ఏటా కనీసం 25 శాతం ఈవిలను కొనుగోలు చేయాలని, అద్దెకు తీసుకోవాలని ప్రతిపాదించామని వెల్లడించారు. సారథి వాహన్ ద్వారా డిజిటలైజేషన్‌తో పాటు సజావుగా వాహనాల కదలిక కోసం అన్ని రవాణా చెక్‌పోస్టుల రద్దు చేశామని, హైవేలు, నగర కారిడార్లలో ఎఐ ఆధారిత అమలు చేస్తున్నామన్నారు.అధునాతన డ్రైవింగ్ శిక్షణా సంస్థలు, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, జిరో ఎమిషన్ మొబిలిటీ, జీరో ఫ్యాటాలిటీ రోడ్లు కలిసి ఉండాలని తెలిపారు. ప్రగతిశీల విధానాలు, డిజిటల్ పాలన, ఆవిష్కరణలతో పాటు పౌరుల భాగస్వామ్యం ద్వారా 2047 నాటికి భారతదేశాన్ని క్లీన్ మొబిలిటీలో నడిపించాలని తెలంగాణ నిశ్చయించుకుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.


**కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్.**

టెండర్ ప్రకటన

NIT No. Tender Notice No. 09/EE/QQSUDA/2025-26 తేది: 05.12.2025

**పని పేరు:** గోల్కొండలోని కటోరా హౌజ్ (Hauz) సంరక్షణ, వివరణ మరియు స్థల అభివృద్ధి కోసం కన్సల్టెన్సీ సేవలు. **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 1)** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 9.12.2025న మ.03:00గం.లకు, **2)** డౌన్‌లోడ్ ఆఖరి తేది: 17.12.2025న మ.3:30గం.ల వరకు, **3)** బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 17.12.2025న సా.4:00గం.ల వరకు, **4)** ప్రైస్ బిడ్ ప్రారంభ తేది: 19.12.2025న సా.4:30గం.లకు. **అధికారి పేరు & చిరునామా:** ఎండి. వహాజుద్దీన్, ఇఇ, క్యుక్యుఎస్‌యుడిఎ, దారుల్‌షిఫా, హైదరాబాద్. **సెల్ నెం.** 9652880786. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.in మరియు http://www.ghmc.gov.inలో 09.12.2025 నుండి 17.12.2025 వరకు చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, క్యుక్యుఎస్‌యుడిఎ

DIPR R.O. No. : 11831-PP/CL/ADVT/1/2025-26, Date: 08-12-2025



# జనరల్

STATE & REGIONAL NEWS




TELANGANA RISING GLOBAL SUMMIT

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

## వ్యవసాయ రంగానికి దిక్సూచి

మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యవసాయ రంగానికి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ దిక్సూచి అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. డిజిటల్ స్మార్ట్ దిశగా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా రైతుల ఆదాయం పెంపొందించే వ్యూహాలపై జరిగిన చర్చలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు తెలంగాణకు వెన్నెముక అన్నారు. ప్రతి రైతు సంక్షేమం, పురోగతికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్తును మినహాయించి, లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిందన్నారు. తెలంగాణ వ్యవసాయం, అనుబంధ ఆర్థిక వ్యవస్థ దాదాపు 34.6 బిలియన్ డాలర్లు కాగా 2047 నాటికి దీనిని 400 బిలియన్ డాలర్లకు పెంచడ మే లక్ష్యంమని, ఈ వృద్ధిని సాధించడానికి మేము స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో రంగాలవారీ వ్యూహంతో పని చేస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి రైతు కమీషన్ అధ్యక్షుడు కోదండ రెడ్డి ఐసిఎఆర్ మాజీ డిడిజి (హార్టికల్చర్)డాక్టర్ ఎ. కె. సింగ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు సలహాదారు డాక్టర్ అంచ శ్రీనివాసన్, ప్రపంచ ఆహార బహుమతి గ్రహీత డాక్టర్ మోదదుగు విజయ్ గుప్తా, కోసాంబ్ ఎండి డాక్టర్ జె. ఎస్. యాదవ్, ఆదిత్య బిర్లా గ్లోబల్ ట్రేడింగ్ ఎండి, సిఇఓ రాజేష్ సోమాని, ఐఆర్ఆర్ఐ మాజీ హెడ్ డాక్టర్ సమరేందు మొహంతి పాల్గొన్నారు.

## చిన్న రాష్ట్రమైనా విజన్ పెద్దది

కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కర్ణాటక కంటే తెలంగాణ రాష్ట్రం చిన్నదైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ మాత్రం పెద్దదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కితాబు ఇచ్చారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ పోటీదారులు కాదని, పరస్పరం సహకరించుకుంటూ ముందుకు వెళ్లే రాష్ట్రాలని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలోని హైదరాబాద్, కర్ణాటకలోని బెంగళూరు ప్రపంచస్థాయిలో మార్కెట్ కలిగి ఉన్న ప్రాంతాలని, ఎగుమతులలో బెంగుళూరు వాటా 40 శాతంగా ఉందని, అతి త్వరలో తెలంగాణ నుంచి కూడా ఇదే స్థాయిలో ఎగుమతులు జరుగుతాయని యన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థలో దక్షిణాధి రాష్ట్రాల పాత్ర కీలకం కానుందన్నారు. ఇంత పెద్ద గ్లోబల్ సమ్మిట్ రెండేళ్ల రాష్ట్ర కాంగ్రెస్ పాలనకు నిదర్శనం అన్నారు. తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి ఏ విధంగా అభివృద్ధి చెందనుందో విజన్ డాక్యుమెంట్ రూపంలో కళ్ళ ముందు ప్రత్యక్షంగా కనిపిస్తుందన్నారు. అభివృద్ధి మ్యాజిక్ కాదని, అది నిబద్ధత, కష్టం, పారదర్శకత, బాధ్యత, జవాబుదారీతనం, నిజాయితీతోనే సాధ్యమవుతుందని, తెలంగాణ రాష్ట్రానికి అటువంటి నాయకత్వం ఉందని శివకుమార్ పేర్కొన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఎన్నికలలో చెప్పిన మాటను అత్యంత నిబంధనతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారని కొనియాడారు. తెలంగాణ రైజింగ్ కేవలం ఒక్క తెలంగాణకు చెందిన మాత్రమే కాదని, ఇది దక్షిణ రాష్ట్రాలకు చేయూతగా నిలుస్తుందన్నారు. కాలిఫోర్నియాలో 13 లక్షల ఇంజనీర్లు ఉంటే, బెంగళూరులో 25 లక్షల ఇంజనీరింగ్ పనిచేస్తున్నారని అంతకుమించి రానున్న భారత్ ఫ్యూచర్ సిటీలకు సాంకేతికంగా పనిచేస్తారని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ గ్లోబల్ మార్కెట్‌గా అవతరించనుందని, అందుకు కర్ణాటక పూర్తిగా సహకరిస్తుందని డి.కె.శివకుమార్ తెలిపారు.

ఏ కార్మికుడు, ఏ కుటుంబం, ఏ జిల్లాను వదిలిపెట్టకుండా

## అభివృద్ధి క్రమం సమతులంగా ముందుకు



డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏ కార్మికుడు, ఏ కుటుంబం, ఏ జిల్లాను కూడా వదిలిపెట్టకుండా అభివృద్ధి క్రమాన్ని సమతులంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిశ్చయించినట్టు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అభివృద్ధి పథంలో తాము అందరి ఉద్యోగాలను కాపాడుతామని, కొత్త పనులు నేర్పిస్తామని, చిన్న పరిశ్రమలకు సాయం చేస్తామని, బొగ్గు ఆధారిత జిల్లాలను పచ్చని ఆర్థిక కేంద్రాలుగా మారుస్తామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో సోమవారం జరిగిన తెలంగాణ రేసింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'తెలంగాణ భవిష్యత్ ఇంధనం గ్రీన్ ఎనర్జీ దిశలో ముందడుగు' అనే అంశంపై సోమవారం జరిగిన చర్చలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలంటే 2047 నాటికి చాలా ఎక్కువ విద్యుత్తు కావాలని, 2047 నాటికి 11.39 లక్షల మెగావాట్ల విద్యుత్ , 780 టెర్రా వాట్ గంటల సరఫరాకు అవసరమవుతుందని, ఇంత కరెంట్‌ను సాధారణ పద్ధతుల్లో ఇవ్వడం కుదరదని వివరించారు. అందుకే మరింత సౌర విద్యుత్, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, అవసరాన్ని బట్టి మారే థర్మల్ ప్లాంట్లు, బలమైన కరెంట్ గ్రిడ్లు,ఆధునిక డిజిటల్ పంపిణీ వ్యవస్థలు కావాలని, వీటన్నిటికీ సరిపడా డబ్బులు కూడా కావాలని అన్నారు. ప్రభుత్వం స్వయంగా డబ్బు సమకూర్చడం తో పాటు, 'గ్రీన్ బాండ్లు', ప్రత్యేక లోన్లు, ఇతర ప్రపంచ సంస్థల నుంచి నిధులు సమీకరించే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. పర్యావరణ హితకర దిశగా జరిగే ఈ మార్పు ఎంత అవసరమైందో, ఆ మార్పు అంతే నాయబద్దంగా, నైతికంగా ఉండటం కూడా అంతే అవసరమన్నారు. తెలంగాణ ప్రధానంగా బొగ్గు ఉత్పత్తి చేసే రాష్ట్రమని, దేశంలోనే బొగ్గు ఉత్పత్తిలో 7 శాతం తెలంగాణ నుంచే వస్తోందని, గోదావరి నది కి ఆనుకుని ఉన్న జిల్లాల్లో బొగ్గు ప్లాంట్లు, ఫ్లై యాష్ పరిశ్రమలు, బొగ్గు ఆధారిత ఎంఎస్ఎంఈ లు ఉన్నాయని, పర్యావరణ హితకర ఇంధన పరిణామ క్రమంలో ఈ ప్రాంత భోగోళికతను, అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. ఇటీవల జిల్లాల వారీగా జరిగిన పరిశోధనల ప్రకారం, ఆ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న జిల్లాల్లో టూరిజం, ఆహార శుద్ధి, బట్టల పరిశ్రమలు, సోలార్ ఉత్పత్తుల తయారీ, ఆ విడిభాగాల అమరికా వంటి కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టవచ్చని, ఇవి ఆ జిల్లాల భోగోళికతకు, భవిష్యత్తు అవసరాలకు అమర్చినట్టుగా సరిపోతాయన్నారు. తెలంగాణ విద్యుత్ వ్యవస్థను సమూలంగా మార్చే ఆలోచనల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ధైర్యం, ప్రణాళిక, పెట్టుబడి, సమన్వయం, సహానుభూతి ని మేళవించి తాము సరికొత్త చరిత్ర లిఖించేందుకు సిద్ధంగా ఉన్నామని భట్టి అన్నారు. వందశాతం పర్యావరణ హిత వాహనాల (స్వచ్ఛమైన రవాణా) వైపు మారుతున్నామని, 2030 నాటికి హైదరాబాద్‌లో భారతదేశంలోనే అతిపెద్ద 'ఎలక్ట్రిక్ బస్సుల' వ్యవస్థను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఇప్పటికే ఉన్న 11.4 గీగావాట్ల (డబ్ల్యు) పునరుత్పాదక ఇంధనానికి అదనంగా, మరో 20 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన శక్తిని తయారు చేయాలని ప్రణాళికలు రచించామన్నారు.

వైద్య రంగానికీ 2047 నాటికి బడ్జెట్‌లో

## 8 శాతం నిధులు కేటాయింపు

మంత్రి దామోదర రాజనర్సింహా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బడ్జెట్‌లో ప్రస్తుతం వైద్య రంగానికి 4 శాతంగా ఉన్న కేటాయింపులను 2047నాటికి 8 శాతానికి పెంచుతామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చెప్పారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'అందరికీ అందుబాటులో, తక్కువ ఖర్చుతో కూడిన, సమానమైన వైద్యం' అనే అంశంపై జరిగిన చర్చా వేదికలో మంత్రి మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'హెల్త్ విజన్2047' ద్వారా ప్రజలకు ఆర్థిక భద్రతతో కూడిన వైద్యాన్ని అందిస్తామని వెల్లడించారు.ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసేందుకు మూడంచెల విధానాన్ని బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5,023 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రాథమిక సేవలు,184 టీవివిపి ఆసుపత్రుల ద్వారా స్పెషలైజ్డ్ సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ చొప్పున 35బోధనా సుపత్రులు, 13 స్పెషాలిటీ ఆసుపత్రులతో తృతీయ స్థాయి వైద్యాన్ని పటిష్టం చేశామని తెలిపారు. 2 వేల పడకలతో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం, రూ.1698 కోట్లతో నిమ్స్ విస్తరణ, వరంగల్ హెల్త్ సిటీ (1750 పడకలు), హైదరాబాద్ నలువైపులా మూడు టిమ్స్ (టిమ్స్)ఆసుపత్రుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని వివరించారు.మెడికల్ టూరిజం పాలసీతో తెలంగాణను గ్లోబల్ హెల్త్ హబ్‌గా మారుస్తున్నామని, ఇప్పటికే ఏటా లక్ష మంది విదేశీయులు హైదరాబాద్‌లోని హాస్పిటళ్లలో చికిత్స తీసుకుంటున్నారని మంత్రి గుర్తు చేశారు. మరోవైపు మెడికల్ టూరిజాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి, యూనిసెఫ్ రీజినల్ హెడ్ డాక్టర్ జెలాలెం బిర్హాను, డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ శాంత అచ్చంట, అపోలో జెఎండీ డాక్టర్ సంగీత రెడ్డి, కిమ్స్ సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురువా రెడ్డి పాల్గొన్నారు.

మహిళా ఆధారిత అభివృద్ధి

## అవకాశాలను పరిశీలించండి : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మహిళల ప్రతిభ, ఆవిష్కరణలు, సామాజిక, ఆర్థిక పురోగతిని ప్రపంచ వేదికపై ప్రతిధ్వనింపజేయడమే గ్లోబల్ సమ్మిట్ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. పెట్టుబడిదారులు, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు తెలంగాణలో మహిళా ఆధారిత అభివృద్ధి అవకాశాలను పరిశీలించాలన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'వ్యాపార రంగంలో మహిళల నాయకత్వం అంశంపైన సోమవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ దేశంలోనే అతి పెద్ద, అత్యంత ప్రభావవంతమైన మహిళా నెట్వర్క్ నిర్మించిన రాష్ట్రమని వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ పేద మహిళల నుంచి వికలాంగులు, వృద్ధ మహిళలు, అట్టడుగు వర్గాలు,ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ వరకు అందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గత రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు కేవలం సంక్షేమం వరకే పరిమితం కాలేదని, మహిళల నిజమైన సాధికారత వైపు తీసుకెళ్లే సంస్కరణ అని అన్నారు. స్త్రీ నిధి ద్వారా భారీ స్థాయిలో అందించిన క్రెడిట్ సపోర్ట్, లక్షలాది సూక్ష్మ, మధ్యతరగతి వ్యాపారాల ఏర్పాటుతో మహిళల ఆర్థిక స్వరూపం అమూల్యంగా మారిందన్నారు.

## ఇక జిహెచ్ఎంసిలో 300 వార్డులు

నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిమితుల విస్తరణ, కోర్ అర్బన్ రీజియన్ మొత్తం విలీనం నేపథ్యంలో వార్డుల సంఖ్యను పునర్ విభజన రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జిహెచ్ఎంసిలో మొత్తం 300 ఎన్నికైన వార్డులను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ (ఎంఎయుడి) జారీ చేసిన జి.ఓ నెంబర్ 266 ప్రకారం, జిహెచ్ఎంసి కమిషనర్ సమర్పించిన వార్డ్ రీ ఆర్గనైజేషన్ ఫ్రేమ్‌వర్క్ అధ్యయన నివేదికను పరిశీలించిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ అధ్యయనం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సిజిజి) ఆధ్వర్యంలో చేపట్టారు. జిహెచ్ఎంసి కమిషనర్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలో, విస్తరించిన నగర పరిమితులు, జనాభా గణాంకాలు, సేవల డెలివరీ అవసరాల ప్రకారం 300 వార్డులు అవసరమని వివరించారు. దీనిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం జిహెచ్ఎంసి చట్టం, 1955 నిబంధనల ప్రకారం కొత్త వార్డుల సంఖ్యను ఖరారు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం, ఈ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఎక్స్‌ట్రార్డినరీ గెజిట్‌లో ప్రచురించాలని ఆదేశించారు. ముద్రణ శాఖకు 500 ప్రతులను ప్రభుత్వానికి అందించాలని కూడా సూచించారు. జిహెచ్ఎంసిలో వార్డుల పునర్విభజన, భవిష్యత్తులో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికలకు కీలకంగా మారనుంది.




## గ్లోబల్ సమ్మిట్‌లో హైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్లోబల్ సమ్మిట్‌లో వివిధ ప్రభుత్వ విభాగాలతో కలిసి ఏర్పాటు చేసిన హైడ్రా స్టాల్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా, హైడ్రాకు చెందిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) అందిస్తున్న సేవలు సందర్శకుల ప్రశంసలు అందుకుంటున్నాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా, వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై, నీట మునిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో డిఆర్ఎఫ్ చేసిన సేవలను ప్రతినిధులు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వరదలకు గల కారణాలు, సమస్య తలెత్తకుండా తీసుకున్న చర్యల వీడియోలను కూడా వారు నిశితంగా పరిశీలించారు. హైదరాబాద్ నగరం ఎంత సురక్షితమో, హైడ్రా డిఆర్ఎఫ్ టీమ్‌ల పనితీరును వివరిస్తూ రూపొందించిన వీడియో ప్రదర్శన సమ్మిట్‌కు వచ్చిన వారిని ఎంతగానో ఆకట్టుకుంది. హైడ్రా కార్యకలాపాలకు సంబంధించిన పోస్టర్, బ్రోచర్‌ను పలువురు తీసుకుని పరిశీలించి ప్రశంసించారు. హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ స్వయంగా స్టాల్స్‌ను సందర్శించి ప్రతినిధులతో చర్చించారు. సమస్య పరిష్కారంలో నిపుణుల సలహాలను స్వీకరించారు. మొదటి ఏడాదిలోనే హైడ్రా మంచి ఫలితాలు సాధించిందని రంగనాథ్ వివరించారు.

వ్యాపారాలు, పరిశ్రమల అభివృద్ధికి

## అధునాతన వ్యూహాలు అవసరం

- ప్రముఖ వ్యాపార అభివృద్ధి వ్యూహకర్త వేణు కల్యాణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధించేందుకు మార్కెటింగ్ విస్తరించడం, సేల్స్ పెంచుకోవడం, టీమ్ రెస్పాన్సిబిలిటీస్, క్యాష్ ఫ్లో ఇష్యూస్, ప్రాఫిటేబుల్ బిజినెస్ మోడల్, హై పర్ఫార్ టీమ్ నియమించుకోవడం తదితర అంశాలు ప్రధానమైనవని ప్రముఖ వ్యాపార అభివృద్ధి వ్యూహకర్త వేణు కళ్యాణ్ అన్నారు. యునిక్ లైఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'వ్యాపార రంగంలో ఎలా అభివృద్ధి సాధించాలి?' అనే అంశంపై 'అల్టిమేట్ బిజినెస్ మాస్టరీ' వర్క్ షాప్ హైదరాబాద్ బేగంపేటలోని తాజ్ వివంటాలో సోమవారం జరిగింది. ప్రధానంగా వ్యాపార వృద్ధి వ్యూహాలలో కొత్త మార్కెట్లలోకి విస్తరించడం (మార్కెట్ విస్తరణ), కొత్త ఉత్పత్తులు లేదా సేవలను అభివృద్ధి చేయడం (ఉత్పత్తి అభివృద్ధి), ఉన్న మార్కెట్లలో అమ్మకాలను పెంచడం (మార్కెట్ వ్యాప్తి) మరియు కొత్త మార్కెట్ల కోసం కొత్త ఉత్పత్తులను సృష్టించడం (వైవిధ్యీకరణ) తోపాటు వ్యాపార కార్యకలాపాలు, సామర్థ్యం మరియు కస్టమర్ చేరువను మెరుగుపరచడానికి కొత్త సాంకేతికతలను తెలిపుతూ, ఆర్గనైజేషన్ కల్చర్, వాల్యూస్ ఎలా క్రియేట్ చేయాలి, బిజినెస్ ఆటోపైలెట్ మోడ్ ఎలా పెట్టుకోవాలి తదితర అంశాలపై వేణు కల్యాణ్ మార్గనిర్దేశం చేశారు. ప్రతిఒక్కరికి అర్థమయ్యే విధంగా పూర్తిగా తెలుగులోనే జరిగిన ఈ వర్క్ షాప్ లో 'బిజినెస్ నెట్ వర్కింగ్' ఉపయోగాల'పై గెస్ట్ స్పీకర్ బిజినెస్ నెట్ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనాషా, 'బిజినెస్ లీడర్ షిప్' అంశంపై ఎఫ్.టి,సి.సి.ఐ అధ్యక్షులు ఆర్. రవికుమార్ ప్రసంగించారు.








## వినూత్నంగా 'ఎక్స్‌పో'

'ఇగ్లూ'లో హైదరాబాద్,మూసీ చరిత్ర

'ఎఐ వీడియో'లో మూసీ అందాలు

మహిళల ఆధ్వర్యంలోని విభిన్న వ్యాపారాల స్టాల్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ''తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్''లో ఏర్పాటు చేసిన ''ఎక్స్‌పో'' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధాన్యతగా చెబుతున్న ప్రాజెక్ట్‌లు పూర్తవుతే ఎలా ఉండబోతున్నాయనేది 'ఎఐ' ద్వారా ఎల్ఇడిలతో వీడియోలను ప్రదర్శించింది. ఇందులో ముఖ్యంగా మూసీ పునర్జీవ ప్రాజెక్ట్‌ను ఎఐ ద్వారా ప్రదర్శించిన వీడియోలు పలువురిని ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రాజెక్ట్ పరిసరాలు, రాబోయే అభివృద్ధి కార్యక్రమాలను ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ముఖ్యంగా మూసీ చరిత్రతో పాటు హైదరాబాద్ నగరం చరిత్రను,అప్పటి కాలంలో ఉన్న చిత్రాలను కూడా ప్రదర్శించారు. ఎక్స్‌పోలో ప్రత్యేకంగా 'ఇగ్లూ'ను ఏర్పాటు చేసి మూసీ ప్రాజెక్ట్ నిర్మాణ ప్రత్యేక లను, హైదరాబాద్ చరిత్రను కూడా వివరించడం పలువురిని ఎంతో ఆకట్టుకున్నది. భారత్ ఫ్యూచర్ సిటీ నమూనాలు, చిత్రాలను ప్రదర్శించింది. రక్షణ నిమ్మితం పోలీసు శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ కెమెరాల ప్రత్యేకతను వివరించారు. చేనేత దుస్తులను,చేతితో వేసిన డిజైన్లను కూడా ప్రదర్శించారు. అలాగే ఇందిరా మహిళా శక్తి స్టాల్‌ను కూడా ఏర్పాటు చేశారు. మహిళల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విభిన్న వ్యాపారాలు, సేవలు, ఆర్థిక కార్యకలాపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకులు, హైటెక్ సిటీలో పనిచేస్తున్న మహిళా శక్తి బజార్, జిల్లాల వ్యాప్తంగా నిర్మితమైన మహిళా శక్తి భవనాలు, శక్తి క్యాంటిన్లు, ఆర్‌టిసి ద్దె బస్సుల నిర్వహణలో మహిళలు సాధిస్తున్న విజయాలు తదితర అంశాలను పలువురిని ఆకర్షించాయి. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నమూనాను ప్రదర్శించారు.







గ్లోబల్ సమ్మిట్ చిత్రాలు









# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రేపు,ఎల్లుండి భారత్‌—అమెరికా వాణిజ్య చర్చలు

**న్యూఢిల్లీ:** భారత్‌—అమెరికా మధ్య కీలకమైన ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు (బిటిఎ) డిసెంబరు 10,11 తేదీలలో ఢిల్లీలో జరుగుతాయి. ఈ చర్చలలో పాల్గొనేందుకు అమెరికా వాణిజ్య ప్రతినిధులు భారత వాణిజ్య మంత్రిత్వ శా ఖ ప్రతినిధులతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అధికార ప్రతినిధి రిక్ స్విట్జర్ నాయకత్వంలోని అమెరికా వాణిజ్యబృందం మంగళవారం ఢిల్లీకి చేరుకుంటుంది. భారత తరపున బృందానికి రాజేశ్ అగర్వాల్ సారథ్యం వ హిస్తున్నారు. ద్వైపాక్షి క ఒప్పందంలో మొదటి దశను ఖరారు చేసేందుకు రె ండు దేశాల బృందాలు సంభాషణలు చేస్తాయి. అమెరికా అధ్యక్షుడు డో నాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం మేరకు భారీగా సుంకాలు విధించిన త ర్వాత అమెరికా వాణిజ్య ప్రతినిధిబృందం మనదే శంలో పర్యటించడం ఇది రెండోసారి. ఈ బృందం గతంలో సెప్టెంబరు 16న భారత్‌కు వచ్చింది. అదేవిధంగా కేంద్ర వాణిజ్య,పరిశ్రమలమంత్రి పీయూశ్ గోయల్ కూడా సెప్టెంబరు 22న చర్చల నిమిత్తం అమెరికాలో పర్యటించారు.

## అత్యవసరంగా విచారించలేం

**న్యూఢిల్లీ :** ఇండిగో సంక్షోభంపై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. సర్వీసుల్లో తీవ్ర అంతరాయాన్ని ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. దాని పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభించిందని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 'ఇది తీవ్రమైన అంశమే. భారీ సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సకాలంలో చర్యలు ప్రారంభించిందని మా దృష్టికి వచ్చింది' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. గత కొన్ని రోజులుగా ఇండిగో తన సర్వీసులు రద్దు చేస్తోందని, దాంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంతరాయాల గురించి ప్రయాణికులకు సమాచారం ఇవ్వలేదన్నారు. కాగా, డిసెంబర్ 2న మొదలైన ఇండిగో సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతోంది. దాంతో ఇటు ప్రయాణికులు, అటు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ సంస్థ తీవ్ర స్పందనను ఎదుర్కొంటోంది. విమానయాన సిబ్బంది పని గంటలపై పరిమితులు (ఫ్లైట్ డ్యూటీ టైం లిమిటేషన్స్ ఎఫ్‌డిటిఎల్) విధిస్తూ 2024 జనవరిలో జారీ చేసిన నిబంధనలను ఈ నవంబరు 1 నుంచి అన్ని విమానయాన సంస్థలు సరిగా అమలుచేసినప్పటికీ ఒక్క ఇండిగోతోనే సమస్య వచ్చిందని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## ఇండిగో విమానాల రద్దుపై
# ప్రభుత్వ విచారణ షురూ

• ఎయిర్‌లైన్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం • రాజ్యసభలో మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా ఇండిగో విమానాలు పెద్ద ఎత్తున రద్దుకావడంపై ప్రతిపక్షాలు మోదీ సర్కార్‌పై దుమ్మెత్తిపోశాయి. ఈ నేపథ్యంలో పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు రాజ్యసభలో ప్రకటన చేశారు. ఇండిగో విమానాల రద్దుపై ప్రభుత్వం విచారణ ప్రారంభించిందని, ఇతర విమానయాన సంస్థలకు ఉదాహరణగా నిలిచేందుకు ఆపరేటర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రోజువారీ కార్యకలాపాల ద్వారా సిబ్బంది, డ్యూటీ రోస్టర్‌ను నిర్వహించడంలో విఫలమైనందుకు ఎయిర్‌లైన్స్‌పై మండిపడ్డారు. 'మేము ఈ పరిస్థితిని తేలికగా తీసుకోవడం లేదు. విచారణ చేస్తున్నాము. ఈ పరిస్థితికి మాత్రమే కాకుండా ఉదాహరణగా కూడా మేము చాలా చాలా కఠినమైన చర్య తీసుకుంటాము' అని అన్నారు. ఇండిగో సంక్షోభం ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ (ఎఎంఎస్ఎస్)లో ని లోపం వల్ల సంభవించిందా అని తెలు సుకోవాలనుకున్న కాంగ్రెస్ ఎంపి ప్రమోద్ తివారీ లేవనెత్తిన ప్రశ్నలకు, 2025 నవంబర్ ప్రారంభంలో విమాన సేవలకు అంతరాయం కలిగించిన సాంకేతిక సమస్య ఇది అన్నారు. ఇండిగో సంక్షోభం ఎఎంఎస్ఎస్‌కు సంబంధించినది కాదని, ఇం డిగో అంతర్గత సిబ్బంది రోస్టర్ వ్యవస్థలోని క్రమరాహిత్యాలు, దుర్వినియోగం కారణంగానే జరిగిందని మంత్రి అన్నారు. ఏప్రిల్ 2025లో హైకోర్టు ఉత్తర్వు తర్వాత రూ పొందించిన కొత్త విమాన విధి సమయ పరిమితులు (ఎఫ్‌డిటిఎల్) మార్గదర్శకాన్ని వి వరిస్తూ, 22 ఎఫ్‌డిటిఎల్ మార్గదర్శకాలు ఉన్నాయని, వాటిలో 15 జూలై 1, 2025 నుండి, మిగిలిన ఏడు నవంబర్ 1, 2025 నుండి అమలు చేయబడ్డాయన్నారు. ఎఫ్‌డిటిఎల్ అమలుకు సంబంధించి ఇండిగోతో సహా బహుళ వాటాదారుల సంప్రదింపులు జరిగాయని, అన్ని విమానయాన సంస్థలు భద్రతపై ఎటువంటి రాజీ లేకుండా నియమాలను పాటించాల్సి ఉంటుందని ప్రభు త్వం చాలా స్పష్టంగా చెప్పిందన్నారు. 'సమగ్ర సంప్రదింపులు, భద్రతా ప్రమాద అం చనా తర్వాత, అవసరమైన వైవిధ్యాలు, మి నహాయింపులు ముందుగానే ఇవ్వబడ్డాయి'



అని నాయుడు పేర్కొన్నారు. కొత్త ఎఫ్‌డిటిఎల్‌లో దాదాపు ఒక నెల పాటు స ంక్షోభం జరిగిందని అన్నారు. సంక్షోభానికి పూర్తిగా ఇండిగోనే కారణమని చెప్పారు. డి సెంబర్ 1, 2025న, మంత్రిత్వ శాఖ ఎఫ్‌డిటిఎల్‌పై ఇండిగోతో సమావేశమైనప్పుడు కూడా కొంత స్పష్టత అవసరం కాబట్టి, సం క్షోభానికి కారణమైన సమస్యను కంపెనీ ప్ర స్తావించలేదన్నారు.

**మరో 500 విమానాలు రద్దు**

సంక్షోభంలో చిక్కుకున్న దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సోమవారం 500 విమానాలను రద్దు చేసింది. అయితే 1,802 సర్వీసులను నడపాలని యోచిస్తోందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. మొత్తం 9,000కు గానూ 4,500 బ్యాగులను ప్రయాణికులకు డెలివరీ చేసిందని, మిగిలిన వాటిని రానున్న 36 గంటల్లో డెలివరీ చేస్తుందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం ఇండిగో 138 గమ్యస్థానాలలో 137 గమ్యస్థానాలకు 1,802 విమానాలను నడపాలని యోచిస్తోంది. 500 విమానాలు రద్దు చేయబడ్డాయి. అలాగే మొత్తం 9,000 బ్యాగులలో 4,500 బ్యాగులను కస్టమర్లకు డెలివరీ చేశారు. రాబోయే 36 గంటల్లో బ్యాలెన్స్ బ్యాగులను డెలివరీ చేయాలని ఎయిర్‌లైన్ లక్ష్యంగా పెట్టుకుంది' అని మంత్రిత్వ శాఖ తెలిపింది. డిసెంబర్ 1—7వ తేదీ మధ్య 5,86,705 పిఎన్ఆర్‌లను రద్దు చేసి తిరిగి చెల్లించామని, మొత్తం రూ. 569.65 కోట్లు చెల్లించామని మంత్రిత్వ శాఖ తెలిపింది. నవంబర్ 21 నుండి డిసెంబర్ 7 వరకు మొత్తం 9,55,591 పిఎన్ఆర్‌లను కూడా రద్దు చేసి తిరిగి చెల్లించారు. దీని మొత్తం రూ. 827 కోట్లుగా ఉంది.

## ఇండిగో విమానాల అంతరాయంపై...
# ప్రకటన చేయాలి

పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు డిమాండ్



**న్యూఢిల్లీ :** ఇండిగో విమానాల అంతరాయం, దేశవ్యాప్తంగా వివిధ విమానాశ్రయాలలో ప్రజలు ఎదుర్కొంటున్న అసౌకర్యం నేపథ్యంలో ప్రభుత్వం ఏమి చే స్తుందో దేశానికి తెలియజేయాలని సో మవారం లోక్‌సభలో ప్రతిపక్షం డిమా ండ్ చేసింది. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత లోక్‌సభలో పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఈ విషయంపై వివరణాత్మక ప్రకటన చేస్తారని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ 'దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విమానాశ్రయాలలో చాలా రోజులుగా ప్రజలు, డయాలసిస్ రోగులు, వారి ఇళ్లలో వివాహాలు చే సుకునే వ్యక్తులు, వృద్ధులను చేరుకోవాలనుకునే వ్యక్తులు సమస్యలను ఎదుర్కొంటున్నారని, విమానాశ్రయాలలో గందరగోళం ఎందుకు ఏర్పడిందో పౌ ర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ సభ ద్వారా దేశానికి తెలియజేయాలని డిమాడ్ చేస్తున్నామన్నారు. 'హవాయి చెప్పులు ధరించిన వారు కూడా విమానాల్లో ప్రయాణిస్తారని మాకు చెప్పారు కానీ, ధరలు రూ. 20,000కు పెరిగా యి, విమానాశ్రయాలలో కాఫీ రూ. 250కి విక్రయిస్తున్నారు. విమాల రాకపోకల్లో జరుగుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం ఏమి చేస్తుందో మాకు చె ప్పాలి' అని ఆయన అన్నారు. ఇండిగో విమానాల అంతరాయాలపై ప్రతిపక్షా లు ప్రభుత్వంపై మండిపడుతుండగా, అపూర్వమైన సంక్షోభానికి మోదీ స ర్కారే కారణమని ఆరోపిస్తున్నాయి. ఇండిగోలో కొనసాగుతున్న గందరగోళం ప్రమాదం కాదని, బిజెపి ప్రభుత్వం ఈ రంగంలో ద్వంద్వ విధానాన్ని త యారు చేయడానికి నిరంతరాయంగా ఒత్తిడి ప్రత్యక్ష ఫలితం అని కాంగ్రెస్ గ తంలో పేర్కొంది. సంక్షోభంలో ఉన్న విమానయాన సంస్థ విమాన కార్యకలాపాలలో అంతరాయాలు ఏడవ రోజుకు చేరుకోవడంతో సోమవారం ఢిల్లీ, బెం గళూరు విమానాశ్రయాల నుండి 250కి పైగా ఇండిగో విమానాలు రద్దయినట్లు వర్గాలు తెలిపాయి.

# విమాన చార్జీల దోపిడీని ఆపండి

పౌర విమానయాన మంత్రి
వెంటనే జోక్యం చేసుకోవాలి
సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ డిమాండ్



**న్యూఢిల్లీ:** విమాన చార్జీల దోపిడీని ఆపడానికి పౌర విమానయాన శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని రాజ్యసభలో సిపిఐ నాయకుడు పి.సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ఒక లేఖ రాశారు. విమాన చార్జీల నియంత్రణపై మంత్రిత్వ శాఖ వైఖరిలో తీవ్రమైన వైరుధ్యాలను బహిర్గతం చేస్తూ, దోపిడీ ధరల నుంచి ప్రయాణీకులను రక్షించడానికి తక్షణ ప్రభుత్వ చర్యకు ఆయన పిలుపునిచ్చారు. విమాన చార్జీలు పూర్తిగా మార్కెట్ ఆధారితమైనవని, ప్రభుత్వం సుంకాలను నియంత్రించదు లేదా నిర్ణయించదని మంత్రిత్వ శాఖ 24—7—2023న పార్లమెంటుకు తెలియజేసినప్పటికీ, దేశీయ విమానాలకు గరిష్ట చార్జీలను స్పష్టంగా పరిమితం చేస్తూ మంత్రిత్వ శాఖ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 500 కి.మీ వరకు రూట్లకు రూ.7,500 సీలింగ్ ఉంటుందని, చార్జీలు స్థిరీకరించబడే వరకు ఈ పరిమితులు వర్తిస్తాయని ఆ ఉత్తర్వు పేర్కొంది. అయినప్పటికీ ప్రభుత్వం స్థిరమైన ధరలను దేనిగా పరిగణిస్తుందో నిర్వచనాన్ని అందించలేదు. ఇది జోక్యం చేసుకోవడానికి పూర్తి చట్టపరమైన అధికారాన్ని కలిగి ఉండగా కీలకమైన నియంత్రణ స్పష్టతను నిలిపివేయడమేనని ఆయన పేర్కొన్నారు. విమానయాన సంస్థలు గరిష్ట పరిమితులను నిర్ణయించే అధికారాన్ని మంత్రిత్వ శాఖలు ఏర్పాటు చేసినప్పటికీ, ఇటీవల కొనసాగుతున్న సర్వీసుల రద్దు సంక్షోభ సమయంలో విమానయాన సంస్థలు రూ.60,000 వరకు వసూలు చేశాయని తెలిపారు. 612.25 ఉత్తర్వుల ప్రకారం, 1,0001,500 కి.మీ కేటగిరీకి మంత్రిత్వ శాఖలు చార్జీలను రూ.1,5000 కి పరిమితం చేసినప్పటికీ, డీజీసీఏ టారిఫ్ పర్యవేక్షణ విభాగం విమానయాన సంస్థలు తమ స్థిరపడిన టారిఫ్‌లను ఏకపక్షంగా సవరించకుండా నిరోధించడంలో విఫలమైందని, దీని వలన ధరల పెరుగుదల తీవ్రంగా ఉందని సంతోశ్ కుమార్ ఎత్తి చూపారు. పండుగల సమయాల్లో కూడా ఇదేవిధంగా విమాన చార్జీల దోపిడీ సాగుతుండటాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఇటీవల విమానయాన రంగంలో కొత్త విశ్రాంతి నిబంధనల అమలు ఫలితంగా వందలాది విమానాలు రద్దు కావడం, తీవ్ర జాప్యం జరగడంతో వేల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొంటూ, అయితే దీనిపై విమానయాన మంత్రిత్వ శాఖ మౌనంగా ఉండటాన్ని ఆయన విమర్శించారు. దేశ వ్యాప్తంగా అనేక విమానాశ్రయాలలో ప్రయాణికులు నిలిచిపోవడంతో తీవ్ర గందరగోళం చోటుచేసుకుందని సీపీఐ ఎంపీ తెలిపారు. విమానాశ్రయాల టెర్మినళ్లలో ఆహార పదార్థాలు, పానీయాల ధరలను విపరీతంగా పెంచేసి అమ్మడంతో ప్రయాణికులు ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. ప్రయాణికుల ఈ ఖర్చులను కూడా వారికి తిరిగి ఇవ్వాలని పేర్కొన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్థిరమైన ఛార్జీలు అంటే ఏమిటో స్పష్టంగా నిర్వహించాలని, ఇప్పటికే వివరించిన చార్జీల పరిమితులను అమలు చేయాలని కోరారు. డీజీసీఏ పరిస్థితిని గమనించడంకంటే నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని అన్నారు. మంత్రిత్వ శాఖ ఎటువంటి జాప్యం లేకుండా పారదర్శకతను పునరుద్ధరించాలని, విమానయాన రంగంలో జవాబుదారీతనం తీసుకురావాలని కోరారు. ప్రయాణికులను, విమానయాన సిబ్బంది ఇద్దరినీ రక్షించే ప్రమాణాలకు అనుగుణంగా ప్రైవేటు విమానయాన సంస్థలు ఉండేలా చూడాలని పేర్కొన్నారు.

## డంప్ యార్డుల్లా విమానాశ్రయాలు

ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా లగేజీ బ్యాగులు



**న్యూఢిల్లీ :** భారతదేశంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ సష్టించిన సంక్షోభం అంతా ఇంతా కాదు. తమ దగ్గర ఆటలు చెల్లవన్నట్టుగా అటు విమానయాన శాఖకు... ఇటు ప్రయాణికులకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ ఓ పాఠం నేర్పించింది. వారం రోజులుగా ప్రయాణికులు విమానాశ్రయాల్లో నరకయాతన అనుభవిస్తున్నారు. తిండి తిప్పలు లేకుండా పడిగాపులు కాస్తున్నారు. మీడియా ఛానల్స్‌లో, సోషల్ మీడియాలో ఎన్నో వీడియోలు, ఎన్నో ఫొటోలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రయాణికులు ఆక్రోశం, ఆక్రందనలు చేస్తున్నా... ఇండిగోకు చీమ కుట్టినట్లైనా కనిపించడం లేదు. నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ఇంత సంక్షోభం కళ్ల ముందు కనిపిస్తున్నా కేంద్ర ప్రభుత్వం కూడా కంటితుడుపు చర్యలు మాత్రమే తీసుకుంటుంది. ప్రస్తుత సంక్షోభాన్ని గాడిన పెట్టే పరిస్థితులు కనిపించడం లేదు. గత వారం మొదలైన సంక్షోభం... ఈ వారం కూడా కొనసాగుతూనే ఉంది. సోమవారం కూడా వందలాది విమానాలను రద్దు చేసింది. దీంతో ప్రయాణికుల ఇక్కట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే దేశవ్యాప్తంగా ఏ విమానాశ్రయంలో చూసినా ప్రయాణికులు, లగేజీ బ్యాగులతో కిటకిటలాడుతున్నాయి. అన్ని విమానాశ్రయాలు డంప్ యార్డులను తలపిస్తున్నాయి. ఎటు చూసినా బ్యాగులు కనిపిస్తున్నాయి. కుప్పలు తిప్పలుగా పడి ఉన్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇంకోవైపు చోరీలు జరుగుతున్నాయి. తమ వస్తువులు పోయాయంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు.

## 'బంకిం దా కాదు... బంకిం బాబు'

'వందేమాతరం' చర్చలో ప్రధాని మోదీకి సూచించిన సౌగత్ రాయ్



**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌లో వందేమాతరంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకొంది. వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీని ప్రధాని బంకిం దా (దాదా) అని పలుమార్లు సంబోధించారు. అదే సమయంలో తృణమూల్ ఎంపి సౌగత్ రాయ్ ప్రధాని 'దా' అని సంబోధించడంపై అభ్యంతరం చెప్పారు. సోదరుడు అనే సంబోధించేందుకు బెంగాలీ భాషలో 'దా' అని వాడతారని.. సాంస్కృతిక దిగ్గజానికి అటువంటి పదం వాడటం సరికాదని పేర్కొన్నారు. 'బంకిం బాబు' అని ప్రధాని సంబోధించాలని సూచించారు. దీనికి సానుకూలంగా ప్రధాని వెంటనే స్పందించారు. ఇకనుంచి బంకిం బాబు అనే సంబోధిస్తానని వెల్లడించారు. తన పొరబాటును సరిచేసినందుకు సౌగత్ రాయ్‌కు ధన్యవాదాలు చెబుతూ.. నేను మిమ్మల్ని దాదా అని సంబోధించవచ్చా..? లేదా దానిపై కూడా ఏమైనా అభ్యంతరాలున్నాయా..? అని సరదాగా ప్రశ్నించారు.

## సిఎం సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసు



**న్యూఢిల్లీ :** కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాల వేళ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యకు సుప్రీంకోర్టు సోమవారంనాడు నోటీసులు ఇచ్చింది. 2023లో వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిద్ధరామయ్య ఎ న్నికను సవాలు చేస్తూ ఆ నియోజకవర్గం ఓ టరు కె.శంకర అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని సిద్ధరామయ్యను కోర్టు ఆదేశించింది. కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో కా ంగ్రెస్ పార్టీ ఐదు ఎన్నికల హామీలను ఇచ్చిందని, 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలకు ఇవి విరుద్ధమని పిటిషనర్ గతంలో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. సిద్ధరామయ్య అంగీకారంతోనే మేనిఫెస్టో విడుదల చేసినందున సిద్ధరామయ్య అవినీతికి పాల్పడ్డారని పిటిషన్ వాదించారు. సిద్ధరామయ్య ఎన్నిక చెల్లదని ప్రకటించాలని, ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా డిబార్ చేయాలని కోరారు. అయితే ఈ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి సునీల్ దత్ యాదవ్ కొట్టివేశారు. ఎన్నికల్లో హామీలివ్వడం అవినీతికి పాల్పడటం కాదని పేర్కొన్నారు. దీనిపై పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సిద్ధరామయ్య 2023 ఎన్నికల్లో వరుణ నియోజకవర్గం నంచి ఎన్నికై ఆ తర్వాత ముఖ్యమంత్రి అయ్యారు

## దిలీప్ కేసుపై అప్పీల్ చేస్తాం: మంత్రి రాజీవ్

**తిరువనంతపురం:** మలయాళ నటిపై అత్యాచారం, కిడ్నాప్ కేసులో ఎర్నాకుళం ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుపై కేరళ ప్రభుత్వం అప్పీల్ చేయనుందని న్యాయశాఖ మంత్రి పి.రాజీవ్ తెలిపారు. ఈ కేసులో ఎనిమిదవ నిందితుడైన ప్రముఖ నటుడు దిలీప్‌ను కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. తాను ఇప్పటికే ముఖ్యమంత్రి విజయన్‌తో మాట్లాడానని, తీర్పుపై అప్పీల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయి ంచిందని అన్నారు. ఈ అంశంలో ప్రాథమిక చర్యలు తీసుకోవాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. నేరం రుజువైనప్పటికీ, నిరూపణ కాకపోవడం వెనక ఉన్న కుట్రను విశ్లేషించాల్సి ఉందని అన్నారు. ప్రాసిక్యూషన్ కేసులో వివిధ దశలలో వినిపించిన వాదనలు, ఆధారాలను వివరిస్తూ ఐదు సంపుటాలుగా 1,512 పేజీల వాదన నోట్‌ను సిద్ధం చేసిందని అన్నారు. అయితే తీర్పు ఆ నోట్‌తో లేదా బెదిరింపులకు లొంగకుండా చేపట్టిన దర్యాప్తుతో సరిపోలడం లేదని అన్నారు. ప్రభుత్వం బాధితురాలి పక్షాన నిలబడిందని, ఆమెకు ఆ విషయం తెలుసునని తాము భావిస్తున్నామని అన్నారు. దర్యాప్తు బ ందానికి, ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. తగిన సమయంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కూడా జోక్యం చేసుకుందని అన్నారు. ఈ కేసు వెనుక క్రిమినల్ పోలీస్ ముఠా ఉందన్న దిలీప్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

## చెల్లుబాటులోనే 50 పైసల నాణెం

**న్యూఢిల్లీ:** నకిలీ నోట్ల గుర్తింపు, కరెన్సీకి సంబంధించి వ్యాప్తిలో ఉండే వదంతుల గురించి పౌరులకు ఎప్పటికప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అవగాహన కల్పిస్తూ ఉంటుంది. తాజాగా నాణేలపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా వాట్సప్ ద్వారా వ్యక్తిగతంగా సందేశాలు పంపిస్తోంది. నాణేలపై అవగాహన కల్పిస్తూ ఓ వీడియో రూపొందించింది. వాట్సప్ సందేశం ప్రకారం... నాణేలు వేర్వేరు డిజైన్లతో ఉన్నప్పటికీ అవన్నీ చలామణిలోనే ఉన్నాయని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. అంతేకాకుండా 50 పైసలు మొదలుకొని, రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 నాణేలన్నీ చట్టబద్ధమేనని స్పష్టంచేసింది. ము న్ముందు కూడా చలామణిలో ఉంటాయని పేర్కొంది. నాణేల గురించి తప్పుదారి పట్టించే సమాచారం లేదా వదంతులను విశ్వసించొద్దని సూచించింది. సంకోచం లేకుండా పౌరుల నుంచి నాణేలు స్వీకరించాలని వ్యాపారులకు ఆర్‌బిఐ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా రూ.10 నాణేల గురించి గతంలోనూ ఆర్‌బిఐ అవగాహన కల్పించినా... ఇప్పటికీ వీటిని తీసుకొనేందుకు కొందరు సంకోచిస్తున్నారు. 50 పైసలు నాణేం ఇంకా చెల్లుబాటులో వుందన్నారు.

## ఆమెను మానసిక ఆసుపత్రిలో చేర్పించండి :డికె

**బెంగళూరు:** పంజాబ్ పిసిసి మాజీ అధ్యక్షుడు నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్‌ను మంచి మానసిక ఆసుపత్రిలో చేర్పించాలని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం రూ.500 కోట్లు ఇవ్వాలంటూ ఆమె చేసిన సంచలన వ్యాఖ్యలపై డీకే పైవిధంగా స్పందించారు. కర్నాటక గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను సోమవారం ఉప ముఖ్యమంత్రి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా అని ప్రశ్నించగా... అందులో ఏమాత్రం నిజం లేదన్నారు. రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చినవారు మాత్రమే సీఎం అవుతారనడంలో అర్థం లేదన్నారు. ఆమె వ్యాఖ్యల్లో నిజం లేదన్నారు. 2027 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పంజాబ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే తన భర్త తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి వస్తాడని కౌర్ చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ఆ తర్వాత ఆమె స్పందిస్తూ తన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఎవరి నుంచి ఏమీ ఆశించలేదని చెప్పారు.

## ఆయుధాల స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న
# ఆరుగురు అరెస్టు




**చండీగఢ్:** పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్‌తో సంబంధాలున్న క్రాస్‌బోర్డర్ ఆయుధ స్మగ్లింగ్ మాడ్యూల్‌ను కూల్చివేసి, ఒక మైనర్‌తో సహా ఆరుగురిని అరెస్టు చేసినట్లు పంజాబ్ పోలీసులు సోమవారం ప్రకటించారు. నిందితుల నుండి పోలీసులు ఆరు పిస్టళ్లను స్వాధీనం చేసుకున్నారని డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు. ఆయుధాల కోసం కోఆర్డినేట్‌లను పంచుకున్న సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నిందితులు పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్‌తో ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని ఆయన అన్నారు. ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో, మాజ్హా (అమృత్‌సర్, గురుదాస్‌పూర్) దోబా (జలంధర్, కపుర్తల, హోషియార్‌పూర్) ప్రాంతాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న నేరస్థులకు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను నిర్వహించడానికి మాడ్యూల్ అక్రమ తుపాకీలను సరఫరా చేసిందని డిజిపి తెలిపారు. అమృత్‌సర్‌లోని కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది. రిసీవర్లు, ఆర్థిక మార్గాలు, నెట్‌వర్క్ ఉన్న లింకేజీలను గుర్తించడానికి తదుపరి దర్యాప్తు జరుగుతోందని డిజిపి తెలిపారు.

# శాంతి ప్రణాళికను జెలెన్‌స్కీ చదవలేదు

సమ్మతించేందుకు సిద్ధంగా లేరు:ట్రంప్ విమర్శ

**కీవ్:** యుద్ధం ముగించేందుకు ఉద్దేశించిన శాంతి ప్రణాళికను సమ్మతించేందుకు ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ సిద్ధంగా లేరని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శించారు. తాను ప్రతిపాదించిన ప్రణాళికను ఆయన ఇంకా చదవలేదని, ఆ విషయం తనకు మనస్తాపం కలిగించిందని అన్నారు. ట్రంప్ ప్రణాళికపై ఉక్రేన్‌కు ఉన్న భిన్నాభిప్రాయాలను పోగొట్టేందుకు, ఈ ప్రణాళికపై ఉన్న వైరుధ్యాలను తగ్గించేంకు గత శనివారం వరకూ ఫ్లోరిడాలో జరిగిన మూడురోజుల సమావేశంలో అమెరికా ప్రతినిధులు ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ఆదివారం రాత్రి ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ, "జెలెన్‌స్కీ తాను ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను చదవలేదని మనస్తాపం చెందారు. ఆయన తరపున పనిచేస్తున్న దిగువస్థాయి అధికారులు, ఆయన అనుచరులు ఈ ప్రణాళికను ఇష్టపడుతున్నారు, కానీ ఆయన మాత్రం ఇష్టపడటంలేదు" అని విమర్శించారు. ఈ పరిణామాల మధ్య ఉక్రేన్ సమస్యపై మంగళవారం భద్రతామండలి సమావేశం ఏర్పాటు చేసింది. డిసెంబరు మాసానికిగాను ఐక్యరాజ్యసమితి భద్రతామండలి అధ్యక్ష బాధ్యతలను స్లోవేనియా నిర్వహిస్తున్నది. అపరిష్కృతంగా ఉన్న ఉక్రేన్ సమస్యపై ఓపెన్ డిబేట్‌లో అందరూ పాల్గొనాల్సిందిగా స్లోవేనియా ఆహ్వానించింది. గాజాలో శాంతి ఒప్పందం విజయవంతం కావడంతో ఆ స్ఫూర్తితో ఉక్రేన్‌లో శాంతి స్థాపనకు 28 అంశాలతో ట్రంప్ గతనెలలో ఒక ప్రణాళిక రూపొందించారు. దీనిపై అమెరికా రక్షణశాఖాధికారులు ఉక్రేన్ వెళ్ళి ఈ ప్రణాళికను జెలెన్‌స్కీకి వివరించారు. ఈ ప్రతులను ఆయనకు అందజేశారు. ఇందులోని అంశాలు రష్యాకే ఎక్కువగా అనుకూలంగా ఉన్నాయని ఆయన గగ్గోలు పెట్టడంతో జెనీవా సమావేశంలో కొన్ని మార్పులు చేర్పులు కూడా చేశారు. మరోవైపు వారం క్రితం ట్రంప్ దూతలు మాస్కో వెళ్ళి శాంతి ప్రణాళిక ప్రతులను పుతిన్‌కు అందజేశారు. ఆయనతో ఐదు గంటలు చర్చించారు. ఈలోపు యూరోపియన్ యూనియన్ నాయకులు జెలెన్‌స్కీకి అండగా నిలబడ్డారు. వారి జోక్యం, వారి సలహా సంప్రదింపులతో ఫ్లోరిడాలో ఉన్న తమ దూతలకు జెలెన్‌స్కీ ఫోన్ ద్వారా కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఆ మేరకు ఆయన దూతలు సమావేశంలో తమ వాదన వినిపించారు. శాంతి ఒప్పందం సాధించాలంటే కొన్ని త్యాగాలు చేయకతప్పదని ట్రంప్ చెబుతూ వస్తున్నారు. కానీ జెలెన్‌స్కీ అందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంలేదన్నది ట్రంప్ ఆవేదన. వారం



రోజుల్లో వివాదాస్పద భూభాగాలను ఉక్రేన్ ఖాళీ చేయకపోతే బలవంతంగా తామే ఖాళీచేయించి ఆ ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటామని పుతిన్ మూడు రోజుల క్రితమే అల్టిమేటం ఇచ్చారు. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ సోమవారం లండన్‌కు చేరుకున్నారు. బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్‌తో సంప్రదింపులు జరిపారు. ఈ పరిస్థితుమధ్య ట్రంప్ స్పందించారు. వాస్తవానికి రష్యా అధ్యక్షుడు కూడా ట్రంప్ ప్రణాళికపై బహిరంగంగా స్పందిస్తూ, ఆయన ప్రణాళిక అలాస్కాలో తమ మధ్య జరిగిన చర్చలకు అనుగుణంగా రూపొందించారని ప్రశంసించారు. ఐతే కొన్ని అంశాలు తమకు ఆమోదయోగ్యంగా లేవని కూడా చెప్పారు.

## ఉమీద్ పోర్టల్‌లో 5.17 లక్షల
## వక్ఫ్ ఆస్తుల ఆమోదం ప్రారంభం

**న్యూఢిల్లీ:** వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించి ఆధునిక విధానాలను అవలంబించేందుకు, నవీనీకరణ పద్ధతులు పాటించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన "ఉమీద్" పోర్టల్ ద్వారా 5.17 లక్షల ఆస్తులను ఆమోదించే ప్రక్రియ ప్రారంభమైంది. ఉమీద్ (ఏకీకృత వక్ఫ్ యాజమాన్య, సాధికార, సామర్థ్య, అభివృద్ధి చట్టం) పోర్టల్‌లో డిసెంబరు ఆరోతేదీతో ముగిసిన గడువునాటికి అప్‌లోడ్ చేసిన 2,16,905 ఆస్తులకు ఆమోదాలు లభించగా మిగిలినవాటికి ఆమోదం తెలియజేసే ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ ప్రక్రియలో భాగంగా మొత్తం 5.17 లక్షల ఆస్తులను అప్‌లోడ్ చేశారు. 1995 నాటి ఉమీద్ చట్టం కింద వక్ఫ్ ఆస్తులను అప్‌లోడ్ చేసే ప్రక్రియకు ఆరునెలలు గడువు ఇచ్చారు. ఈ గడువు డిసెంబరు ఆరోతేదీతో ముగిసింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చింది. ఈ పోర్టల్ ద్వారా ఆస్తులను నిర్వహణను, యాజమాన్యాలు ఏ విధంగా అప్‌లోడ్ చేయాలనే విషయంపై సంబంధిత సంస్థలన్నింటికీ కార్యక్రమాలు కూడా టెక్నికల్ సిబ్బంది నిర్వహించారు.

ప్రజాపక్షం
మంగళవారం, 09 డిసెంబరు


## పిటిఐ – టాస్ ఒప్పందం ప్రాధాన్యం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన సందర్భంలో జరిగిన ఇండియా–రష్యా బిజినెస్ ఫోరం సమావేశంలో ఒక ప్రాధాన్యతగల ఒప్పందం జరిగింది. అది ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పిటిఐ), రష్యన్ వార్తాసంస్థ టాస్ మధ్య రెండు దేశాల్లోని పరిణామాలపై వార్తా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు ఉద్దేశించిన ఒప్పందం. ఇవాళ ప్రపంచం అమెరికా, యూరప్‌లనుండి నిర్వహించబడుతున్న వార్తా సంస్థలనుండి అంతర్జాతీయ వార్తలు అందుకుంటున్నది. అవి ప్రపంచ పరిణామాల వార్తలను పశ్చిమ దేశాల కోణం నుంచి మలిచి, వ్యాఖ్యానాలు దట్టించి ప్రపంచవ్యాప్తంగా అందిస్తుంటాయి. రాయిటర్స్, ఎఎఫ్‌పి వాటిలో ప్రధానమైనవి. పశ్చిమ దేశాలు ప్రధానంగా సోషలిస్టు దేశాలకు, తృతీయ ప్రపంచ దేశాలకు విరోధుల లాంటివి. పశ్చిమ దేశాల పాలకుల ప్రజా వ్యతిరేక చర్యలను సమర్థిస్తూ, వాటికి వ్యతిరేకంగా జరిగే ప్రజాందోళనలను వక్రీకరిస్తుంటాయి. తృతీయ ప్రపంచ దేశాలపై పశ్చిమ దేశాల ఆర్థిక, సైనిక దాడులను ప్రజాస్వామ్యహితమైనవిగా ప్రచారం చేస్తూ, పశ్చిమ దేశాల దోపిడీ ప్రయోజనాల ను కాపాడే నియంతలను సమర్థిస్తూ ఉంటాయి. ఇటీవల దశాబ్దాల్లో అఫ్ఘానిస్థాన్, ఇరాక్, లిబియా, సిరియాపై సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలు, గాజాలో పాలస్తీనియన్‌లపై ఇజ్రాయెల్ మారణహోమం, ఉక్రేన్‌ను పావుగా ఉపయోగించుకుని రష్యాపై పశ్చిమ దేశాలు సాగిస్తున్న ప్రాక్సీ యుద్ధం, బంగ్లాదేశ్, నేపాల్‌లలో జన్–జడ్ ఆందోళనలు పశ్చిమ వార్తాసంస్థల వక్రీకరణ వార్తలకు ఉదాహరణలు. ఇవాళ లాటిన్ అమెరికాలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాగిస్తున్న 'ప్రభుత్వ మార్పిడి' కుట్రలు, కుతంత్రాలు, సైనిక బెదిరింపులు ఈ వార్తాసంస్థలకు ప్రజాస్వామ్యబద్ధంగానే కనిపిస్తాయి. ఈ ఉద్దేశపూర్వక వక్రభాష్య వార్తలను విశ్లేషించుకుని అసలు వాస్తవమేమిటో తెలుసుకోవటం ప్రపంచవ్యాప్తంగా పత్రికా పాఠకులకు, ఎలక్ట్రానిక్ మీడియా వీక్షకులకు ఎంతో కష్టం. అంతశ్రమ మీకెందుకన్నట్లు ఇప్పుడు టెలివిజన్ వార్తాఛానళ్లు ఇచ్చే పొడిపొడి స్క్రోలింగ్‌లతో సరిపెట్టుకోవలసి వస్తోంది.

ఈ పరిస్థితుల్లో పిటిఐ–టాస్ వార్తా సమాచార మార్పిడి ఒప్పందం కొత్త బాట వేస్తున్నది. పశ్చిమ వార్తాసంస్థలపై ఆధారపడకుండా పరస్పరం సమాచారం మార్పిడి వాస్తవ సమాచారాన్ని వక్రభాష్యాలు లేకుండా ఇచ్చిపుచ్చుకునే అవకాశం ఆహ్వానించదగింది. ఈ ఒప్పందంపై పిటిఐ సిఇఒ, ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి, టాస్ డైరెక్టర్ జనరల్ ఆండ్రీ కొండ్రాషోవ్ సంతకాలు చేశారు. రష్యా–భారత్ మధ్య స్నేహం, పరస్పర అవగాహనను పటిష్టం చేసే దిశలో ముఖ్యమైన చర్యగా ఈ ఒప్పందాన్ని కొండ్రాషోవ్ అభివర్ణించారు. ''మన ప్రజలు, మన సంస్కృతుల మధ్య మాస్ మీడియా ఒక వంతెన. పిటిఐ, టాస్ ఒప్పందం కారణంగా, ఈ వారధి మరింత విశ్వసనీయంగా, పటిష్టంగా ఉంటుంది'' అన్నారు. పిటిఐ జోషి వ్యాఖ్యలు గమనార్హమైనవి. 'ఇవాళ ప్రపంచ సమాచార ప్రసారం ప్రధానంగా పశ్చిమదేశాల లెన్స్‌ల గుండా జరుగుతోంది. అమెరికా, యూరప్ కేంద్రంగా పనిచేస్తున్న వార్తాసంస్థలు ఆధిపత్యం వహిస్తున్నాయి. వాటి దోహదం ప్రాముఖ్యతగలదే అయినప్పటికీ, ఈ అసమతౌల్యం కొన్నిసార్లు భిన్నమైన అభిప్రాయాలు పాఠకులకు చేరకుండా పరిమితం చేస్తున్నాయి' అన్నారు. ఈ పరిస్థితుల్లో, ''మన సహకారం ఆ పరిధిని విశాలమొనర్చుతుంది – మూడవ పక్షం వడపోత లేకుండా మన రెండు దేశాల మధ్య అభిప్రాయాలు, కథనాలు, దృక్పథాలు నేరుగా ఇచ్చిపుచ్చుకునే అవకాశం ఏర్పడుతుంది. సమాచారం అందించటం, సంబంధం ఏర్పరచటం, అన్నిటికీ మించి సత్యాన్ని పరిరక్షించటం జర్నలిజం పని అన్నారు.

అయితే సమాచారం సేకరణ, ప్రసారంలో పాలకపార్టీ కథనానికి బద్ధులు కావటం, లేదా వ్యాపార ప్రయోజనంతో ప్రపంచ గుత్తపెట్టుబడిదారులు, పాలకులకు అనుకూలంగా సమాచారాన్ని వక్రీకరించటం, కథనాలు వండివార్చటం – రెండూ స్వేచ్ఛాయుత జర్నలిజానికి ప్రమాదాలే. కాబట్టి వక్రీకరించకుండా వార్తలు ఇచ్చి, సమగ్ర సమాచారం ఆధారంగా నిర్ధారణలు చేసుకునే స్వేచ్ఛను పాఠకులకు ఇవ్వాలి. స్థానిక స్థాయిలో చూస్తే ఇవాళ వార్తాపత్రికలు, టెలివిజన్ ఛానల్స్ రాజకీయ పార్టీలకు బాకాలుగా తయారై వార్తలను వక్రీకరిస్తూ ప్రజలను గందరగోళపరుస్తున్న దుస్థితి మీడియా దిగజారుడుకు పరాకాష్ట.

# నరేంద్రమోదీ అభివృద్ధి ఓ అంకెల గారడీ!


ఎం.కోటేశ్వరరావు

పరిశ్రమల్లో మార్పులు తగ్గితే విద్యార్థుల గ్రేడ్ (నాణ్యత) తగ్గుతుంది. సమాధానాల పేరుతో పేజీల కొద్దీ రాసినా అసలు విషయాలు లేకపోతే మార్కులు పడవు. పదకొండు సంవత్సరాల పాలనలో నరేంద్రమోదీ సర్కార్ అందచేస్తున్న జిడిపి వృద్ధి అంకెల నాణ్యతను అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) గతంలో ప్రశ్నించింది. ఎలాంటి స్పందన, మార్పులు లేకపోవటంతో కొద్దిరోజుల క్రితం సి గ్రేడ్‌కు తగ్గించింది. దీని గురించి గురువారంనాడు (2025, డిసెంబరు 4) లోక్‌సభలో సమర్పించుకుంటూ వచ్చే ఏడాదినుంచి 2022–23 సంవత్సరాన్ని నూతన ప్రాతిపదికగా తీసుకుంటామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఎన్‌సిపి సభ్యురాలు సుప్రియా సూలే అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ గణాంకవిధానం గురించి ఐఎంఎఫ్ చెప్పింది తప్ప అభివృద్ధి గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, అనేక అంకెలకు బి గ్రేడ్ ఇచ్చిందని నిర్మల అన్నారు. మన అంకెల నాణ్యత నాలుగు గ్రేడ్లలో దిగువ నుంచి రెండవదని ఉంది. దీనికి అభివృద్ధి అంచనాలకు సంబంధం లేదు, వాటికి చెబుతున్న భాష్యం మీదనే పేచీ. గణింపుకు మీరు తీసుకున్న ప్రాతిపదిక, పద్ధతి ఇప్పుడు, పాతబడిన సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని భాష్యాలు చెబుతున్నారంటూ 2025 ఆర్టికల్ నాలుగు నివేదికలో తలంటింది. మోదీ సర్కార్ అనుసరిస్తున్న విధానం గురించి ఇంటా బయటా గత పదేళ్లు నుంచి అనేక విమర్శలు వచ్చినప్పటికీ ఎలాంటి చలనం లేదు. ప్రస్తుతం 2011–12 సంవత్సర అంకెలను ప్రాతిపదికగా తీసుకొని గణాంకాలను రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి 2022–23 ప్రాతిపదికగా కొత్త సూచీలను రూపొందిస్తామని కేంద్ర ప్రభుత్వ గణాంక మరియు కార్యక్రమాల అమలు శాఖ ప్రకటించింది. అయినప్పటికీ ఐఎంఎఫ్ మనదేశ సమాచార నాణ్యత గ్రేడ్‌ను తగ్గించింది. అంతర్జాతీయంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కొత్త ప్రాతిపదికన నూతన సూచీలను తయారు చేస్తారు. ఐఎంఎఫ్ చర్యతో మరోసారి కేంద్రం చెబుతున్న అభివృద్ధి అంకెల విశ్వసనీయత గురించి మీడియా, సామాన్య జనంలో చర్చ లేకపోయినా ఆర్థికవేత్తల్లో మొదలైంది.

మన దేశ జిడిపి గురించి ప్రభుత్వం చెప్పే అంకెలకు ఐఎంఎఫ్ అంచనాలకు తేడా ఉంది. అది విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిజమైన జిడిపి వృద్ధి రేటు 6.5శాతం కాగా 2025–26 తొలి మూడు మాసాల్లో 7.8 శాతం ఉంది. అయితే ఐఎంఎఫ్ మాత్రం 2025–26లో 6.6శాతం ఉంటుందని, మరుసటి ఏడాది 6.2శాతమని అంచనా వేసింది. మన ప్రభుత్వం అనుసరిస్తున్న గణాంక, విశ్లేషణ పద్ధతులపై ఐఎంఎఫ్ చాలా సంవత్సరాల నుంచి విభేదిస్తున్నప్పటికీ సంస్థ నిబంధనల ప్రకారం సభ్యదేశాలు ఇచ్చిన అధికారిక సమాచారాన్ని ప్రాతిపదికగా తీసుకొని తన విశ్లేషణలను అందిస్తున్నది. వాటి గురించి తన భిన్నాభిప్రాయాన్ని చెప్పవచ్చు తప్ప సమాచారాన్ని తిరస్కరించేందుకు వీల్లేదు. కొద్ది సంవత్సరాలుగా వెల్లడిస్తున్న అభిప్రాయాలను జనం దృష్టికి తేలేదు. ఇప్పుడు కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. గత పదేండ్లలో పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి, కరోనా తరువాత చెప్పే అంకెలకు, వాస్తవానికి తేడా ఉంటోందని ఐఎంఎఫ్ భావించింది. కొద్ది సంవత్సరాలుగా అంతర్జాతీయంగా తన విభేదాలను వెల్లడిస్తున్నా చివరికి 2025లో సమాచార నాణ్యత గురించి గ్రేడ్‌ను తగ్గించింది. ఇప్పుడెందుకు ఆ పని చేసింది. ముందే చెప్పుకున్నట్లుగా వచ్చే ఏడాది 2022–23 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని కొత్త సిరీస్‌ను విడుదల చేయనుంది గనుక ఇప్పటి వరకు గమనించిన లోపాలను సరిదిద్దాలనే ఉద్దేశ్యంతోనే ఈ పనిచేసిందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు ఇచ్చే సమాచారాన్నే ప్రాతిపదికగా తీసుకుంటున్నది తప్ప సంఘటిత, అసంఘటితరంగ సమాచారాన్ని నిర్దిష్టంగా సేకరించటం లేదనే విమర్శ ఉంది. ద్రవ్యోల్బణాన్ని లెక్కించేందుకు టోకు ధరలను ప్రామాణికంగా తీసుకుంటున్నది, దీనికి బదులు ఉత్పత్తి ధరలు, రంగాల వారీ ధరలను పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు. మొత్తంమీద ఆర్థిక రంగం గురించి ఎలాంటి వ్యాఖ్య చేయలేదు కదా, నాణ్యత లేని సమాచారం ఆధారంగా తీసుకోవటాన్ని ఐఎంఎఫ్ తప్పుపట్టిందని మాత్రమే కొందరు సూత్రీకరిస్తున్నారు. రుణాలు, విదేశీమారకద్రవ్యం, ఖర్చు గురించి సరైన లెక్కలే చెబుతున్నారు కదా అంటున్నారు. ముఖం ఎలా ఉందో ఎవరికైనా తెలుస్తుంది, దాన్ని వేరేగా చెబితే వెంటనే బండారం బయటపడుతుంది. శరీరం అంతర్భాగంలో ఉన్నవాటిని ఎవరో ఒక నిపుణుడు చెబితేనే కదా మనకు తెలిసేది, ఆ చెప్పటంలోనే నిపుణుల మధ్య ఏకాభిప్రాయం, నాణ్యత లేదన్నది సమస్య. కేవలం చెయ్యి చూసి అంతాబాగానే ఉందంటే కుదురుతుందా? నాణ్యత లేని వస్తువును కొన్నపుడు అది ఎంతకాలం మన్నుతుందో తెలియదు, నాణ్యత లేని సమాచారం ప్రాతిపదికగా ఏ రంగమైనా దీర్ఘకాలిక వ్యూహాలను ఎలా రూపొందించుకుంటుంది ?

జిడిపి వృద్ధి రేటు ఎక్కువగా ఉందని చూపుతున్నపుడు దానికి తగినట్లుగా కార్పొరేట్ ఫలితాలు కనిపించటం లేదన్నది కొందరి ప్రశ్న. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో జడిపి వృద్ధి రేటు 7.4శాతం ఉంటుందని, పబ్లిక్ ఫైనాన్స్ మరియు విధాన జాతీయ సంస్థ(ఎన్‌ఐపిఎఫ్‌పి) చెప్పింది.మూడీస్ రేటింగ్ సంస్థ 2026, 2027 సంవత్సరాలలో ప్రపంచ వృద్ధి రేటు 2.5, 2.6శాతం మధ్య, భారత వృద్ధి 6.4 మరియు 6.5, చైనా 4.5శాతం ఉంటుందని పేర్కొన్నది. ఇవి చూడటానికి బాగానే ఉన్నాయి. పశ్చిమ దేశాల సూత్రం ప్రకారం జిడిపి వృద్ధి రేటు కంటే కార్పొరేట్ లాభాల రేటు మూడు, నాలుగు శాతం ఎక్కువగా ఉంటుంది. మనదేశంలో కూడా దశాబ్దాల పాటు అలాగే ఉంది. కానీ సెప్టెంబరుతో ముగిసిన మూడు మాసాల్లో నిఫ్టీ 50 సూచికలో పెరుగుదల కేవలం ఏడుశాతమే. మొత్తం లాభాలు 13శాతం కాగా పన్నులు పోను నికర లాభం తొమ్మిదిశాతమే ఉంది. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబించకపోవచ్చుగానీ దాన్ని విస్మరించలేము. నిఫ్టీ మైక్రోకాప్ 250 అమ్మకాల వృద్ధి 12శాతం ఉన్నా, మొత్తం లాభాలు ఆరుశాతమే ఉన్నాయి. జిడిపి వృద్ధి రేటు స్థిరంగా ఉంటే ఈ ఫలితాల సంగతేమిటి? ఏ అంకెలు వాస్తవానికి దగ్గరగా ఉన్నట్లు? ఆసియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్ 2024 మే నెలలో జిడిపి అంకెలు ఎలా వస్తున్నాయో నాకు నమ్మకం లేదు అని వ్యాఖ్యానించాడు. ఆ మాటలు వైరల్ కావటంతో ఒక్క రోజులోనే తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్నారు. ఎక్కడి నుంచి వత్తిడి వచ్చిందో అర్థం చేసుకోవటం కష్టం కాదు.

జిడిపికి దోహదం చేసేవాటిలో వినియోగవృద్ధి ఒకటి. దేశంలో నిజవేతనాలు పడిపోవటం లేదా గిడసబారి పోయినట్లు చెబుతుండగా గృహస్తుల వినియోగం పెరిగిందని చెప్పటం మీద అనుమానాలు ఉన్నాయి. రెండవ అంశం పెట్టుబడులు, మొత్తం పెట్టుబడుల్లో ప్రైవేటు పెట్టుబడులు నరేంద్రమోదీ అధికారానికి వచ్చినపుడు జిడిపిలో 31.3శాతం ఉంటే 2024–25లో 29.6శాతం ఉన్నాయి. మధ్యలో ఒక ఏడాది మాత్రమే 31.2శాతం నమోదయ్యాయి. మిగిలిన అన్ని సంవత్సరాలలో అంతకంటే తక్కువే. ఈ కాలంలో కార్పొరేట్ పన్ను మొత్తం ప్రైవేటు రంగానికి ఇచ్చిన ప్రోత్సాహాన్ని చూస్తే కార్పొరేట్ పన్ను విధింపు 30శాతం నుంచి 15కు తగ్గించారు. అయినా పారిశ్రామికరంగం వాటా జిడిపిలో 2014తో పోల్చితే తగ్గింది లేదా స్థిరంగా ఉంది తప్ప పెరగలేదు. చైనాలో సాధారణ కార్పొరేట్ రేటు 25 శాతం కాగా మన దేశంలో కొత్త సంస్థలకు 15శాతంగా రాయితీ ఇచ్చినప్పటికీ చైనా నుంచి కంపెనీలు ఆశించిన స్థాయిలో రాలేదు. మేకిన్ ఇండియా విధానంతో 2022 నాటికి జిడిపిలో పారిశ్రామిక రంగం వాటా 25శాతం లక్ష్యంగా చెప్పారు. తరువాత దాన్ని 2025కు పొడిగించామన్నారు. వాస్తవ పరిస్థితి ఏమిటి? 2006లో 17.3 శాతం ఉండగా మోదీ అధికారానికి వచ్చినపుడు 2014లో 15.07 నమోదైంది. తరువాత నేటి వరకు చూస్తే 13శాతానికి పడిపోయింది. పదవ స్థానంలో ఉన్న జిడిపిని ఐదుకు తెచ్చామంటారు, మరి దీని సంగతేమిటి? జిడిపిని 2022 నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు పెంచుతామన్నారు, పారిశ్రామిక ఉత్పాదకత పెరగకుండా అదెలా సాధ్యం? ప్రైవేటు పెట్టుబడులు తగ్గిపోయాయి, ప్రభుత్వ పెట్టుబడులు పెట్టటం లేదు. ఆర్థిక మాంద్యం వచ్చినపుడు అమెరికాలో భారీ మొత్తంలో రోడ్లు, వంతెనలు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల మీద అక్కడి ప్రభుత్వం ఖర్చుచేసి కొనుగోలు శక్తి పెంచేందుకు చూసింది. అక్కడి మాదిరి మాంద్యాలు లేకపోయినా మందగమనం కారణంగా మన దేశంలో కూడా జరుగుతున్నది అదే. ప్రైవేటురంగం తనకు లాభం ఉంటుందా లేదా అని ఆచితూచి పెట్టుబడులు పెడుతోంది. వాజ్‌పాయ్ నుంచి మధ్యలో మన్మోహన్ సింగ్, ఇప్పుడు నరేంద్రమోదీ వరకు భారీమొత్తాలను కేటాయించి జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వే విస్తరణ, సరిహద్దుల్లో రోడ్లు, వంతెనల వంటివి నిర్మిస్తున్నారు. అవి లేకపోతే పరిస్థితి మరింత దిగజారి ఉండేది, బిజెపి నేతలు రోడ్లను చూపి చూశారా మా ప్రతిభ అంటున్నారు. అదే సామర్థ్యాన్ని ఉత్పాదకరంగంలో ఎందుకు చూపలేకపోతున్నారు? మోటారు వాహనాలు, ఎలక్ట్రానిక్స్ వంటి వాటి ఉత్పాదకతను పెంచకపోయినా పడిపోకుండా చూసేందుకు ఇటీవల తగ్గించిన జిఎస్‌టి కూడా ఆయా రంగాలకు ఉద్దీపనలో భాగమే. చిత్రం ఏమిటంటే జిఎస్‌టి తగ్గించిన రెండు నెలల తరువాత నవంబరు మాసంలో పన్ను వసూలు పెరగకపోగా వర్తమాన ఆర్థిక సంవత్సరంలో అతి తక్కువగా నమోదైంది.

జిఎస్‌టి తగ్గింపు గురించి గతేడాదే సంప్రదింపులు మొదలయ్యాయి. తగ్గింపుతో డిమాండ్ పెరిగి ప్రైవేటు రంగానికి పెద్ద ఊపువస్తుందన్న అంచనాతో 2025–26 బడ్జెట్‌లో ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించేందుకు పూనుకుంది. వాటిలో గ్రామీణ ఉపాధి పథకానికి నిధుల కోత ఒకటి. 2023–24లో రు.89,154 కోట్లు ఖర్చు చేస్తే 2025–26లో రు.86వేల కోట్లకు కుదించారు. 2025 జనవరిలో చూస్తే ఏడు రాష్ట్రాలలో ప్రకటించిన వేతన సగటు రు.294 కాగా చెల్లించిన మొత్తం రు.257 మాత్రమే. తెలంగాణాలో రు.319కిగాను రు.276, ఆంధ్రప్రదేశ్‌లో రు.300కు గాను రు.258 చెల్లించారు. జిడిపిలో ప్రభుత్వ ఖర్చు వాటాను 15.6 నుంచి 15శాతానికి తగ్గించారు. వాస్తవంలో ఇంకా దిగజారుతుందేమో తెలియదు. మొత్తంగా దేశమంతటా శ్రామికుల నిజవేతనాలు పెరగకుండా వస్తు, సేవలకు గిరాకీ పెరగదు. ఉద్యోగులకు వేతన సవరణ చేసినంత మాత్రాన మొత్తం గిరాకీ మీద దాని ప్రభావం పెద్దగా ఉండదు. ఉదాహరణకు రెండు తెలుగు రాష్ట్రాలలో చూస్తే కోట్లాదిమంది రాబడిని పెంచే అసంఘటితరంగ కార్మికుల వేతనాలను ఉమ్మడి రాష్ట్రంలో మాత్రమే పెంచారు. ఐదేండ్లకు ఒకసారి సవరిస్తే ఈ పాటికి మూడుసార్లు పెరిగేవి. ప్రభుత్వాల ఖర్చు అంటే ఏదో ఒక రూపంలో జనాలకు చేరే మొత్తాలతో పాటు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకూ లబ్ధి చేకూరుతుంది. ప్రైవేటు పెట్టుబడులు అలాంటివి కాదు, వాటి లాభాలే ప్రాతిపదికగా ఉంటాయి. అందువలన ప్రభుత్వ వైఖరిలో వచ్చిన మార్పు రానున్న రోజుల్లో ఏ పరిణామాలు, పర్యవసానాలకు దారి తీస్తుందో చూడాల్సి ఉంది. అధికారంలో ఎవరున్నా చేసింది అంకెల గారడీ గనుకనే సామాన్యుల స్థితిలో పెద్దగా మార్పులేదు, వచ్చే ఏడాది నూతన సీరీస్ అంటున్నారు గనుక మరో జిమ్మిక్కు చేయనున్నారా!

# చైనా దిగుమతులా.. పెట్టుబడులా?



భారత్‌ను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా మార్చాలనే ఆశయంతో 2014లో ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ముందుకు వచ్చింది. కానీ దశాబ్దం తర్వాత వాస్తవ పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. 2025 నాటికి తయారీ రంగం జిడిపిలో వాటా 14 శాతం కంటే దిగువకు పడిపోవడం గమనార్హం. 'ది వైర్'లో వైశాలీ బసు శర్మ తన వ్యాసంలో పేర్కొన్న అంశాలను అనుసరించి, చైనాపై ఆధారాన్ని తగ్గించాలన్న లక్ష్యం నెరవేరకపోగా, అది వస్తువుల నుంచి ముడిసరుకు లేదా ప్రాసెస్‌లో ఉన్న సరుకు ఇన్‌పుట్స్‌గా మారింది. ఇది మరింత ప్రమాదకరం. స్వదేశీకరణకు విఘాతం. చైనా ప్రస్తుతం భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. 2024–25లో ద్వైపాక్షిక వాణిజ్యం 113.5 బిలియన్ డాలర్లకు చేరింది.

ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, రసాయనాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, టెలికాం భాగాలు వంటి కీలక రంగాల్లో చైనా దిగుమతుల వాటా అధికంగా ఉంది. ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీలో 60 శాతం కంటే ఎక్కువ చైనా నుంచే జరుగుతుండటంతో, భారత్ తన ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్‌ను విస్తరించాలంటే చైనా కంపెనీలతో అనుసంధానం తప్పనిసరిగా మారుతోంది. వాణిజ్యం పెరుగుతున్నప్పటికీ, చైనా నుంచి భారత్‌కు వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) భారీగా తగ్గాయి. 2015లో 705 మిలియన్ డాలర్ల గరిష్ట స్థాయికి చేరిన పెట్టుబడులు, 2023 నాటికి 100 మిలియన్ డాలర్ల కంటే తక్కువకు పడిపోయాయి. 2020లో జారీచేసిన ప్రెస్ నోట్–3 (పిఎన్3) ప్రకారం, భూసరిహద్దు కలిగిన దేశాల పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి కావడంతో ఈ పతనం మరింత తీవ్రతరమైంది. దీని ప్రభావంగా 2024– 25లో నికర ఎఫ్‌డిఐ 353 మిలియన్ డాలర్ల చరిత్రాత్మక కనిష్ఠానికి చేరింది. బివైడి వంటి భారీ పెట్టుబడులు నిలిచిపోవడం వల్ల భారత్ కీలక మూలధనం, సాంకేతిక పరిజ్ఞానాన్ని కోల్పోయింది. అది కూడా దేశీయ ప్రైవేటు పెట్టుబడులు బలహీనంగా ఉన్న సమయంలో చోటు చేసుకోవ డం మరింత ఆందోళన కలిగిస్తున్నది. చైనా పెట్టుబడులు తగ్గడంతో, దేశీయ పెట్టుబడులను ముందుకు నడిపించే భారం ప్రభుత్వంపై పడింది. ఆర్థికవేత్తలు ఈ విధానాన్ని వ్యతిరేక ఫలితాలనిచ్చేదిగా అభివర్ణిస్తున్నారు. దిగుమతులకు అనుమతిచ్చే బదు లు, పెట్టుబడులను ప్రోత్సహిస్తే ఉద్యోగాలు, విలువ సృష్టి దేశంలోనే జరుగుతాయని వారి వాదనం. ఇలావుంటే, ఇటీవలి కాలంలో భారత్ –చైనా మధ్య సంబంధాలు కొంత స్థిరపడుతున్నాయి.

2024 అక్టోబర్‌లో సరిహద్దు చర్చలు, 2025లో బీజింగ్‌లో విదేశాంగ మంత్రి పర్యటన, ఎస్‌సిఒ సదస్సులో ప్రధాని పాల్గొనడం, ద్వైపాక్షిక సంబంధాల సాధారణీకరణకు సంకేతాలు. అరుదైన లోహాల మాగ్నెట్లు, ఎరువుల సరఫరాకు చైనా అంగీకరించడం, చైనా పర్యాటకుల వీసా సడలింపులు కూడా అదే దిశగా సూచిస్తున్నాయి. ఆర్థిక సర్వే 2023–24, నీతిఆయోగ్ వంటి సంస్థలు చైనా పెట్టుబడులపై సడలింపుల అవసరాన్ని ప్రస్తావించాయి. కొన్ని రంగాల్లో 24–49 శాతం ఈక్విటీ అనుమతిపై కూడా చర్చ జరుగుతోంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించినట్లుగా, భారత కంపెనీలతో జాయింట్ వెంచర్‌లలో చైనా సంస్థలకు పిఎల్ఐ పథకం వర్తించడం ఇదే ఆలోచనకు ప్రతిబింబం. కాగా, కేవలం దిగుమతులపై మాత్రమే ఆధారపడితే దేశీయ పరిశ్రమలు సరఫరా షాకులు, భూకౌశల్య ఉద్రిక్తతలకు గుర య్యే ప్రమాదం ఉంది. అదే సమయంలో, నియంత్రిత చైనా పెట్టుబడులు ఉత్పత్తి ని దేశంలో స్థిరపరచి, ఉపాధి, సాంకేతికతను తీసుకురాగలవు. రక్షణ, వ్యూహాత్మక రంగాల్లో భద్రతా పరిమితులు పాటిస్తూనే, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక శక్తి, మూలధన వస్తువుల రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించడం ప్రాయోగిక మార్గంగా కనిపిస్తోంది. ఏదిఏమైనా, చైనా దిగుమతులపై ఆధారపడడమా లేక సామర్థ్యాన్ని నిర్మించే పెట్టుబడులను ప్రోత్సహించడమా? అనే రెండు అంశాల్లో ఒకదానివైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చైనా నుంచి పూర్తిగా విరమించుకోవడం ప్రపంచ సరఫరా గొలుసుల వాస్తవికతకు విరుద్ధం.

కాబట్టి, జాతీయ భద్రతను సమతుల్యం చేస్తూ, పెట్టుబడుల ఆధారిత స్వదేశీకరణకు మొగ్గు చూపడాన్నే భారత్ దీర్ఘకాలిక పారిశ్రామిక ప్రయోజనాలకు అనుకూలమైన మార్గమన్నది నిపుణులు అభిప్రాయం.

# 'అవినీతి చీడలు' అభివృద్ధికి గొడ్డలి పెట్టు!

నేటి ప్రపంచ మానవాళి పలు సవాళ్లు, అసమానతలు, అన్యాయాలు, విషాదాలు, మారణహోమాలు, అపరిమిత అవినీతి చేష్టలు లాంటి సమస్యలతో సతమతం అవుతున్నది. ప్రపంచ యువత అనేక రంగుల కలలు, ఎదగాలనే ఆకాంక్షలతో ముందుకు సాగడానికి ప్రయత్నాలు చేస్తున్న వేళ అవినీతి, లంచగొండితనం లాంటి చెదలు వారిని ఎదుగుదలను/ఉద్యోగ ఉపాధులను/విద్యా అవకాశాలను/ నైపుణ్య ప్రదర్శనలను/వైద్య ఆరోగ్య సంరక్షణను అడ్డుకోవడం, యువతలో అశాంతికి ఆజ్యం పోయడం జరుగుతున్నది. దీనికి తోడుగా అవినీతి చెదలు విస్తరిస్తూ పర్యావరణ విధ్వంసం, ప్రతికూల వాతావరణ మార్పులకు కారణం అవుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 2 బిలియన్లమంది యువత అవినీతికి వ్యతిరేకంగా ప్రమాణం చేసి, బలీయ శక్తిగా ఎదిగి, నైతికతకు పట్టం కట్టి, అక్రమాల కట్టడికి నడుం బిగిస్తేనే ఉజ్వల భవిత దర్శనమిస్తుందని తెలుసుకోవాలి. ప్రపంచ యువత నైతిక ప్రవర్తన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ అవినీతి నిర్మూలనకు పూనుకోవాలని, ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ప్రపంచమే ఒక యుద్ధ క్షేత్రంగా మారి మానవత్వం మసకబారుతుందని గుర్తుంచుకోవాలి.

ఆధునిక పౌర సమాజం లో వేళ్లూనుకుపోయిన అవినీతి చెదలు, లంచాల పీడలను పెకిలించడానికి యువశక్తి మాత్ర మే చొరవ చూపాలి. యువతలో అవినీతి నిర్మూలన పోరాటాగ్నిని రగల్చడానికి ఐరాస నేతృత్వంలో 2004 నుంచి ప్రతి ఏట 09 డిసెంబర్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినం (ఇంటర్నేషనల్ యాంటీ కరప్షన్ డే) పాటించుట జరుగుతోంది.




అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం–2025 ఇతివృత్తంగా అవినీతి నిర్మూలనతో మానవ గౌరవానికి ప్రోత్సాహం అనబడే అంశాన్ని తీసుకున్నారు. అవినీతి నిర్మూలనకు యువ యోధుల్లో నైతిక ప్రవర్తన, నీతివంతమైన సమాజ స్థాపన, లంచగొండి గుణాలను పాతరేయడం, నీతి నిజాయితీల ప్రాధాన్యాన్ని పలు వేదికల్లో చర్చించడం, అక్రమార్కుల భరతం పట్టడం, లంచావతారులను అవినీతి నిరోధక శాఖ ద్వారా పట్టించడం, నీతిమంతులను సన్మానించడం, పారదర్శక పాలన ప్రయోజనాలను అవగాహన పర్చడం, అవినీతికి వ్యతిరేకంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది హ్యాష్‌టాగ్ గా 'యునైటెడ్ అగైనెస్ట్ కరప్షన్' అనే నినాదాన్ని తీసుకున్నారు.

భారత్‌లో అవినీతి, లంచగొండితనం నిత్య నినాదంగా, సర్వవ్యాప్తం అయ్యింది. వార్డు మెంబర్ నుండి ఎంపి వరకు, సర్పంచ్ నుంచి కేంద్రమంత్రి వరకు ఎవరి చరిత్ర చూసినా అవినీతి, అక్రమార్జనల కంపు కొడుతున్నది. లంచం ఇవ్వనిదే చిన్న చీమైనా కుట్టడం లేదు. అవినీతి చేయని అధికారి కనిపించడం అసాధ్యంగా తోస్తున్నది. నిత్యం అవినీతి నిరోధక శాఖ పన్నిన వలలో అవినీతి తిమింగలాలు పడుతూనే ఉన్నాయి. అనివీతి నిర్మూలనకు చేసిన చట్టాలకు లంచాల కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నాయి. మన దేశంలో అవినీతి నిర్మూలన చట్టం1988, భారతీయ న్యాయ సన్హిత2023, లోక్పాల్, లోకాయుక్త, విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ 2014, సివిసి, సిబిఐ, రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ లాంటివి భారత్‌లో అమలు అవుతున్నాయి. ప్రపంచ దేశాల్లో అవినీతిని కొలిచే సూచికలను 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' అధ్యయ నం చేసి వివిధ దేశాల జాబితాను తయారు చేస్తున్నది.

2025లో విడుదలైన గ్లోబల్ కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్(ప్రపంచ అవినీతి సూచీ) ప్రకారం 180 దేశాల జాబితాలో భారత్‌కు 96వ స్థానం దక్కింది. ప్రపంచవ్యాప్తంగా అవినీతిని అంతం చేయడానికి యువతను ఏకంచేస్తూ శక్తివంతం చేయడం, ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం ప్రకటించడం, చట్టాల అమలు, ప్రభుత్వ పని తీరును మెరుగు పరచడం లాంటి చర్యలు నిరంతరం ఉద్యమంగా కొనసాగాలి. ప్రతి ఒక్కరు అవినీతికి నో చెప్పాలి. అవినీతి, అక్రమార్జన, అధికార దుర్వినియోగం, మోసాలు, లంచాలు లాంటి దురాలోచనలు ప్రపంచాభివృద్ధికి ప్రతిబంధకాలని తెలుసుకోవాలి. అవినీతి శృంఖలాలను ఛేదిద్దాం, అక్రమార్జనపరుల భరతం పడదాం, నైతిక ప్రవర్తన ఆయుధాలను సిద్ధం చేద్దాం. మనందరం ఏకమైతే, లంచగొండితనం తోక ముడుస్తుంది. అవినీతి ఆలోచన మానవాళి అభివృద్ధికి గొడ్డలిపెట్టు, దేశభక్తి గొడ్డలితో అవినీతి విష వృక్షాన్ని నిర్దయగా నరికేద్దాం. అవినీతి అంతమే యువత నినాదం కావాలి.

(09 డిసెంబర్ అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినం సందర్భంగా)

మధుపాళీ

# భ్రమలు తొలగించుకోవాలి..

ఇటీవల కాలంలో అనవసర భయాలు.. ఆందోళనలు పెరుగుతున్నాయి. యువత ఎక్కువగా ఈ పరిస్థితులకు లోనుకావడం దురదృష్టకరం. విజయం జీవితంలో ఒకేఒక్క అవకాశం ద్వారా దక్కుతుందని, అప్పుడు విఫలమైతే జీవితంలో విజయం సాధించే అవకాశాలు పూర్తిగా మూసుకుపోతాయనే మానసిక మాయకు గురిచేసేదే 'భ్రమ'. ఇది ప్రతి తప్పును భయంగా మారుస్తుంది. మన సామర్థ్యాన్ని అణిచివేయడానికి కారణమవుతుంది. వాస్తవానికి జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి అనంతమైన అవకాశాలు ఉంటాయి. ఎన్నిసార్లు విఫలమైనా, సాధించే మార్గాలు మిగిలే ఉంటాయి. ఎదురైన ప్రతి అవరోధం ఒక పాఠం నేర్పుతుంది. ఏ విధంగా ముందుకు పోవాలో సూచిస్తుంది. మునుపటి కంటే మరింత మెరుగ్గా శ్రమించడానికి సహాయపడుతుంది. ఈ భ్రమను అధిగమించాలంటే, ప్రతి వైఫల్యాన్నీ ఒక సమాచారం లేదా డేటాగా భావించాలి. 'ఈ ప్రయత్నం ద్వారా నేను ఏమి నేర్చుకున్నాను?' అని ప్రశ్నించుకోవాలి. తర్వాత నూతన వ్యూహంతో మళ్లీ ప్రయత్నించాలి. సాధారణంగా, సహజంగా లేదా తేలికగా వచ్చేవి విలువైనవి కావనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. అలా అనుకొనే, నిజమైన సామర్థ్యాలను నిర్లక్ష్యం చేస్తాం. కానీ, మనకు తేలికగా కనిపించే పని ఇంకొంతమందికి చాలా కష్టంగా ఉండొచ్చు. అదే మన ప్రత్యేకత. దాన్ని నిరోధించేందుకు, మనం తేలికగా చేసే పనులను గమనించాలి. ఇతరులు ఎక్కడ బాగా ఇబ్బంది పడతారో గుర్తించాలి. అలాంటి పనులు మన ప్రత్యేక నైపుణ్యాలు, మన విలువకు బలమైన ఆధారం. ఒక ఉదయం కాస్త చెడుగా మొదలైతే, ఆ రోజు మొత్తం అలాంటి చేదు అనుభవాలే ఎదురవుతాయని ఎలా చెప్పగలం? ఉదయం జరిగిన దానికి బాధ పడుతూ మిగతా రోజంతా కూడా అదే మనసులో తలచుకుంటూ వాపోతుంటే ఎవరికి లాభం? మన భావోద్వేగాలు తాత్కాలికం.

మనలో చాలా మందికి ప్రతి ఒక్కరూ మనల్నే గమనిస్తున్నారని, ప్రతి కదలికనూ పరిశీలిస్తున్నారని అనుకుంటాం. వారి అభిప్రాయాలు ఏమిటో, ఉద్దేశాలు ఎలాంటివో కూడా చెప్పేస్తాం. తీర్పు ఇచ్చేస్తాం. కానీ వాస్తవంగా, చాలామంది వారి స్వంత జీవితాలను గురించి ఆలోచించడం, పనుల్లో మునిగిపోయి ఉంటారు. నిజానికి వారు మీ జీవితం గురించి అంతగా గమనించరు. కాబట్టి అలాంటి ఆలోచనను వీడాలి. లేకపోతే, కలవరపడతాం. ఆందోళన చెందుతాం. ఏకాగ్రత కోల్పోయి, చేసే పనుల్లో పొరపాట్లు పునరావృతమవుతాయి. భయం మరింత పెరుగుతుంది. మరిన్ని తప్పులు దొర్లుతాయి. ఈ చక్రం నుంచి బయటపడాలి. ఎంత బలమైన విషయమైనా, మన చుట్టూ ఉన్న వారు శాశ్వతంగా గుర్తు ఉంచుకుంటారనుకోవడం పొరపాటు. ఎవరికీ అంత ఓపిక, తీరిక ఉండవు. వాళ్లు త్వరగానే మరచిపోతారు... మనమే పదేపదే గుర్తు చేసుకుంటాం. వారు కూడా మనలాగే మరచిపోలేదని మధనపడుతుంటాం. అందుకే, ఇలాంటి భయాలకు, అనుమానాలకు తావివ్వకూడదు. మన కార్యదీక్ష, పని దక్షత ఇతరులకు చూపించడానికి కాదు, స్వీయ వ్యక్తీకరణ కోసమే అని తెలుసుకోవాలి. ఏ విషయంలోనైనా పట్టు సంపాదించినప్పుడే మనకు నిజమైన గౌరవం దక్కుతుంది. భావాలను అజ్ఞాతంగా, నిస్పృహతో వ్యక్తీకరించడం అత్యవసరం. ఇతరుల అభిప్రాయాల గురించి ఆలోచించకూడదు. విజయానికి దారులు మూసుకుపోయాయన్న భ్రమను విడిచిపెట్టాలి. నిజమైన అభివృద్ధికి అవలోకనం, దిశ, వ్యూహం అవసరం. కేవలం శ్రమ కాదు. మన ప్రయత్నాల ఫలితాలను తరచూ పరిశీలించుకోవాలి. పనులు సరైన దిశలో ముందుకు సాగడం లేదని అనిపించినప్పుడు, కేవలం శ్రమను పెంచడం కాకుండా విధానాన్ని మార్చుకోవాలి. నిశ్శబ్దాన్ని వీడాలి. మన అవసరాలను చెప్పకపోయినా, ఇతరులు అర్థం చేసుకోవాలని మనం తరచూ ఆశిస్తాం. కానీ, అది అసాధ్యం. వారు అర్థం చేసుకోకపోతే, మనకు నిరాశ లేదా బాధ కలుగుతుంది. కాబట్టి మనకు ఏం కావాలనేది స్పష్టంగా కమ్యూనికేట్ చేయాలి. ఉద్యోగంలో కావచ్చు లేదా వ్యక్తిగత జీవితంలో కావచ్చు.. అభిప్రాయాలను, అవసరాల ను నెమ్మదిగా, శాంతంగా వివరించాలి. స్పష్టత ఉండడం వల్ల ఇతరుల స్పందన తెలుస్తుంది. మనం జీవితంలో ఎన్నో మైలురాళ్లు అధిగమించిన తర్వాత లేదా ఎన్నో విజయాలు సాధించిన తర్వాతే సంతోషంగా ఉండగలుతామన్న అభిప్రాయం కూడా మనలో చాలామందికి ఉంటుంది. ఉద్యోగం, కారు, ఇల్లు, పెళ్లి, పిల్లలు, వారు స్థిరపడడం.. ఇలా ప్రతిసారీ ఎన్నో లక్ష్యాలు... కానీ సంతోషం ఏదో లక్ష్య పట్టికను చేరుకోవడం కాదు.. అది ప్రతిరోజూ సాధించాల్సిన పద్ధతి. మన జాబితాలో ప్రతిదీ సాధించినా, ఇంకా చేయాల్సినవి ఎప్పటికప్పుడు పుట్టుకొస్తునే ఉంటాయి. 'కోరికలు అనంతం.. వాటిని తీర్చగల వనరులు పరిమితం' అని ఆర్థిక శాస్త్రవేత్త రాబిన్స్ మాటలను ఇక్కడ గుర్తుచేసుకోవాలి. సాధించడం అనే మాటకు రూపం లేదు. కొంతమంది సులభంగా పూర్తయ్యే పనులకు విలువ లేదని నమ్ముతారు. అన్యోన్యమైన జీవితాన్ని కఠినంగా చేసుకుంటారు. కష్టాన్ని విలువతో సమానంగా భావిస్తారు. కానీ సరళత అనేది బలహీనత కాదు. అది బుద్ధి. దాన్ని అధిగమించాలంటే, బాధను గొప్పగా భావించడం మానుకోవాలి. భారం తగ్గించుకోవడానికి పనిముట్లు, ఆటోమేషన్, లేదా బృంద సహకారం ఉపయోగించుకోవాలి. ఇతరులతో పోల్చుకోవడాన్ని మానుకోవాలి. ఈ పోలిక గుణం మనల్ని మనం వెనుకబడినవారిగా లేదా అనర్హులుగా భావింపజేస్తుంది.

ప్రతి ఒక్కరిదీ ఒక్కో వ్యక్తిత్వం. ఒక్కో తత్వం. ఒక్కో సమర్థత. పోలికలు ఎందుకు? పోల్చుడాలు ఎందుకు? మనం చిన్న అపజయాలను అతితక్కువగా ఊహించినప్పుడు మన ఆలోచనా సరళి మారుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. సమస్యలు ఎదురైనప్పుడు తొందరపడే తత్వాన్ని మానుకుంటే మంచిది. ప్రతి సమస్యకు ఒకే పరిష్కారం అంటూ ఏదీ ఉండదు. కొన్ని సందర్భాల్లో అందరి అభిప్రాయాలను పరిశీలించడం కూడా అవసరమే. అలాగని ప్రతి చిన్న విషయానికీ సలహాలు, సంప్రదింపులు అంటూ కాలయాపన చేయడం సరికాదు. సమయాన్ని బట్టి, అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి. ఏదైనా ఒక అభిప్రాయం లేదా భావోద్వేగాన్ని వదలిపెట్టకుండా ఉండాలనిపించడం సహజం. కానీ, ప్రకృతిలో అన్నీ చలనమయమే. అస్థిరమైన జీవన విధానాల్లో స్థిరమైన చింతలు ఎందుకు? ప్రతికూల ఆలోచనలు ఎందుకు? సరైన దిశలో ఆలోచిద్దాం.. జీవితాన్ని సుఖమయం చేసుకుందాం.

## సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే పోస్టులకు చర్యలు

ప్రజాపక్షం/వీపనగండ్ల: మండల పరిధిలో పంచాయితీ ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎన్నికల కోడ్) ప్రస్తుతం పూర్తిగా అమల్లో ఉందని ఎస్సై కె.రాణి తెలిపారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా సోషల్ మీడియా వేదికల్లో అభ్యంతరకరమైన, ప్రజలను రెచ్చగొట్టే లేదా సామాజిక శాంతిని భంగం కలిగించే పోస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. సోషల్ మీడియా గ్రూపులలో ఉద్రిక్తతలను దారి తీసే విధంగా పోస్టులు పెట్టిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎస్సై కె.రాణి హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజాశాంతి, చట్టవ్యవస్థను కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజలు సోషల్ మీడియా వినియోగంలో నియమాలను పాటించాలని, అపోహలు రెకెత్తించే పోస్టులకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## వాహన తనిఖీలు..రూ. 90,000 నగదు సీజ్

ప్రజాపక్షం/ కృష్ణ : స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ లో భాగంగా నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబాల్లూరు గ్రామ శివారులో గత చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీలో 90,000 నగదును పట్టుకున్నట్లు కృష్ణ పోలీసులు తెలిపారు. కృష్ణ పోలీసులు చెక్‌పోస్ట్ వద్ద ఎస్సై ఎస్ఎమ్ నవీద్ ఆధ్వర్యంలో సోమవారం చెక్ పోస్ట్ దగ్గర వాహన తనికీలు చేపట్టారు. మక్తల్ చెందిన సోమపల్లి వెంకట్ నాయుడు రాయచూరు నుంచి మక్తల్ వైపు వెళ్తుండగా కారును ఆపి తనిఖీ చేయగా 90,000 నగదు కనిపించింది. సీజ్ చేసినట్లు ఎస్సై నవీద్ పేర్కొన్నారు.



## 'విజయ్ దివస్'కు సర్వం సిద్ధం

ప్రజాపక్షం/ మక్తల్: ఈ నెల 9న ఘనంగా " విజయ్ దివాస్" ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సంబురాలు కార్యక్రమాలు మంగళవారం నాడు ఉదయం 9:30 నిమిషాలకు మక్తల్ పట్టణంలోని డా॥ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించాలి. ఆ తర్వాత అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి కి పాలాభిషేకం కార్యక్రమం తదనంతరం. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి మన నాయకులు తెలంగాణ రాష్ట్ర మక్తల్ నియోజకవర్గ బీఆర్ శాసనసభ్యులు చిట్టెం రామ్ మోహన్ రెడ్డి పాల్గొంటున్నారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపాలిటీ మాజీ కౌన్సిల్లు, మాజీ సింగిల్విండో చైర్మన్లు, మాజీ డైరెక్టర్లు, ముఖ్య కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రసన్నం కోసం యత్నం



ప్రజాపక్షం/ధన్వాడ: ధన్వాడ మండల గ్రామపంచాయితీ సర్పంచు అభ్యర్థిగా పోటీ చేస్తున్న సి.జ్యోతి గ్రామస్తులను ఉద్దేశించి వారితో మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి ప్రస్తుతం అధికారంలో ఉన్న నాయకత్వాన్ని గెలిపిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతామని అభ్యర్థులకు తెలిపారు. వివిధ వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ తమకు కేటాయించిన కత్తెర గుర్తుకు ఓటు వేయ్యాలని అభ్యర్థులకు గుర్తులు సూచించడం జరిగింది.

## భద్రతపై అవగాహన ఉండాలి



ప్రజాపక్షం/నారాయణపేట్: నారాయణపేట్ మండలంలోని కొల్లంపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, విద్యార్థినుల భద్రతపై షీ టీమ్ పోలీసులు అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మహిళా వేధింపులు,గుహదారి భద్రతపై అవగాహన, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ క్రైమ్ నుండి ఎలా రక్షించుకోవాలి, అత్యవసర పరిస్థితుల్లో కాల్ చేసే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాలలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా వేధిస్తే బాలికలు తమ సమస్యలను ధైర్యంగా వెల్లడించి పోలీసుల సహాయం పొందడం పై సూచనలు అందించారు. విద్యార్థినులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాక, పాఠశాల పరిసరాల్లో భద్రతను కాపాడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని షీ టీమ్ పోలీసులు బాలరాజు, చేసప్ప,కవిత, జ్యోతి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్నికల పోలింగ్ సిబ్బంది ఎంపిక



ప్రజాపక్షం/ నారాయణపేట్ : గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మూడో విడత ఎన్నికల పోలింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతా లక్ష్మి సమక్షంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ కొనసాగింది. ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని 110 గ్రామ పంచాయితీల సర్పంచ్, 994 వార్డుల స్థానాలకు, 994 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, ఓ.పీ.ఓ ల ర్యాండమైజేషన్ జరిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్డీవో మొగులప్ప, డీపీఓ సుధాకర్ రెడ్డి, డీపీఆర్ఓ రషీద్ పాల్గొన్నారు.

## 54మంది ఓటు వేశారు..



ప్రజాపక్షం/వంగూర్ : మండలపరిధిలోని 27 గ్రామ పంచాయతీ గ్రామాలలో పని చేస్తున్న ఉద్యోగులు సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోస్టల్‌బ్యాలెట్ కేంద్రంలో 54 మంది ఓటువేసినట్లు ఎంపిడిఓ బ్రహ్మాచారి తెలిపారు.

## సంక్షేమఫలాలు అందేలా కృషి



ప్రజాపక్షం/కల్వకుర్తి : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా కృషిచేస్తానని ఎల్లికల్ గ్రామసర్పంచ్ అభ్యర్థి కల్లు సునందభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసర్పంచ్‌గా పోటి చేస్తున్నానని ఒక్క అవకాశం ఇవ్వాలని ఆమె ప్రజలను వేడుకున్నారు.ఇతరపార్టీలకు చెందిన అభ్యర్థులను సర్పంచులను చేస్తే గ్రామం కుంటుపడుతుందని ప్రజలు గమనించాలని ఆమె తెలిపారు. గ్రామప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజిలు, తాగునీరు, వీధిలైట్లపై ప్రత్యేక దృష్టి పెడతానని ఆమె వివరించారు. ఎల్లికల్ గ్రామాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆమె తెలిపారు.

# పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

### కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ : గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. రాజాపూర్, నవాబ్ పేట్ మండలాలలో ప్రిసైడింగ్ అధికారులకు (పి.ఓ) లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సోమవారం జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. శిక్షణలో పాల్గొన్న పిఓ లను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల దగ్గర ఎన్నికల సామగ్రి తీసుకునేటప్పుడు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు ఇతర ఎన్నికల సామాగ్రి సరిగ్గా ఉందా లేదా అని ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్ లు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా, బ్యాలెట్ పేపర్లు అన్ని సరిగ్గా ఉన్నాయా, ఏవైనా చినిగి ఉన్నాయా, సీరియల్ నంబర్లు సరిగ్గా ఉన్నాయా లేవా చూసుకోవాలని అన్నారు. పిఓలు బ్యాలెట్ పేపర్ అకౌంట్ ను సరిగ్గా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగుస్తుంది కనుక, పీఓలు వెంటనే బ్యాలెట్ బాక్స్ ను సరిగ్గా సీల్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందించాలని అన్నారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు( కౌంటింగ్) ప్రక్రియ మొదలవుతుందని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగియగానే గెలిచిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు (సర్టిఫికెట్లు) జారీ చేసి అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించాలని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు/ ఓటములకు ఒక్క ఓటు కూడా చాలా ముఖ్యంగా పరిగణిస్తారు కాబట్టి పిఓలు అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా ఎన్నికల నియమావళిని పాటిస్తూ, ఎటువంటి తప్పులు దొర్లకొండ ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రాజాపూర్ ఎం.పి.డి.ఓ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ను కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని అన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పటిష్ట బందోబస్తు

ప్రజాపక్షం/వనపర్తి: గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయితీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా ప్రతి ఒక్కరు పనిచేయాలని జోగులాంబ జోన్7 డిఐజి ఎల్ఎస్, చౌహన్ అన్నారు. మూడు విడతలుగా జరుగుతున్న గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భంగా సోమవారం వనపర్తి జిల్లా ఎస్పీ, ఏఆర్ అదనపు, ఎస్పీ, డిఎస్పీలు, సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లతో జోగులాంబ జోన్ డిఐజి కార్యాలయంలో డీఐజీ చౌహన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఐజి మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, జిల్లా సరిహద్దుతో ఉన్న నేపథ్యంలో అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టు ద్వారా అడ్డుకోవాలని తెలిపారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సమస్యత్మాక ప్రాంతాల నందు ఎక్కువ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల విధులలో సాయిద సిబ్బందిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలలో సమస్యలను సృష్టించే వారిని బైండోవర్ చేస్తూ ఉండాలి అన్నారు. ప్రజలలో నమ్మకం పెంచేందుకు మరియు ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలలో పోలీసులు పట్ల ధైర్యం నింపాలన్నారు. సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలలో పోలీసులు పట్ల నమ్మక పెంచాలని తెలిపారు.

## టెన్త్‌లో వందశాతం ఫలితాలు సాధించాలి



ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ : పదవ తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు.మహబూబ్‌నగర్‌పట్టణంలోని పోలీస్ లైన్ ఉన్న పాఠశాల, ఎదిర ఉన్నత పాఠశాల, ఏనుగొండ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు తన స్వంత నిధులతో ప్రత్యేకంగారూపొందించన క్యూఆర్ కోడ్‌డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, సొంత రాష్ట్రంలో కూడా మహబూబ్ నగర్ ను వెనక్కి నెట్టివేశారన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా ధ్వంసంచేశారనిఆయన మండిపడ్డారు. రానున్న రోజుల్లో ఇంకా అనేక విద్యా కార్యక్రమాలను చేపడతామని ఆయన తెలిపారు. డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, మాజీ మేన్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, రాషెద్ ఖాన్, మహ్మద్ మోసిన్, యాదమ్మ, నాయకులు సిహెచ్ మంజుల, వెంకటేష్ గౌడ్ , కొత్త కిరణ్, రామస్వామి, మురళి గౌడ్, చంద్రకాంత్, గోపాల్, చర్ల శ్రీనివాసులు, గ్యాస్ అంజి, ఎరుకలి నర్సింహులు, ఎల్లయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమానికి అపూర్వ స్పందన : వినీత్

ప్రజాపక్షం/నారాయణపేట : నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. మొత్తం 23 మంది ప్రజలు ఫోన్ల ద్వారా ఎస్పీ ని నేరుగా సంప్రదించి, వివిధ సమస్యలు, ఫిర్యాదులు, సలహాలు మరియు సూచనలు అందించారు. వచ్చిన కాల్స్‌లో ఎక్కువగా భూ తగాదాలకు సంబంధించినవి కాగా మరియు టౌన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ సత్యనారాయణ కమాన్ వైపు వెళ్లే రూట్లో సమయం పెంచాలని, టౌన్ లో గూడ్స్ వాహనాలు రోడ్లపై ఎక్కువ సమయం నిలిపుతున్నారని, గ్రామ పంచాయితీ ఎన్నికలలో నామినేషన్స్ విత్ డ్రా చేసుకోవాలని బయటపెడుతున్నారని పోలీసు రక్షణ కావాలని, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రూట్లో లైటింగ్ లేదు అని, ప్రాపర్టీ దొంగతనం కేసులలో రికవరీ చేయలేదని అట్టి ఫిర్యాదులను ఎస్పీ విని వాటిని చట్టప్రకారం తప్పకుండా పరిష్కరిస్తామని వెంటనే సంబంధిత అధికారులకు స్వయంగా తెలియజేసి, అట్టి సమస్యలను సంబంధిత అధికారులు దర్యాప్తు చేస్తూ వాటిని పరిష్కరిస్తూ ఎస్పీ కార్యాలయానికి రిపోర్టు పంపాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే, కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీస్ వ్యవస్థకు మరింత చేరువ అవ్వడానికి అవకాశం కలుగుతోందని, ప్రజల నమ్మకం పెరుగుతోందని ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలు ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించవచ్చని, పారదర్శకంగా పని చేయడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ల జారీ, వినియోగంపై శిక్షణ

ప్రజాపక్షం/నారాయణపేట్: నారాయణపేట్ జిల్లాలో మూడో విడత ఎన్నికలు జరిగే మక్తల్, ఉట్కూర్, నర్వ, మాగనూరు, కృష్ణా మండలాలలోని గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవ ఎన్నికల ఫలితాలు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ జారీ, వినియెగం పై సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, స్టేజ్1 స్టేజ్2 రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓఎస్) జోనల్ అధికారులతో శిక్షణ నిర్వహించారు. శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. శిక్షణ సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న పొరపాటు కూడా సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున, నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవ ఎన్నికల ఫలితాల వెల్లడి, బ్యాలెట్ పేపర్ల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్ ల జారీ, వినియోగం అత్యంత శ్రద్ధతో పారదర్శకంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. మూడో విడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను మంగళవారం మధ్యాహ్నం 3 గంటల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే సింగిల్ నామినేషన్ దాఖలైన వార్డుల, గ్రామ పంచాయతీల ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎన్ వో సీ ఇచ్చిన తర్వాత ప్రకటించాలని. ఉపసంహరణ తర్వాత కూడా ఒకే సర్పంచి అభ్యర్థి బరిలో ఉంటే నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థులు అంగ, ధన బలం ప్రలోభాలు తమపై లేవని ఆయా అభ్యర్థులలో డిక్లరేషన్ తీసుకుని ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి ఏకగ్రీవం చేయాలని సూచించారు.

# పోలింగ్‌లో ఎన్నికల సిబ్బందే కీలకం

### కలెక్టర్ బదావత్‌సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా, నిబద్ధతతో నిర్వహించడం ప్రతి ఎన్నికల సిబ్బంది బాధ్యత అని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ స్పష్టంచేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఉయ్యాలవాడ సుఖజీవన్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన ఎన్నికల నిర్వహణ శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, అక్కడి ఏర్పాట్లు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడిన జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఎన్నికల నిర్వహణలో తప్పిదాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ఎన్నికలరోజు పోలింగ్‌కేంద్రాల ఏర్పాట్లు, విధుల్లో నిష్పక్షికత, బ్యాలెట్‌బాక్సుల నిర్వహణ, బ్యాలెట్ ఓటింగ్ పద్దతులు, రూల్స్‌అండ్ రెగ్యులైజేషన్స్‌ను పూర్తిస్థాయిలో అర్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యపండుగ, ఎలాంటి అంతరాయం లేకుండా ఎన్నికలు విజయవంతంగా మనందరి బాధ్యత అన్నారు. పోలింగ్ సిబ్బంది తమపాత్ర ఎంత ముఖ్యమో గ్రహించి, శిక్షణలో నేర్చుకున్న ప్రతిదాన్ని ప్రాక్టికల్‌గా అమలుచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో చిన్న తప్పిదం కూడాపెద్ద సమస్యలకు దారితీసే ప్రమాదం ఉనందున ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి ముందుకు సాగాలని సూచించారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో అనుమతి ఇచ్చిన ఏజెంట్లను మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించేలా చర్యలు తీసుకోవాలని, ఉదయం 7గంటలనుండి మధ్యా హ్నం ఒంటిగంటవరకు ఎన్నికలను సజావుగా ని ర్వహించి మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టి ఎన్నికలు విజయం సాధించిన వార్డు సభ్యుల సమక్షంలో ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించి ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియనుకూడా అదేరోజు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అనివార్య కారణాలవల్ల గెలిచిన అభ్యర్థులు అందుబాటులో లేకుంటే మరుసటిరోజు సర్పంచ్ ఎన్నికను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. తాడూరు మండలంలోని ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమం

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : కాంగ్రెస్‌ప్రభుత్వం అంటేనే సంక్షేమమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కల్వకుర్తి మండలపరిధిలోని గుండూరు, ముకురాల ఎన్నికల గ్రామాలలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ మాట ఇస్తే మడమతిప్పనిపార్టీ అని ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలుచేస్తూ మాట నిలబెట్టుకుంటుందన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణానికి ప్రభుత్వం నెలకు రూ. వెయ్యికోట్ల రూపాయలు ఆర్‌టిసికి చెల్లిస్తుందన్నారు. 200యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తూ పేదప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. పది సంవత్సరాల్లోలేని రేషన్‌కార్డులు కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమపథకం ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో సిసిరోడ్లు, డ్రైనేజిలు, తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టిపెట్టడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా సంక్షేమం, అభివృద్ధి తెలంగాణలో జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇతర పార్టీల సర్పంచ్ అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి కుంటుపడుతుందని ప్రజలకు సూచించారు.

## కరాటేలో విజేతలకు బహుమతులు





ప్రజాపక్షం/పెబ్బేరు: పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన చిన్నారులు ఆదివారం కర్నూలు జిల్లాలో నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో పెబ్బేరుకు చెందిన సుమన్ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో బాలికల స్పారింగ్ విభాగంలో తస్విన్, ధనుష్, జగదీష్, జటిన్, చరణ్ గెలుపొందారు. వెపన్స్ విభాగంలో జోషిక గెలుపొంది సీల్డ్‌ను అందుకున్నారని కరాటే మాస్టర్ శ్రీనివాసులు, ఇన్స్ట్రక్టర్ భీష్మనాథ్ తెలిపారు.

## నేడు అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

ప్రజాపక్షం/వీపనగండ్ల: మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో నామినేషన్ ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. మంగళవారం సర్పంచు, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ గడువు పూర్తయ్యే వెంటనే, మధ్యాహ్నం మూడు గంటల తరువాత అధికారికంగా ఎన్నికల గుర్తుల కేటాయింపు జరగనున్నట్లు మండల అభివృద్ధి అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ప్రకటించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా మండల కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ ఉపసంహరణ ముగిసిన వెంటనే అభ్యర్థుల తుది జాబితాను ఖరారు చేస్తాం. అనంతరం ఎన్నికల నియమాల ప్రకారం గుర్తుల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగానిర్వహిస్తామని తెలిపారు. గుర్తులకేటాయింపుతో అన్ని గ్రామాల్లో ఎన్నికల పోటీ మరింత వేగం పుంజుకోనున్నదని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించాలని,ఎన్నికలనియమావళిన ఉల్లంఘించేచర్యలు ఎవరూ చేయవద్దని హెచ్చరించారు. పోలీసుల సహకారంతో చర్యలున్నాయి.

## ఎఐ మానవ వనరుల్ని తగ్గిస్తుందన్నది అవాస్తవం

### అది ఓ సహాయకారి మాత్రమే : జర్నలిస్ట్ యు.సుధాకర్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్:ప్రస్తుతంప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తున్న, అనుసరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) మానవ వనరుల వినియోగాన్ని పూర్తిగా తొలగిస్తుందన్నది అవాస్తవమని ఎఐ నిపుణుడు, సీనియర్ జర్నలిస్టు ఉడుముల సుధాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఎఐ ఫర్ డిజిటల్ రెడినెస్ అండ్ అడ్వాన్స్‌మెంట్ (ఎడిఐఆర్ఎ), డేటాలీడ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎఐ వినియోగం కారణంగా మానవ వనరుల వినియోగం తగ్గుతుందని అవాస్తవమని, ఇది మానవాళికి ఓ సహాయకారి మా త్రమే అవుతుందని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. డేటా సెట్స్, వెబ్‌సైట్లలో ఉన్న సమాచారమే ఎఐ ద్వారా మనకు అందుతుందని, ఈ కారణంగానే సమాజంలో ఉన్న వివక్ష మొత్తం అందులో కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరికి దీన్ని నివారించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎఐ వినియోగం నేపథ్యంలో మిస్ ఇన్ఫర్మేషన్, డిస్ ఇన్ఫర్మేషన్లను అధిగమించాల్సి ఉంటుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఏ స్థాయిలో అభివృద్ధి చెందినా ఒరిజినల్ థింకర్స్, ఒరిజినల్ రైటర్స్‌కు ఎలాంటి ఇబ్బంది రాదని స్పష్టం చేశారు. మానవాళికి సవాల్ విసురుతున్న డీప్ ఫేక్‌ను కనిపెట్టడానికి అనేక వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి జర్నలిస్టూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉంది. ఇందులో ఏఐ వినియోగం కీలక పాత్ర పోషిస్తుంది. ఆ ఉద్దేశంతోనే పాత్రికేయుల్లో ఎఐ వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికే ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేశాం' అని పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 80 మంది జర్నలిస్టులు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ జనరల్ సెక్రటరీ వరికుప్పల రమేష్, కోశాధికారి రమేష్ వైట్లలతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు హాజరయ్యారు.

## రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలన..

# నిస్సారం, నిష్ఫలం, నిరర్ధకం

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనను నిర్వచించాలంటే, నిస్సారం, నిష్ఫలం, నిరర్ధకమని బిఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్ రావు విమర్శించారు. ఇది ప్రజా పాలన కాదు, ప్రజా వంచక పాలన, రేవంత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పాలన సాగుతుందని తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిరోజు ప్రజాదర్బార్‌లో ప్రజలను కలుస్తా అన్నారని, ఆ గొప్పలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి బిల్డప్ బాబాయ్ అంటూ వ్యాఖ్యనించారు. జల్సాలకు, విందులకు పెళ్లిళ్లకు, సిఎల్‌పి సమావేశాలకు ప్రజా భవన్‌ను వాడుతున్నారని ఆరోపించారు. రేవంత్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని విమర్శించారు.రెండేళ్ల పాలనలో ఆదాయం ఎందుకు తగ్గిందో చూసుకోవాలన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన ప్రజలకు మొండి చేయి చూపించిందని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం విజన్, విధానం ఏంటో ఎవరికి ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. విజయోత్సవాలు కాదు, అప జయోత్సవాలు జరుపుకోవాలన్నారు. ఒక్క ఊరిలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదన్నారు. మొత్తం రుణమాఫీ అయ్యిందంటే తాను రాజీనామాకు సిద్ధమని, మీరు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు.

## తైక్వాండోతో మంచి ఆరోగ్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చిన్న వయస్సు నుంచే విద్యార్థులు తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం వల్ల శారీరక మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఉన్న విన్నర్స్ వరల్డ్ తైక్వాండో అకాడమిలో జరిగిన బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 150 మంది విద్యార్థులు కేటరిగిరిలో బెల్టులు పొందగా ఆయన అందించారు. కార్యక్రమంలో చిలుకూరు బాలకృష్ణ, ఇలి



యాస్‌ఖాన్, విఠల్‌రాణి, అబ్దుల్ బాసిత్, రవికుమార్, కోచ్‌లు సైదులు, పవన్‌కల్యాణ్, నసీరొద్దిన్, హరీష్, ప్రదీప్ పాల్గొన్నారు.

## పోలింగ్ ఏర్పాట్లను పరిశీలన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామపంచాయతి ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికలు జరిగే తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోలింగ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామగ్రిని బూత్‌ల వారీగా సెపరేట్‌గా చేసి సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. ఓటర్ల జాబితా వివరాలు సరిగా ఉన్నాయా లేదా చెక్ చేసుకోవాలని, బ్యాలెట్ పత్రాలు కూడా జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలి తెలిపారు.



స్వస్తిక్ గుర్తు సరిగా ఉందా లేదా చెక్ చేసుకోవాలని, బ్యాలెట్ బాక్స్‌లు ఓపెన్ అవుతున్నాయా లేదా చెక్ చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు.



## ధనిక రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల రాష్ట్రంగా మార్చారు

ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** గ్రామ పంచాయితీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆత్మకూరు మండలంలోని పల్లెర్ల, లింగరాజుపల్లి, రాఘవాపురం, పుల్లయిగూడెం, కూరెళ్ళ, తుక్కాపురం, రహీంఖాన్ పేట, కప్రాయపల్లి, మోదుగుబాయిగూడెం, టి.రేపాక, పోతిరెడ్డిపల్లి, పల్లెపహాడ్, కొరటికల్, మురిపిరాల, ఆత్మకూరు గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలనలో కెసిఆర్ ప్రభుత్వం వందల కోట్ల ఆస్తులు దోచుకొని ధనిక రాష్ట్రాన్ని దివాలా రాష్ట్రంగా మార్చారని, అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు యాస లక్ష్మారెడ్డి, ముద్దసాని సిద్ధులు గౌడ్, మాజీ జెడ్పిటిసి నరేందర్ గుప్తా, పిఏసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, నోముల వెంకన్న, తండ నరసింహ, ఓబిసి మండల అధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్య గౌడ్, పోతగాని మల్లేష్ గౌడ్, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కళ్ళల్లో సరికొత్త వెలుగులు

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కళ్ళల్లో సరికొత్త వెలుగులు చూస్తున్నామని ప్రతి గ్రామంలో పండగ వాతావరణం కనబడుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. మరికొన్ని రోజుల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సోమవారం ఆయన పోచంపల్లి మండలంలోని జలాల్పురం శాపాక శంకర్, మెహర్ నగర్(ఆకుల శ్రీలత మధుసూదన్) భీమనపల్లి( కంటే భవానీ లింగస్వామి), కనుముక్కల (చుక్క శోభ శంకరయ్య), జిబ్లక్ పల్లి (ఆర్ల సుజాత ఐలయ్య యాదవ్), దంతూరు, వంతమామిడి(మచ్చ శ్రీనివాస్) ధర్మారెడ్డిపల్లి (సుర్వీ వెంకటేష్ గౌడ్), గౌస్కొండ, కప్రాయిపల్లి, ఇంద్రియాల, రామలింగంపల్లి (మండల నరసింహ), జూలూరు (కాసుల అంజయ్య) గ్రామాలలో ప్రచారం నిర్వహించి ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, వార్డు మెంబర్లను ఆశీర్వదించి అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి అన్ని రంగాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని ఓటర్లను అభ్యర్థించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అనిరెడ్డి జగన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి పాక మంజుల పాల్గొన్నారు.

## అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/నూతనకల్ :** గ్రామ పంచాయితీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎలాంటి అలజడులు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని వెంకేపల్లి గ్రామంలో గ్రామపంచాయితీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో ముందస్తుగా ఎలాంటి గొడవలు జరగకుండా ఉండాలని కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఎలాంటి అల్లర్లు సృష్టించినా, ఎన్నికల నియమాలని ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని అన్నారు. తుంగతుర్తి సిఐ నరసింహారావు, ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రైతులకు బయోపోర్టిఫైడ్ వరి విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పోషకాహార ఉత్పత్తులపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ కోరారు. మండల పరిధిలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ ఆహర భద్రత పోషకాహర మిషన్ ఆధ్వర్యంలో సోమవారం సామూహిక ప్రదర్శన క్షేత్రాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా ఆహార ఉత్పత్తుల్లో నాణ్యత పెరిగే దిశగా రైతాంగం వ్యవసాయం సాగు చేపట్టాలని కోరారు. పోషకాహార ఉత్పత్తులను సాగు చేసే విధంగా పలు రకాల విత్తనాలను శాస్త్రవేత్తలు కనుగొని రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే డిఆర్ఆర్48 సన్నగింజ రకాన్ని రైతులు సాగు చేసేందుకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ రకపు వరి విత్తనం135 రోజుల నుండి 140 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు. ఈ రకాన్ని రాజేంద్రనగర్‌లోని భారత వరి పరిశోధన సంస్థ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన వరి విత్తనాన్ని డిఆర్ఆర్ ద్వారా బయోపోర్టిఫైడ్ వరి విత్తనం అని అన్నారు. ఈ రకపు విత్తనం ఎండకు, తెగులును తట్టుకునే జన్యువులు కలిగి ఉండటం ద్వారా రైతులకు నాణ్యమైన పంటతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం రై తులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు నరేష్, ఆదర్శ్, ఎన్.సు గం ది, వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి ఎన్నికలు అత్యంత కీలకం

గ్రామపంచాయతీ ఎన్నికలను సమన్వయంతో పనిచేయాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ (శాలిగౌరారం):** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎటువంటి లోపాలు కనిపించిన వెంటనే సరిదిద్దుకొని పని చేయాలనీ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ఆమె శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రిని ,పోస్టల్ బ్యాలెట్ పత్రాలను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లపై అధికారులతో వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామస్థాయి ఎన్నికలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటాయని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు క్రమబద్ధంగా పద్ధతుల్లో ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామాగ్రి పంపిణీ ఆలస్యం లేకుండా నిర్వహించాలని, పోలింగ్ మెటీరియల్ పంపిణీ , స్వీకరించే ప్రక్రియలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. రిసీవింగ్ కేంద్రాలలో బ్యాలెట్ బాక్సులు స్వీకరణ సమయంలో ఏవైనా గందరగోళాలు ఏర్పడకుండా పటిష్ట నియంత్రణ చర్యలు తప్పనిసరి అని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిరంతరం ఉండాలని,ప్రవేశ, నిష్కరణ ద్వారాల వద్ద క్యూలైన్ వ్యవస్థను అమలు చేయాలని, సీసీ కెమెరాలు ద్వారా కార్యకలాపాలు నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించకుండా ప్రతి అధికారి తన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. సమన్వయం, శీఘ్ర స్పందన, పారదర్శకత ఇవే ఎన్నికలకు విజయవంతమైన మూలాధారాలని స్ప ష్టంగా తెలిపారు. అదేవిధంగా తాగునీరు, విశ్రాంతి గదులు, పారిశుద్ధ్య వసతులు ,వైద్య సౌకర్యాలు ర్యాంపులు, లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జడ్‌పిసీఈఓ శ్రీనివాస రావు,జిల్లా పంచాయతీ రాజ్ అధికారి వెంకటయ్య, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, శాలిగౌరారం తహసీల్దార్ వరప్రసాద్,ఎంపీడీవో జ్యోతిలక్ష్మి కలెక్టర్ వెంట ఉన్నారు.

# నిబంధనలకు లోబడి ప్రచారం నిర్వహణ

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** అభ్యర్థులు నిబంధనలకు లోబడి ప్రచారం నిర్వహించుకోవాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. సోమవారం రెండవ విడతలో గ్రామ పంచాయితీ ఎన్నికలు జరగనున్న పెన్‌పహాడ్ మండల పరిధి గ్రామ పంచాయితీ ఎన్నికల గ్రామాలలో సర్పంచ్, వార్డు అభ్యర్థులుగా కరారైన అభ్యర్థులకు మండల కేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల నియమావళి పట్ల, వ్యయం, ప్రచారం, సమయపాలన అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి హాజరై మాట్లాడుతూ అభ్యర్థులు పరిమితికి మించి ఖర్చులు పెట్టవద్దని, ప్రతి దానిని ఎన్నికల పరిశీలకులు గమనిస్తూ ఉంటారని చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయవద్దని మద్యం, డబ్బు, ఉచితాలు, బహుమతులు లాంటి వాటిపై పోలీస్ నిఘా ఉందన్నారు. ఎన్నికలను నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికల బరిలో అంతా సొంత ఊరు వారే ఉంటారు కాబట్టి వ్యక్తిగత విమర్శలు చేసుకోవద్దని ప్రచార సమయంలో ఒకరికొకరు ఎదురుపడే సమయంలో గొడవలు పెట్టుకోని భవిష్యత్తులో సమస్యలు తెచ్చుకోవద్దని సూచించారు. ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంట్లుగా పనిచేసేవారు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించకుండా ఉండాలన్నారు. సమస్యలు సృష్టించే వారిని ముందస్తుగా బైండోవర్ చేశామని బైండోవర్ అనేది కేసు కాదు అది వ్యక్తిగత సత్ప్రవర్తన కోసం స్వతహాగా ఇచ్చే హామీ పత్రం, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించే వారిని రూ.5లక్షల వరకు జప్తు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తూ సమస్యలు సృష్టిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేసి రౌడీషీట్స్ నమోదు చేస్తామని, పిడి యాక్ట్ సైతం పెట్టి జైలుకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పెన్‌పహాడ్ తహశీల్దార్ లాలూ నాయక్, ఎంపిడిఓ జానయ్య, ఎస్ఐ గోపికృష్ణ, మండలాధికారులు, ఎన్నికల విధుల సిబ్బంది ఉన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌ల తనిఖీ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లను సోమవారం తనిఖీ చేశారు. వైద్య, దయాగ్నస్టిక్ సేవలకు సంబంధించిన చార్జీల పట్టికలో పొందుపర్చిన విధముగా వసూలు చేస్తున్నారా లేదా అని చికిత్స నిమిత్తం వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. దాంతోపాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి డిఎంహెచ్ఓ జి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక బృందాల ద్వారా నిరంతరం ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లను తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. నిబంధనలు పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో డిప్యూటి డిఇఎంఓ సంజీవరెడ్డి, కళ్యాణ్ సిబ్బంది ఉన్నారు.



## గ్రామాలను అభివృద్ధి చేసే వ్యక్తులను గెలిపించాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మునుగోడు:** గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తులను గెలిపించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మండలంలోని సింగారం చోల్లేడు గ్రామాలలో పోటీ చేస్తున్న సింగారం గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఉప్పునూతల సుజాత రమేష్, చోల్లేడు గ్రామ సర్పంచ్ అభ్యర్థి కదిరే లింగయ్యలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నీతి నిజాయితీలతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న ఆశయంతో ఉన్న వ్యక్తులను గెలిపించుకోవాలన్నారు. పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తులకు ఓటు అనే ఆయుధం ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనం వెంకన్న, బైరాగొండ్ల వెంకన్న, ఉడుగుండ్ల కృష్ణయ్య ఉడుగుండ్ల వెంకన్న,వనం యా దయ్య, చిలుమల నర్సింహా, చిలుముల యాదయ్య,పగిళ్ళ రమేష్ పాల్గొన్నారు.



## గాంధీ, నెహ్రూలపై దుష్ప్రచారానికే వందేమాతరం చర్చ!

కాలుష్యం, నిరుద్యోగంపై చర్చించకుండా రాజకీయ క్రీడ

ఎంపి చామల ఆవేదన



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** జాతిపిత మహాత్మా గాంధీ, దేశ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వంటి మహానాయకులపై చెడు ప్రచారం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం పార్లమెంట్లో వందేమాతరం జాతీయ గీతంపై చర్చకు తెరలేపిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. సోమవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో ఈ అంశంపై మాట్లాడారు. దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యం, నిరుద్యోగం వంటి కీలక అంశాలపై పార్లమెంట్లో చర్చ నిర్వహించకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని వాడుకోవాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటిసారిగా కాంగ్రెస్ సమావేశంలో ఈ గీతాన్ని ఆలపించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించే ఏఐసీసీ, పీసీసీ, డిసిసి సమావేశాల్లో నేటికీ వందేమాతరం పాడటం పద్ధతిగా ఉందని పేర్కొన్నారు. అయితే, ఆర్ఎస్ఎస్, బీజేపీ సమావేశాల్లో ఈ గీతాన్ని పాడే పరిస్థితి లేకపోయినా, ఇప్పుడు ఒక్కసారిగా ఈ అంశాన్ని ముందుకు తెచ్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఈ చర్చలో పాల్గొని ప్రజలకు నిజాలను చెప్పడానికి సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ సోషల్ మీడియాప్రత్యేకించి 'వాట్సాప్ యూనివర్సిటీ' ద్వారా కాంగ్రెస్ పార్టీపై విషప్రచారం చేస్తోందని, చరిత్రను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కేవలం 15 రోజులపాటే జరుగుతున్న నేపథ్యంలో, దేశం ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలు, ప్రస్తుతం దేశంలో ఇండిగో విమానయాన సంస్థ కారణంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చ లేకుండానే మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు, రాజకీయ దాడులపైనే దృష్టి పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం బీజేపీ చేస్తోందని ఆరోపించారు.

## రాజేష్ మృతికి కారకులైన పోలీసులపై కేసు నమోదు చేయాలి

ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ గాంధీనగర్‌కు చెందినకర్ల రాజేష్ పోలీసుల చిత్ర హింసలతో మృతి చెందిదాని తల్లి ఫిర్యాదు చేసిన మృతికి కారకులైన పోలీసులపై ఎందుకు కేసు నమోదు చేయాల లేదని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు ఉన్నాతాధికారులను ప్రశ్నించారు. సోమవారం కోదాడ పట్టణ వర్తక సంఘంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏలాంటి విషయమై ప్రజలు ఫిర్యాదు చేసిన విచారించి కేసులు నమోదు చేయాలని కోర్టులు ఆదేశిస్తున్న కోదాడ పోలీసులు పట్టించుకోక పోవడంతో వారికి చట్టం లేలియన్నట్లుందని, మృతుని తల్లి ఇద్దరు డిఎస్‌పిలకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడానికి కారణం చిలుకూరు ఎస్సై రెడ్డి కావడంమేనా, చెట్టంత కోడుకును పోగొట్టుకుని విలపిస్తున్న ఆ బాధిత కుటుంబాకి స్థానిక ఎమ్మెల్యే ఆదరణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం కోసం జరిగే పోరాటంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ లతో పాటు సిపిఐ(ఎం), సిపిఐ పార్టీలను నాయకులను కలసి మద్దతు కోరతామన్నారు. ఈ సమావేశంలో బచ్చలకూరి వెంకటేశ్వర్లు, ఏపూరి రాజు, నాయకులు కొండపల్లి ఆంజనేయులు, కోటేష్ సత్యరాజ్, కనకయ్య, నాగరాజు, శ్రీను,సూరి నాగయ్య, నవీన్, సాయి, మేదర లలిత, చీమా శ్రీనివాస్, సుందర్‌బాబు, నర్సయ్య పాల్గొన్నారు.

## జీవన్ బీమా చెక్కు అందజేత

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని సర్వారం గ్రామానికి చెందిన బీమపంగు శాంత, గుండాల సైదులు ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. సోమవారం బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయల నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ జనార్ధన్ మాట్లాడుతూ గతంలో గరిడేపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు నందు 436 రూపాయలతో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పాలసీ తీసుకున్నారు. దీంతో చనిపోయిన బాధితుల కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్ బీమా నుండి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున 4 లక్షల బీమా సంస్థ మంజూరు చేసిందని, బాధితులకు చెక్కులను అందజేశారు. ఫీల్డ్ ఆఫీసర్ ఎల్ ఆనంద్, రామాంజీనేయులు, బ్యాంకు సిబ్బందితో పాటు హుజూర్‌నగర్ ఎఫ్ఎల్ కౌన్సిలర్ బి.గోపి, శ్రావణ్‌కుమార్, రాంబాబు పాల్గొన్నారు.

# నకిలీ బంగారం అమ్ముతున్న ముఠా అరెస్ట్

రూ.12లక్షల నగదుతోపాటు ఐదు నకిలీ బంగారు బిస్కెట్లు స్వాధీనం

జిల్లా ఎస్‌పి కె. నరసింహ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అమాయకులను బుట్టలో వేసుకొని అతి తక్కువ ధరకు బంగారం అమ్ముతామంటూ మోసం చేస్తున్న నలుగురు ముఠా సభ్యులను సూర్యాపేట రూరల్ పోలీసులు అరెస్టు చేసి రూ.12లక్షల నగదుతో పాటు ఐదు నకిలీ బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా ఎస్‌పి కె నరసింహ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 6వ తేదీన హనుమకొండకు చెందిన సూర్యనేని వెంకటేశ్వరరావు సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నకిలీ బంగారంకు సంబంధించి మోసపోయినట్లు మొదటి నింధితుడు నాగేశ్వరరావు, నాలుగోవ నింధితుడు నరేష్, ఏడవ నింధితుడు ఆదినారాయణ, మూడవ నింధితుడు శ్రీనివాసరావు మరి కొంతమంది కలిసి నకిలీ బంగారం అంటగట్టి రూ.12 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ధర్యాప్తులో భాగంగా సోమవారం సూర్యాపేట రూరల్ పోలీసులు బాలెంల గ్రామ శివారు ఖమ్మం జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా కొంతమంది వ్యక్తులు కారులో, చుట్టుపక్కల ప్రాంతంలో అనుమానాస్పదంగా కనబడగా పోలీసులు గుర్తించి వారిని పట్టుకునే సమయంలో కారులో ఉన్న వ్యక్తులు పారిపోయారు. అక్కడ ఉన్న నలుగురు వ్యక్తులను పట్టుబడి చేయడం జరిగిందన్నారు. వీరిని విచారించగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఇర్రి నరేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా, పల్నాడు జిల్లాకు చెందిన మేడి ఆదినారాయణ, యోగిరెడ్డి, పిట్ట నాగిరెడ్డిగా తెలపడం జరిగిందన్నారు. గత నెల 25వ తేదిన ఇర్రి నరేష్‌కు సుధాకర్ అనే వ్యక్తి ఫోన్ చేసి తనకు తెలిసిన నాగేశ్వరరావు అనే వ్యక్తి ఫోన్ చేసి తనకు తెలిసిన నాగేశ్వరరావు అనే వ్యక్తి వద్ద బంగారం ఉంది అట్టి బంగారం తక్కువ ధరకు అమ్ముతాడు ఆ బంగారాన్ని మనం రూ.90వేలకు అమ్మిపెడితే కమీషన్ ఇస్తాడని చెప్పగా ఒప్పుకొని బంగారం చూడాలని నరేష్ తెలుపగా 27వ తేదీన సూర్యాపేట పట్టణంలోని హైటెక్ బస్టాండ్ వద్ద ఇర్రి నరేష్, సుధాకర్‌లు కలవడం జరిగిందన్నారు. సుధాకర్ వెంట మరికొంతమంది శ్రీనివాసరావు, చంద్ర ఆదినారాయణ వచ్చారు. వీరు అందరూ కలిసి బాలెంల గ్రామ శివారులో అరుణ టిఫిన్ సెంటర్ వెనుక ఇంట్లో నివాసం ఉంటున్న నాగేశ్వరరావు అలియాస్ రాజారాం అనే మొదటి నింధితుడి ఇంటికి వెళ్ళారు. అప్పుడు ఇంట్లో నాగేశ్వరరావు అతని తమ్ముడు బాల ఇద్దరు ఉన్నారు. వారి వద్ద ఉన్న నకిలీ బంగారం బిళ్ళలు చూయించి ఇవి ఒక్కొక్కటి 20 గ్రాములు ఉన్నాయని వీటిని అమ్మిపెడితే 10శాతం కమీషన్ ఇస్తామని నరేష్‌కు తెలిపారు. సులభంగా డబ్బులు వస్తాయని ఉద్దేశంతో నరేష్ బంగారం అమ్మటకు ఒప్పుకుని కన్నయ్య అనే ఆటో డ్రైవర్‌ను వారికి పరిచయం చేసి బంగారం తక్కువ ధరకు ఉందని దానికి బిల్లులు ఉండవని తెలిపారు. నరేష్‌కు ఇది నకిలీ బంగారం అని తెలిసినప్పటికి కన్నయ్యకు అసలు బంగారం అని తెలిపి రూ.90వేలకు అమ్మితే మనకు 10శాతం కమీషన్ వస్తుందని తెలిపాడు. కన్నయ్య అనే ఆటో డ్రైవర్ తన ఆటోలో ప్రయాణిస్తున్న హనుమకొండకు చెందిన వెంకటేశ్వరరావు, లీలా అనే వారికి తక్కువ ధరకు అనగా తులం రూ.90వేలకు వస్తుందని చెప్పగా నమ్మిన వెంకటేశ్వరరావు బంగారం తీసుకోవడానికి ఒప్పుకున్నాడన్నారు. ఈనెల 6వ తేదీన మూడు గంటల సమయంలో వెంకటేశ్వరరావు, లీలాను తీసుకొని సువెన్ హోటల్ వద్దకు రాగా అక్కడ ఉన్న సుధాకర్, ఆదినారాయణ, శ్రీనివాసరావు, యోగారెడ్డి, నాగిరెడ్డి, చంద్రలు వెంకటేశ్వరరావు వద్ద ఉన్న రూ.5లక్షలు, మామిడి లీల వద్ద ఉన్న రూ.7లక్షలు మొత్తం రూ.12లక్షలు చూసి వారిని బాలెంల గ్రామంలో గల నాగేశ్వరరావు ఇంటికి తీసుకెళ్ళడం జరిగింది. 10 బంగారు బిళ్ళలు కొనడానికి అంగీకరించి వారి వద్ద ఉన్న డబ్బు రూ.12లక్షలు తీసుకొని వారికి ఐదు బిళ్ళలు ఇవ్వడం జరిగింది. మిగతా డబ్బు చెల్లించిన తర్వాత ఐదు బిళ్ళలు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసు వారు తనిఖీలు నిర్వహిస్తారు దొరికిపోతామనే ఉద్దేశంతో డబ్బును ఇర్రి నరేష్ వద్ద ఉంచాలని నాగేశ్వరరావు చెప్పాడు. 8వ తేదీన నాగేశ్వరరావు నరేష్‌కు ఫోన్ చేసి డబ్బులు తీసుకొని బాలెంల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు రమ్మని చెప్పడం జరిగింది. వెంకటేశ్వరరావు వాళ్లు మిగిలిన డబ్బు తీసుకువస్తే మిగిలిన 5 బిళ్ళలు ఇస్తాము డబ్బు తీసుకొని రమ్మని చెప్పగా నరేష్ కన్నయ్యకు అదే విషయం చెప్పగా కన్నయ్య, వెంకటేశ్వరరావు, రవి కారులో బాలెంలపై ఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చినారు. దీనిపై సమాచారం తెలుసుకున్న పోలీస్ వారు వారిని పట్టుబడి చేయడం జరిగిందని తెలిపారు. నకిలీ బంగారం కేసు చేధించిన కేసులో బాగా పనిచేసిన రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్, హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్, కానిస్టేబుల్స్ చైతన్య, ఉమామహేశ్వర్, హోమ్ గార్డు సాయిశంకర్‌లను అభినందించారు.

# క్రీడ

## తొలి మ్యాచ్‌లోనే సెంచరీ..

**టీ20ల్లో చరిత్ర లిఖించిన యంగ్‌స్టర్..!**



సంచలనాలకు నెలవైన పొట్టి క్రికెట్‌లో మరో రికార్డు బద్ధలైంది. టీ20ల్లో అరంగేట్రంలోనే బరోడా క్రికెటర్ అమిత్ పస్సీ రికార్డు సెంచరీ బాదేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లోనే అత్యధిక స్కోర్‌తో చరిత్ర సృష్టించాడీ యువకెరటం. సోమవారం సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో చెలరేగి ఆడిన అమిత్.. 44 బంతుల్లోనే సెంచరీతో రఫ్ఫాడించాడు. ఈ టోర్నీలో ఆడిన మొట్టమొదటి మ్యాచ్‌లోనే శతకం సాధించిన మూడో ఆటగాడిగా మరో రికార్డు నెలకొల్పాడీ బరోడా కుర్రాడు. దేశవాళీ టోర్నీల్లో ఒకటైన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఈ ఏడాది రికార్డుల మోత మోగుతోంది. ఆకలిమీదున్న సింహాల్లా కుర్రాళ్లు సెంచరీలతో చెలరేగిపోతున్నారు. యువకెరటం వైభవ్ సూర్యవంశీ సెంచరీతో మెరవగా.. ఇప్పుడు బరోడా క్రికెటర్ అమిత్ పస్సీ రికార్డు శతకంతో చరిత్రకెక్కాడు. స్మాట్ అరంగేట్రం మ్యాచ్‌లోనే వంద కొట్టిన మూడో బ్యాటర్‌గా నిలిచాడు అమిత్. అతడి కంటే ముందు పంజాబ్ ఆటగాడు శివం బాంబ్రీ, హైదరాబాదీ బ్యాటర్ అక్షత్ రెడ్డిలు మూడంకెల స్కోర్ బాదారు. అక్షత్ 2010లో ముంబైపై 105 రన్స్ చేయగా.. 2019లో హిమాచల్ ప్రదేశ్‌పై 106 పరుగులతో అదరగొట్టాడు. సర్వీసెస్ బౌలర్లకు చుక్కలు చూపించిన అమిత్ 44 బంతుల్లోనే శతకం సాధించాడు. క్రీజులోకి రావడమే ఆలస్యం బౌండరీలతో విరుచుకుపడిన ఈ యంగ్‌స్టర్ 24 బంతుల్లో అర్ధ శతకం కొట్టాడు. ఆ తర్వాతి 20 బంతుల్లోనే సెంచరీ నమోదు చేశాడీ హిట్టర్. అంతేకాదు టీ20ల్లో అరంగేట్రం మ్యాచ్‌లో అత్యధిక స్కోర్ బాదిన పాకిస్థాన్ ఆటగాడు బిలాల్ అసిఫ్ రికార్డు సమం చేశాడు అమిత్. ఈ చిచ్చరపిడుగు విజృంభణతో బరోడా 5 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది.

## ఫిడే సర్క్యూట్‌లో విజయం..

### కాండిడేట్స్ బరిలో ప్రజ్ఞానంద..!

భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద ఫిడే సర్క్యూట్ 2025 టోర్నీలో విజేతగా నిలిచాడు. లండన్ చెస్ క్లాసిక్ ఓపెన్‌లో ఆఖరి నిమిషంలో అడుగుపెట్టిన టీమిండియా స్టార్ సంచలన విజయాలు నమోదు చేశాడు. వచ్చే ఏడాది జరుగబోయే ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించాడు. ఫిడే ర్యాపిడ్ ఫిడే బ్లిట్జ్ రౌండ్ ఫలితాలతో సంబంధం లేకుండా కాండిడేట్స్ బెర్త్ సాధించాడు ప్రజ్ఞానంద. ఫిడే సర్క్యూట్ 2025లో ప్రజ్ఞానంద సూపర్ ఫామ్ కొనసాగించాడు.



హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్లిన భారత స్టార్ మనదేశం నుంచి క్యాండిడేట్స్‌కు ఎంపికైన నాలుగో ప్లేయర్. అతడికంటే ముందు కోనేరు హంపి, దివ్యా దేశ్‌ముఖ్, ప్రజ్ఞానంద సోదరి ఆర్ వైశాలి ఈ మెగా టోర్నమెంట్‌కు అర్హత సాధించారు. ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో టాప్3లో నిలవడం ద్వారా దివ్య, హంపి, వైశాలి బెర్తు దక్కించుకున్నారు. ఇతర దేశాల గ్రాండ్ మాస్టర్లు.. అనిశ్ గిరి, ఫాబియానో కరౌనా, మథియస్ బ్లూబౌమ్, జవొఖిర్ సిందరోవాలు సైతం క్యాండిడేట్స్‌కు క్వాలిఫై అయ్యారు.

## అజిలిటాస్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా కోహ్లి



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అజిలిటాస్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారాడు. ఈ విషయాన్ని ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ చేసిన వీడియోలో విరాట్ ధ్రువీకరించాడు. పూమాతో సుదీర్ఘకాలంగా ఉన్న ఒప్పందాన్ని ఈ సంవత్సరం ప్రారంభంలో కోహ్లి రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. విరాట్ 2017లో పూమాతో అగ్రిమెంట్‌ను కుదుర్చుకున్నాడు. అలాగే అతడు సొంతంగా వన్ అనే కంపెనీని కూడా ప్రారంభించాడు. ఇది స్పోర్ట్స్‌వేర్, ఫుట్‌వేర్, దుస్తులు వంటి విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. అజిలిటాస్‌ను అభిషేక్ గంగూలీ ప్రారంభించాడు. అతడు గతంలో పూమా ఇండియా, సౌత్ ఈస్ట్ ఆసియాకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేశాడు. అజిలిటాస్ కోసం పూమా ఆఫర్ చేసిన రూ.300 కోట్ల ఒప్పందాన్ని సైతం కోహ్లి కాదన్నాడని తెలుస్తోంది. ‘చూడండి, ఆ ఆఫర్ (అజిలిటాస్) వచ్చినప్పుడు.. దాని తయారీ సామర్థ్యాలు, తనకున్న నైపుణ్యం, దీనిలోకి వచ్చే వ్యక్తులు ఎలాంటివారో ఆయన (అభిషేక్ గంగూలీ) నాకు అర్థమయ్యేలా చెప్పారు. ఇది పెద్ద విషయంగా మారవచ్చని నేను అనుకున్నాను. నేను కూడా ఇందులో భాగం కావాలని కోరుకున్నాను. దీన్ని మన సొంత వ్యక్తులు రూపొందించారు’ అని విరాట్ కోహ్లి అన్నాడు. విరాట్ కోహ్లి గతంలోనే అజిలిటాస్‌లో రూ.40 కోట్ల పెట్టుబడులు పెట్టారు. నూతన ఒప్పందం ఉత్పత్తులు అజిలిటాస్ ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. విరాట్ కోహ్లి వన్డేను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చే పనిలో ఉన్నాడు.

## టీమిండియాకు జరిమానా

సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2–1తో కైవసం చేసుకుంది. మొదటి, మూడో వన్డేలో టీమిండి యా గెలిచింది. రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో మాత్రం సౌతాఫ్రికా విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో భారత్ స్లో ఓవర్ రేట్ నమోదు చేయడంతో తాజాగా ఐసిసి జరిమానా విధించింది. నిర్ణీత సమయం కంటే రెండు ఓవర్లు తక్కువగా వేయడంతో ఓవర్‌కు ఐదు శాతం చొప్పున ఫైన్ వేసింది. దీంతో భారత ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత పడనుంది. ఆన్ ఫీల్డ్ అంపైర్లు రాడ్ టక్కర్, రోహన్ పండిట్.. థర్డ్ అంపైర్ సామ్ నోగాజ్‌స్కీ, ఫోర్త్ అంపైర్ జయరామన్ మదనగోపాల్ కలిసి జరిమానా విధించాలని మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన దానికి ఆమోదం తెలిపారు. కెప్టెన్ కెఎల్ రాహుల్ తప్పును, ప్రతిపాదిత శిక్షను అంగీకరించాడు. డిసెంబరు 9 నుంచి సఫారీలతో భారత్ ఐదు టీ20 మ్యాచ్ల సిరీస్‌లో తలపడనుంది. తొలి మ్యాచ్‌కు కటక్‌లోని బారాబాతి స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. డిసెంబర్ 11న ముల్లాన్పుర్, 14న ధర్మశాల, 17న లఖ్‌నవూ, 19న అహ్మదాబాద్‌లో మిగిలిన మ్యాచ్లు జరగనున్నాయి.

# ఫోకస్

## ఇలాంటి వారితో జాగ్రత్త



చాలా మంది ఎదుటివారిని నమ్మి మోసపోవడాన్ని చూస్తునే ఉన్నాం. ఉద్యోగ ప్రదేశాల్లో వీరి సంఖ్య చాలా ఎక్కువ. ప్రైవేటు ఉద్యోగాలు లేదా గిగ్ వర్కర్లుగా పనులు చేసుకునేవారిని అవసరం తీరిన తర్వాత నిర్లక్ష్యంగా చూడడం నేటి కాలం పోకడ. ఓ రివాజు. సాయం చేస్తున్నట్టు నటిస్తూ, ద్రోహం చేయడం వీరి నైజం. ఈ కార్టూనిస్టు ఎవరోగానీ, ప్రస్తుత పరిస్థితులను, ప్రత్యేకించి మోసకారులు అవలంభిస్తున్న విధానాలను అద్భుతంగా ఆవిష్కరించాడు. ఈ చిత్రం మనిషి స్వభావంలోని అలజడి, అసలు పరిష్కారం చేయకుండా పక్కన పడేయడం, ప్రపంచాన్ని చూసే కొంతమంది వ్యాపార, రాజకీయ నాయకుల లేదా అధికారం ఉన్నవారి అహంకారం, నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. వాళ్లు సహాయం చేస్తున్నట్టుగా నటించగలరు, కానీ నిజంగా అందించాల్సిన సహాయం చేయరు. ఇలాంటి కథ మనం ప్రతిరోజూ చూస్తున్న సమాజంలో కూడా కనిపిస్తుంది. ఎవరైనా బాధలో ఉన్నప్పుడు, కొంతమంది సహాయం పేరు చెప్పి, సహాయాన్ని పూర్తి చేయకుండా, తమ స్వంత బ్రాండ్ కోసం లేదా పేరు కోసం చిన్న ప్రయత్నం చేస్తారు. నిజమైన దయ, సహాయం, మనిషిగా ఉండే కనికరం ఇవి మనిషిలో అందరికీ ఉండాలి. నిజమైన సహాయాన్ని ఇవ్వకుండా, తప్పించుకోవడం అంతే మానవ స్వభావంలో ముదురు కోణాన్ని చూపిస్తుంది. ‘నిజమైన సహాయం అంటే అవసరమైన పరికరం, మనసును కలిగి ఉండాలి. నటన వల్ల ఎవరూ కాపాడుకోలేరు’ అనే మనిషి తత్వాన్ని, లోపలి అంధకారపు కోణాన్ని ఈ కార్టూన్ ప్రతిబింబిస్తుంది.

## 16 గంటల చదువు!



ప్రపంచ దేశాలన్నిటిలోనూ విద్యకు ప్రాధాన్యతనిస్తున్నప్పటికీ, దక్షిణ కొరియాలో అత్యంత కీలకంగా భావిస్తారు. విద్యార్థులు రోజుకు సుమారు 16 గంటలు చదువుతారు. వారి రోజువారీ షెడ్యూల్ సాధారణంగా ఉదయం స్కూల్ లేదా కాలేజీకి వెళ్లడంతో ప్రారంభమవుతుంది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, వెంటనే ప్రైవేటుగా ‘హాగ్వాన్స్’ అని పిలిచే క్రామ్ అకాడెమీలకు హాజరవుతారు. అక్కడ గణితం, శాస్త్రం, ఇంగ్లీష్, పరీక్ష సిద్ధత వంటి విషయాలపై ప్రత్యేక శిక్షణ తీసుకుంటారు. అంతేకాదు, చాలా మంది విద్యార్థులు తమతమ ఇళ్లు లేదా గ్రంథాలయాల్లో స్వయం అధ్యయనానికి సమయాన్ని కేటాయిస్తారు. కొన్నిసార్లు వీరు చదువుకునే సమయం రాత్రి వరకూ కొనసాగుతుంది. ఈ శక్తివంతమైన రోజువారీ షెడ్యూల్ కారణంగా ప్రతి విద్యార్థీ అసాధారణ స్థాయిలో యూనివర్శిటీ విద్య కోసం పోటీపడతాడు. ప్రత్యేకించి కాలేజ్ స్కాలస్టిక్ ఎబిలిటీ టెస్ట్ (సిఎస్ఎటి)కి పోటీ అధికంగా ఉంటుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైతే, విద్యార్థుల భవిష్యత్తు, వారి కెరీర్ నిర్ధారణ అవుతుంది. ఈ రకమైన పోటీకి అక్కడి విద్యార్థులు తమను తాము సిద్ధం చేసుకుంటారు కాబట్టే దక్షిణ కొరియాను విద్యావిషయంలో ప్రపంచంలో నంబర్‌వన్‌గా పేర్కొంటారు. అయితే, ఇంతటి శ్రమ ఒక్కోసారి సమస్యలు, సవాళ్లను సృష్టించే ప్రమాదం లేకపోలేదు. విద్యార్థులు తరచుగా తీవ్రమైన ఒత్తిడి, నిద్రలేమి, వినోద సమయం తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. విమర్శకులు ఈ తీవ్రమైన వ్యవస్థ యువతపై అధిక ఒత్తిడి పెడుతూ మానసిక ఆరోగ్య సంబంధమైన సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ, అత్యంత పోటీభరిత సమాజంలో విజయాన్ని సాధించడానికి చాలా కుటుంబాలు ఇలాంటి త్యాగాలను అత్యవసరమైన దశగా పేర్కొంటాయి. నాణానికి రెండు పార్శ్వాలు ఉన్న విధంగానే, దక్షిణ కొరియా విద్యార్థుల షెడ్యూల్‌లోనూ మంచిచెడ్డలు ఉన్నాయి. ఒత్తిడి పెంచకుండా, విద్యార్థులను చదువువైపు నడిపించడం అవసరం.

## ఎఐ టీచర్‌ను సృష్టించిన ఆదిత్య

ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లా శివచరణ్ ఇంటర్ కాలేజీకి చెందిన ఆదిత్య కుమార్ వయసు కేవలం 17 సంవత్సరాలు. చదువుతున్నది 12వ తరగతి. అయితేనేం.. కృత్రిమ మేధస్సు (ఎఐ) టీచర్‌ను రూపొందించి సంచలనం సృష్టించాడు. వయసు చిన్నదేగానీ, తన ఆలోచనలు మాత్రం భవిష్యత్తును మలిచే స్థాయిలో ఉన్నాయని నిరూపిస్తూ, అసాధారణ కీర్తి ఆర్జించాడు. ఎఐ సాయంతో అతను రూపొందించిన ‘సోఫీ’ అనే రోబో టీచర్ కేవలం యంత్రం కాదు. ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంది.. గణిత లెక్కలు చేస్తుంది.. సాధారణ విజ్ఞాన విషయాలను వివరిస్తుంది. ‘నేను ఎఐ టీచర్ రోబోను. నా పేరు సోఫీ. నన్ను ఆదిత్య రూపొందించాడు’ అంటూ తనను తాను పరిచయం చేసుకోవడం ఈ ఆవిష్కరణలోని ప్రత్యేక ఆకర్షణ. ప్రస్తుతం హిందీలో మాట్లాడగలిగే ఈ రోబో, త్వరలో రాయగలిగేలా కూడా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆదిత్య ముందుకెళ్తున్నాడు. పెద్ద కంపెనీలు ఉపయోగించే ఎల్ఎల్ఎం చిప్‌సెట్‌ను వినియోగించి ఒక విద్యార్థి ఈ స్థాయి రోబోను రూపొందించడం నిజంగా ఆశ్చర్యమే. ఉపాధ్యాయుడు సెలవు తీసుకున్నా, విద్యార్థుల సందేహాలు తీరకుండా ఉండకూడదనే ఆలోచనతో సబ్‌స్టిట్యూట్ టీచర్‌గా సోఫీని ఉపయోగించవచ్చని ఆదిత్య చెబుతున్నాడు. ఇంతటితో ఆగకుండా, ప్రతి జిల్లాలో పరిశోధనల కోసం సరైన ల్యాబ్‌లు ఉండాలని ఆదిత్య వ్యక్తం చేసిన ఆకాంక్ష అతడి దూరదృష్టిని చాటుతుంది. ఇది కేవలం వ్యక్తిగత విజయం కాదు.. భారత యువతలో ఉన్న అపార ప్రతిభకు నిదర్శనం. సరైన ఆలోచన, నిరంతర కృషి, ధైర్యం ఉంటే వయసు అడ్డంకి కాదని ఆదిత్య కథ మనకు స్పష్టం చేస్తుంది. ఈరోజు ఒక విద్యార్థిగా ఉన్నవాడు, రేపటి విద్యా రంగాన్ని మార్చగలడనే విశ్వాసానికి ఇదో ఉదాహరణ.



**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# విత్తనాల బిల్లులను ఉపసంహరించుకోవాలి

### ముసాయిదా ప్రతులను దహనం చేసిన రైతు సంఘాల నాయకులు

**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తనాల బిల్లు , విద్యుత్ బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్ రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం వరంగల్ హెడ్‌పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సంఘాల నాయకులు బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన విధానాలు రైతులకు, చిన్న తరహా విత్తన ఉత్పత్తిదారులకు తీవ్ర హాని తలపెట్టే విధంగా ఉన్నాయని విమర్శించారు. రైతులను దోచుకునేందుకే కేంద్రం లోని మోదీ ప్రభుత్వం విత్తనాల బిల్లు, విద్యుత్ బిల్లులను తీసుకువస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర సూరి, సుధమల భాస్కర్, వల్లందాస్ కుమార్, ఐత నగేష్, మొగిలయ్య, మైదం పాణి, ఎండి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



### రైతులను దోచుకునేందుకే...

**ఖిలా వరంగల్ :** సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సంఘాల నాయకులు బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను దోచుకునేందుకే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విత్తనాలు, విద్యుత్ బిల్లులను తీసుకువస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్‌లు రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, సుదమల భాస్కర్, వల్లందాస్ కుమార్, ఐత నగేష్, మొగిలయ్య, మైదం పాణి, ఎండి అక్బర్ పాల్గొన్నారు.

### కేంద్రానిది నిరంకుశ పాలన

**హుజూర్‌నగర్:** సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ కమిటీ పిలుపుమేరకు సోమవారం విత్తన బిల్లు చట్టం ముసాయిదా పత్రాలను మిర్యాలగూడెం రోడ్డులోని ఇందిర సెంటర్‌లో దహనం చేశారు. విత్తన, విద్యుత్ బిల్లును తక్షణమే కేంద్ర ప్రభు త్వం ఉపసంహరించుకోవాలని ఎస్‌కెయం నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయం రాష్ట్ర పరిధిలో ఉండాల్సినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశ వైఖరి అమలు కు ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, నాయకులు పల్లె వెంకటరెడ్డి, కౌలు రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొప్పోజు సూర్యానారాయణ, నాయకులు ఎల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, దుగ్గి బ్రహ్మం, దేవరం మల్లేశ్వరి, జడ శ్రీనివాస్, ఎల్లావుల రమేష్, పోషణబోయిన హుస్సేన్, జక్కుల వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, సుందరి పద్మ, రమణ పాల్గొన్నారు.

### రైతులు హక్కులు హరిస్తున్న కేంద్రం

**సూర్యాపేట టౌన్ :** విత్తన, విద్యుత్ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతుల హక్కులు హరిస్తుందని ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ దంతాల రాంబాబు, మందారి డేవిడ్ కుమార్, వరికుప్పల వెంకన్న, మట్టిపెల్లి సైదులు అన్నారు. సోమవారం ఎస్‌కెఎం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద విత్తన, విద్యుత్ బిల్లుల పత్రాలను దహనం చేసి వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కెఎం జిల్లా నాయకులు షేక్ నజీర్, కునుకుంట్ల సైదులు, పెరుమాళ్ళ రాజారావు, నారాబోయిన వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.









## కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం

### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రామగుండంలోని అన్ని డివిజన్లలో పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నామని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. సోమవారం స్థానిక భాస్కరరావు భవన్‌లో జరిగిన సిపిఐ రామగుండం నగర సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో ఉన్న సమస్యలను తీసుకొని ఆయా డివిజన్లలోని ప్రజలను కలుపుకొని పోరాటాలు నిర్వహించాలని తద్వారా రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ఆదరణ లభిస్తుందని, ఆ దిశగా శ్రేణులు ముందుకు సాగాలన్నారు అదేవిధంగా సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయుటకు పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని నుండి అధిక సంఖ్యలో క్యాడర్ తరలి రావాలని ఆయన కోరారు. తాళ్ళ పెల్లి మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కె.కనకరాజ్, యూనియన్ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం తదితరులు మాట్లాడారు. అనంతరం నూతనంగా 15 మంది నగర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు మడికొండ ఓదెమ్మ,మాటేటి శంకర్, తోడుపునూరి రమేష్ కుమార్,అసల రమ శనిగరపు చంద్రశేఖర్,మార్కాపురి సూర్య, రేణుకుంట్ల ప్రీతం, సంకె అశోక్, సిరిసిల్ల మల్లేష్, గంగారాపు చంద్రయ్య,పడాల కనకరాజ్,దుబాసి రేణుక, అబ్దుల్ కరీం, ఎర్రల రాజయ్య, గోడిసెల నరేష్, ఏం ఏ గౌస్,ఉప్పులేటి తిరుపతి,జగన్, అసాల నవీన్, శివ,సుధీర్,భూమయ్య, సాగర్,నాని రెడపాక లక్ష్మణ్ , జెర్రిపోతుల దేవయ్య,జీవన్ పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలి

### ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్




**ప్రజాపక్షం/వరంగల్ :** జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలను నిర్మించాలని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ కోరారు. సోమవారం శివనగర్‌లోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఖిలా వరంగల్ మండల సమావేశం శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో శరత్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయంగా ఉన్నాయని, మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యం, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు విద్యార్థులు నిత్యవసర ధరలకు అనుకూలంగా మెస్ బిల్లులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలతోపాటు ఖాళీగా ఉన్న వార్డెన్, వర్కర్లను నియమించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

# నిజాయితీపరులు, అభివృద్ధికాముకులకే పట్టం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు







**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిజాయితీపరులైన అభ్యర్థులను, గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేసే వారిని గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 11న జరిగే పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులకు పట్టం కట్టాలని ఆయన కోరారు. సోమవారం మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న పలు మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ దేశాభివృద్ధికి పల్లె సీమలే పట్టుకొమ్మలని అటువంటి పల్లెల్లో అభివృద్ధి పనులను నిజాయితీతో చేసే వారిని గెలిపించాలన్నారు. సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులు గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసేవారని ఆయన తెలిపారు. బస్వాపురంలో ఆవుల నర్సింహారావు, నేరడలో దూసరి నేతాజీ, కొండవనమాలలో కొనకంచి రామారావు, పెద్దమునగాలలో నీలాల కళావతి, చిన్నగోపతిలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మల్లవరంలో మందడపు రాణి, బ్రాహ్మణపల్లిలో తార, కోదుమూరులో బోళ్ల ప్రమీల, తనికెళ్లలో గడల కళావతి, రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో శాఖమూరి శ్రీనివాసరావు, పంగిడిలో పోలిజామ్లా ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. బరిలో నిలిచిన పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల గుర్తులను తెలియజేస్తూ పలు చోట్ల ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కూనంనేని పాల్గొన్నారు.

**దూసరి నేతాజీని గెలిపించండి :** దూసరి నేతాజీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని విజ్ఞప్తి చేశారు. సోమవారం నేరడ గ్రామంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి సర్పంచ్ అభ్యర్థి దూసరి నేతాజీ గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూనంనేని వెంట సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, బెజవాడ రవి, సిహెచ్ సీతామహాలక్ష్మి, తోట రామాంజనేయులు, పావులూరి మల్లికార్జున్, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యంగల ఆనందరావు, దూసరి గోపాలరావు, గాదె లక్ష్మినారాయణ, గడల భాస్కర్, ఊట్ల కొండలరావు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి



ప్రజాపక్షం/వికారాబాద్: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజల నుండి 12 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది అని అన్నారు. ఇందులో ముఖ్యంగా పెన్షన్, వ్యవసాయం, గృహనిర్మాణశాఖ, భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ మంగ్లీలాల్, ఆర్డిఒ వాసుచంద్ర, డిఆర్డిఒ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంభీర్, తుర్క చెరువుల సుందరీకరణకు వినతి



ప్రజాపక్షం/నిజాంపేట్ :అంభీర్, తుర్క చెరువులను సుందరీకరించాలని బాచుపల్లి మండల సిపిఐ కార్యదర్శి పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హైడ్రా కార్యాలయంలో ప్రజావాణిలో శ్రీనివాస్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ తుర్క చెరువు, ప్రగతి నగర్ అంభీర్ చెరువులను సుందరీకరించాలని అన్నారు. కబ్జా దారుల చెర నుండి చెరువులను పరిరక్షిస్తున్న హైడ్రా యంత్రాంగం చెరువుల సుందరీకరణను చేపట్టాలని కోరారు. హైడ్రా 'పేదలవైపు కాకుండా పెద్దల వైపు మారింది' అనే వాదనలు వినిపిస్తున్నాయని తెలిపారు. రాజ్యం పేద ప్రజల వైపు ఉంటేనే వారి విలువ పెరుగుతుందని, హైడ్రా ఆధ్వర్యంలో చెరువులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆశి, యాదయ్య, పొన్న కంటి దస్తగిరి పాల్గొన్నారు.



## అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహాయాదవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట: ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలతో పేదల కండ్లల్లో ఆనందం కనిపిస్తుందని అర్హులైన ప్రతీ పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కేశవరంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో గుడిసె స్వప్నకు మంజూరైన నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ కృషితో మేడ్చల్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేదల కొరకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి, బాలకృష్ణ, నాయకులు బండి జగన్నాథం, బాల్‌నర్సింహా, యూసుఫ్, పాండు, గ్రామాధ్యక్షుడు శేఖర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి రామాలయం వద్ద గత కొన్ని ఏళ్లుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకోవడం లేదు. పెద్ద చర్లపల్లి, చిన్న చర్లపల్లి ప్రధాన రహదారిలో ఉన్న ఈ మ్యాన్‌హోల్‌పై నుండి భారీ వాహనాలు వెళ్తుండడంతో కృంగిపోవడం జరుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.



అదే విధంగా ఈ మ్యాన్‌హోల్ కు గల డ్రైనేజీ పైప్‌లైన్‌ను గత కొన్ని సంవత్సరాల క్రితం వేసిన పైప్‌లైన్ చిన్నదిగా ఉండడంతో ప్రతి వారానికొక్కసారి మ్యాన్‌హోల్ నుండి మురుగునీరు రామాలయం ముఖద్వారం ముందు నుండి పారుతూ నీరు నిల్వవుండ డంతో ఆలయంలోకి భక్తులు వెళ్లకుండా ఇబ్బందులకు గురువుతున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఇకనైన సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు డ్రైనేజీ పైప్‌లైన్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



ప్రజాపక్షం/కాప్రా: మల్లాపూర్ డివిజన్‌కు చెందిన తిలోత్తమ ఖతువాకు వైద్యంకోసం సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.2లక్షల 10వేల చెక్‌ను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సోమవారం అందచేసారు.

## శబరిమలైకి తరలిన కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/నిజాంపేట్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలను శ్రీనివాస్ రెడ్డి అయ్యప్ప మాల ధారణ చేసుకుని నలభై ఒక్క రోజులను ముగించుకుని ఇరుముడితో శబరిమలైకి తరలివెళ్లారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి మండలం, నిజాంపేట్ హనుమాన్ దేవాలయం నుండి ర్యాలీగా కొలను శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలుచేసి ఇరుముడిని ధరించి శబరిమలైకి వెళ్లారు. నలభై ఒక్క రోజుల పాటు కఠోర దీక్షతో అయ్యప్ప స్వామి మాల ధారణ పూర్తి చేసుకుని హనుమాన్ ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు చేసిన శ్రీనివాస్ రెడ్డి ఇరుముడిని తలపై పెట్టుకుని ర్యాలీగా శబరిమలైకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామిని నమ్ముకుని నిష్టతో, క్రమ శిక్షణతో, అయ్యప్ప మాలధారణ చేసుకుని పూజలు చేసిన ప్రతి భక్తునికి కోరిన కోరికలు నెరవేరుతాయని అన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన వేడుకున్నారు.



# పోరాటాలతోనే హక్కులు సాధ్యం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్




ప్రజాపక్షం/ఘట్‌కేసర్: అడిగితే హక్కులు రావని...పోరాటం చేస్తేనే హక్కులు సాధించవచ్చని, అది భారత కమ్యూనిస్టు పార్టీతోనే సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ జిల్లా నాయకులు కల్యాణ్ జయ చంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ కౌన్సిల్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ సిపిఐ పోరాటం వల్లనే విశాలాంగుల కాలనీ ఏర్పడిందని విశాలాంగుల కాలనీకోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించగా అందులో మూడు ఎకరాలలో గృహాలను నిర్మించారు. రెండు ఎకరాలు కాలనీకి సంబంధించినటువంటి ప్రజల ఉపయోగాలకు ఉంచితే ఆ స్థలాన్ని కొందరు కబ్జాకు గురి చేశారు. ఈ స్థలానికి రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వివరించినట్టేనని సిపిఐ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహిస్తున్నామని రానున్న రోజుల్లో రెండు ఎకరాల స్థలం కొరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మా పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలను కలుపుకొని సాధించేంతవరకు పోరాడుతామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో జనవరి 18న ఖమ్మం పట్టణంలో ఐదు లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని ఈ బహిరంగ సభకు ఘట్‌కేసర్ మండలం నుండి కార్యకర్తలు, కార్మికులు, ప్రజలు సామూహికంగా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ మాట్లాడుతూ మండలంలోని కాచావాణి సింగారం గ్రామంలోని సర్వేనెంబర్ 66లో పేద ప్రజలు కట్టుకున్న ఇండ్లను రెవెన్యూ అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వం జూన్ 2024 కంటే ముందు కట్టుకున్న ఇండ్లను కూల్చమని చెప్పిన జిఒ ను తీసుకొనివస్తే ఇక్కడి మండల రెవెన్యూ అధికారులు దానికి విరుద్ధంగా పని చేసే కొంతమంది కోసం గత 20 సంవత్సరాల నుంచి నివసిస్తున్న వారి ఇండ్లను కూల్చివేయడం తగదని వారికోసం రానున్న రోజుల్లో సిపిఐ పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సయ్యద్ ఖదీర్, సరిత, ఎస్కే అన్వర్ పాషా, సరిత, ఉపేంద్ర, ధనంజయ, మురళి, కిష్టయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలను పట్టించుకోని అధికారులు**

కుత్బుల్లాపూర్‌లో : స్థానిక సమస్యలను అధికారులు పట్టించుకోవడంలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. బీరప్పనగర్‌లో రూ దారి వెడల్పు పేరిట మరమ్మతులు చేస్తుంటే వాటర్ లైన్ పగిలి మూడు రోజులవుతున్నా ఇప్పటివరకు అధికారులు పట్టించుకోవడంలేదని సోమవారం బీరప్ప నగర్ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సిపిఐ నాయకత్వం కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే పూర్తి మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఒకవేళ పరిష్కరించకపోతే నేడు ప్రజలతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి, లక్ష్మి, నాగలక్ష్మి, భాగ్యమ్మ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నా రు.

## మహిళా కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించాలి

ఎఐవైఎఫ్ సత్యప్రసాద్

ప్రజాపక్షం/కాప్రా : నాచారం పారిశ్రామిక వాడలోని షాహి ఎక్స్‌పోర్టు ప్రైవేట్ సంస్థలో పనిచేసే మహిళా కార్మికులకు వేతనాలు పెంచటంతో పాటు కంట్రాక్టర్ చేస్తున్న కోతలను నిలిపి వేయాలంటూ సిపిఐ నాయకుడు, ఏఐవైఎఫ్ సత్యప్రసాద్ డిమాండ్ చేసారు. సోమవారం సంస్థ ఎదుట పెద్ద ఎత్తున జరిగిన మహిళా కార్మికుల ఆయన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పని చేస్తున్నారని, యాజమాన్యం కనీస వేతనాలు నేరుగా ఇవ్వకుండా కాంట్రాక్టర్ ద్వారా చెల్లింపులు చేస్తుండగా సదరు కాంట్రాక్టర్ యాజమాన్యం ఇస్తున్న వేతనాల్లోంచి తగ్గించి ఇస్తున్నార న్నారు. కార్మికులు సుదీర్ఘ కాలంగా పని చేస్తున్నా పరిమినెంట్ చేయకపోవటం తగదన్నారు. కార్మిక నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోని యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాడ్ చేసారు. సంస్థ నుండి తమకు రావాల్సిన రూ.16 వేల నెలసరి జీతంలో కంట్రాక్టర్ కేవలం రూ.9వేలు మాత్రమే ఇస్తున్నారని మహిళా కార్మికులు వాపోయారు.




## ముసాయిదా బిల్లు ఉపసంహరణకు డిమాండ్

రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేందర్ ప్రసాద్

శామీర్‌పేట మండల కేంద్రంలో ప్రతుల దహనం




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జాతీయ పిలుపు మేరకు తెలలంగాణా రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ అధ్యక్షతన జిల్లా కేంద్రం శామీర్‌పేట మండల కేంద్రంలో సోమవారం బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ముసాయిదా బిల్లు విత్తన బిల్లు 2025 ప్రతులను దహనం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేందర్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ సీడ్స్ బిల్లు భారత విత్తన రంగంపై బహుల జాతి సంస్థల కార్పొరేట్ అధిపత్యాన్ని నెలకొల్పేందుకు తీసుకొని వచ్చిన ప్రతికూల చట్టమన్నారు. ఆహార భద్రత, విత్తన స్వావలంబన, రాష్ట్రాల హక్కులను ఈ ముసాయిదా తీవ్రంగా డెబ్బ తీస్తుందన్నారు. ఈ ముసాయిదా బిల్లును వెంటనే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్, జిల్లా గౌరవ అధ్యక్షులు సామల వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాష్ట్ర నాయకులు డిజి సాయిలు గౌడ్, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలన్న గారి రాజిరెడ్డి, స్థానిక రైతు దొంతర బోయిన భూమయ్య, పి.లక్ష్మ ణ్, కొండయ్య, ఎన్ చైతన్య, సుధాగోని శ్రీనివాస్ గౌడ్, మహిళా నాయకురాలు మణమ్మ, గాయత్రిలు సంఘ సభ్యులతో ప్లేకార్డులతో నిరసన వ్యక్తం చేసారు.

## చిన్న తప్పిదం కూడా జరుగకూడదు

కలెక్టర్ ప్రతీక్‌జైన్




ప్రజాపక్షం/వికారాబాద్: జిల్లాలో మొదటి విడుత పోలింగ్ జరిగే మండలాల్లో అధికారులు నిబంధనలు పక్కా గా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీ గా నిర్వహించాలని, చిన్న తప్పిదానికి కూడా ఆస్కారం కల్పించకూడదని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. 8 మండలల్లోని ఎంపిడిఒలు, తహసీల్దార్లు జూమ్ సమావేశంలో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ఎన్నికల సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ సిబ్బంది సమయపాలనను పాటిస్తు సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. మొదటి విడుత పోలింగ్ ఈ నెల 11న జరుగుతున్న దృష్టా,10వ తేదీ ఉదయం 8గంటల సమయానికే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని , మధ్యాహ్న భోజనం అనంతరం పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని అన్నారు.

చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామాగ్రి ఉందా లేదా అని క్షణ్ణంగా పరిశీలించుకోవాలని, అనంతరం పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లను చక్కబెట్టుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఓటింగ్ విషయంలో గోప్యత నూటికి నూరు శాతం అమలు జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల విదులలో అనవసర పొరపాట్లకు అస్కారం కల్పిస్తే ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరిగేలా, సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నా రు. ఎస్‌పి మాట్లాడుతూ మొదటి విడుత పోలింగ్ ఏర్పాట్లుకు సంబంధించిన ఎనిమిది మండలల్లో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఉదయం 7గంటల నుండి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు పోలిస్ సిబ్బందికి ఎలాంటి సెలవులు ఇవ్వబడవు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్, తాండూర్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అడిషనల్ ఎస్‌పి రాముల్ నాయక్, డిఆర్ఒ మంగ్లీనాయక్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలకు డిసి వత్తాసు



ప్రజాపక్షం/నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అనుచరుల అక్రమ నిర్మాణాలకు డిప్యూటీ కమిషనర్ వత్తాసు పలుకుతున్నాడని బిజెపి నాయకులు ఆకుల సతీశ్, యువ నాయకుడు జై శంకర్ గౌడ్‌లు ఆరోపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం సర్కిల్ కార్యాలయం ముందు ఆకుల సతీశ్, జై శంకర్ గౌడ్‌ల టీమ్ బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులకు వినతి పత్రాన్ని ఇచ్చేందుకు నిరసన కారులు ప్రయత్నించగా గేటు వేయడంతో గేటుకి వినతిపత్రాన్ని కట్టి నిరసన తెలప డం గమనార్హం. ఈ సందర్భంగా ఆకుల సతీశ్, జై శంకర్ గౌడ్‌లు మాట్లాడుతూ కైసర్‌నగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే అనుచరులు వి లిక్కర్ మార్ట్‌కోసం సుమారు పన్నెండు అక్రమ షెడ్‌లను నిర్మించారని, గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి కనీసం నోటీసులు కూడా జారీ చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సామాన్యు లు ఓ చిన్న షెడ్డుని నిర్మించుకుంటే ఆగమేఘాల మీద కూల్చివేసే టౌన్ ప్లానింగ్ మరియు మున్సిపల్ అధికారులు పన్నెండు అక్రమ షెడ్లను నిర్మించుకుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేరని నిలదీశారు. కైసర్ నగర్ చౌరస్తా ఆక్సిజన్ హోమ్స్ అపార్టెమెంట్ వద్ద అరవై ఫీట్‌ల రోడ్డు, ముప్పై ఫీట్ల ఫుట్‌పాత్‌ని, కనీసం సెట్ బ్యాక్ సైతం లేకుండా అక్రమ షెట్టర్‌లను నిర్మిస్తే అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. అక్రమ షెడ్లకు ఏకంగా సర్కిల్ అధికారులు ఇంటి నెంబర్లను జారీ చేయడం విశేషంగా ఉందని దుయ్యబట్టారు. సర్కిల్ అధికారుల అవినీతి, అధికార దుర్వినియోగం స్పష్టంగా కనబడుతున్న డిసి మల్లారెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.




## చరిత్రలో నిలిచిన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్

సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట పోలీస్ స్టేషన్ తెలంగాణ రాష్ట్రంలో నెంబర్ వన్ స్థాయి సాధించడం అలాగే దేశంలో ఏడో స్థానంలో రాణించడం గొప్ప విషయమని చరిత్రలో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ నిలిచిపోయిందని సిపిఐ మేడ్చల్ జిల్లా మాజీ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ అన్నారు. సోమవారం రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికైన సందర్భంగా శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌ను సిపిఐ శామీర్‌పేట మండల ప్రధాన కార్యదర్శి డిజి నరేందర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు, రైతు సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ అంచెలంచెలుగా రాష్ట్రస్థాయికి ఎదిగిందన్నారు. అద్దె భవనంలో ఉన్న పోలీస్‌స్టేషన్ సొంత భవనంలోకి మారిందని చెప్పారు. ఈ ఘనత శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్, పోలీసులకు దక్కిందన్నారు. ప్రజల సమస్యలను ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తు ప్రజలకు చేరువలో సేవలందిస్తున్న సిఐకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దశరథ, జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## భద్రతా భావం పెంపొందించే లక్ష్యంతోనే ఫ్లాగ్ మార్చ్ : ఎస్‌పి

ప్రజాపక్షం/వికారాబాద్ : ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం అని జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా అన్నారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, ప్రజల్లో భద్రతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో, బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా స్వయంగా నాయకత్వం వహించారు. ఈ మార్చ్‌లో పోలీసు బలగాలు, క్విక్ రియాక్షన్ టీం,ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపి, చట్టాన్ని ఉల్లంఘించాలని చూసే అసాంఘిక శక్తులకు, రౌడీషీటర్లకు బలమైన హెచ్చరిక పంపడమే ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశం అని అన్నారు. సున్నితమైన గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం పట్టిష్టమైన ఏర్పాట్లు చేసిందని ఎస్‌పి హామీ ఇచ్చారు. ప్రజలకు కీలక సూచనలు చేస్తూ.. ముఖ్యంగా క్రిటికల్ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఇతరులను భయపెట్టేందుకు ప్రయత్నించినా లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు ధైర్యంగా ఓటు వేసేందుకు అధికారుల తరపున అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి రాములు నాయక్, తాండూర్ డిఎస్పి యాదయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 114 అర్జీలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 114 అర్జీలను ధరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ల్ విజయేందర్‌రెడ్డి, లా అధికారిణి చంద్రావతితో కల్సి అర్జీలను స్వీకరించారు. అనంతరం వారి తో పాటు ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులను అర్జీలను సత్వరమే పరిష్కరించాలని వారు ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.






## అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా శామీర్‌పేట

ప్రజాపక్షం/శామీర్‌పేట : కేంద్ర మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా చేపట్టిన ఉత్తమ పోలీస్‌స్టేషన్‌ల ఎంపికలో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ రాష్ట్రంలో నెంబర్ వన్‌గా, దేశంలో ఏడో స్థానంలో నిలువడం పోలీసుల పనితీరుకు నిదర్శనమని బిజెపి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు వంగరి హృదయ్‌కుమార్ అన్నారు. సోమవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్, ఎస్‌ఐలు సోమిరెడ్డి, శశివర్ధన్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్, జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి దయాకర్, ప్రధాన కార్యదర్శి తుంకి భాస్కర్, నాయకులు వివేకానంద్, దొండ మహేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతు బంధు కమిటి మాజి కన్వీనర్ బుద్ధి అంజనేయులు సిఐ శ్రీనాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## వరద ప్రభావం కాలనీలకు శాశ్వత పరిష్కారం

హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** వరద ప్రభావం ఉన్న కాలనీలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తామని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం కమలా నగర్ కాలనీలో జరుగుతున్న వరద డ్రైన్ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం డిఇ దామోదర్ రావు, ఎఇ హేము నాయక్, పార్టీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కాలనీ ప్రధాన కార్యదర్శి సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వరాచారి బలిదానం బాధాకరం

సిపిఐ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** బిసిల రిజర్వేషన్‌ల కోసం సాయి ఈశ్వరాచారి బలిదానం బాధాకరమని సిపిఐ బాలాపూర్ మండల కార్యధర్శి ముకుందం గారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బాలాపూర్ మండల పరిధిలో సిపిఐ ఆధ్వర్యంలో ఈశ్వరాచారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బిసి యువత అధైర్య పడకుండా రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేయాలని, ఏ ఒక్క బిసి యువకుడు తొందరపడి ప్రాణాలను తీసుకోవద్దని కోరారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని సత్యసాగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీ వాసులతో కలిసి కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీ సంక్షేమ భవనం మరమ్మతులు, నూతన సిసి రోడ్లు, కాలనీలో పేర్కొన్న చెత్తచెదారాలు తొలగించే విధంగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఎఇ కార్తీక్, కాలనీ అధ్యక్షులు శ్యామ్ గౌడ్, కాళేష్, శ్రీనివాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధికి బాటలు


మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిపించి అభివృద్ధికి బాటలు వేసేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి భాస్కర్ గౌడ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. గ్రామంలో పర్యటించి కాంగ్రెస్ అభ్యర్థి భాస్కర్‌గౌడ్‌కు కేటాయించిన ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఆకాంక్షించారు. ప్రచార కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## బిసిలకు రాజకీయ సహకారం

బిసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిపోతున్న బిసిలు రాజకీయంగా ఎదిగేందుకు ప్రజలు సహకరించాలని బిసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప కోరారు. సోమవారం మండల పరిధిలోని రాయికల్, భీమారం, మధురాపురం, కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామాల్లో బిసి అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కత్తి చంద్రశేఖర్ అప్ప మాట్లాడుతూ పాపిరెడ్డిగూడ సర్పంచ్ అభ్యర్థి చాకలి శశిరేఖ, భీమారం సర్పంచ్ అభ్యర్థి పూజారి మాధవి, మధురాపురం అభ్యర్థి బండి శ్రీనివాస్, రాయికల్ సర్పంచ్ అభ్యర్థి కె.జ్యోతి శ్రీనివాస్‌లకు కేటాయించిన గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జమాల్పూర్ చందులాల్, తంగిడిపల్లి శంకర్, జక్కుల జలజ, కాటం భాగ్యలక్ష్మి గౌడ్, స్రవంతి రాజ్ పాల్గొన్నారు.

## దొంగతనం మిస్టరీ చేధింపు

వివరాలు వెల్లడించిన ఎసిపి లక్ష్మీనారాయణ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దొంగతనం కేసు మిస్టరీని పోలీసులు చేధించారు. సోమవారం షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన జర్నలిస్టు కొండె కృష్ణయ్య ఇంట్లో డిసెంబర్3న గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వికారాబాద్ జిల్లా రామయ్యగూడ గ్రామానికి చెందిన కావలి సురేందర్ అలియాస్ బుడిగే శ్రీధర్ అలియాస్ ఎల్లయ్యతోపాటు అదే జిల్లా తాండూరు మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన కర్నే నర్సింలు తాళం వేసిన ఇండ్లను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతుంటారని వివరించారు. వారే కృష్ణ ఇంట్లో నగలు చోరీకీ పాల్పడ్డారు. నింధితులను ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేసి పట్టుకున్నట్లు వివరించారు. నిందితుల నుండి రూ.3లక్షల 62వేల విలువైన బంగారు నగలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎసిపి లక్ష్మీ నారాయణ తెలిపారు. పట్టణ సిఐ విజయ్‌కుమార్, డిఐ వెంకటేశ్వర్లు, డిఎస్ఐ శివారెడ్డి, క్రైమ్ బృందం కానిస్టేబుల్ మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, సంతోష్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నట్లు తెలిపారు.

# తెలంగాణ ఆగ్రోస్ భూమిని కాపాడిన హైడ్రా

కబ్జాలకు ఆస్కారం లేకుండా కంచె నిర్మాణం

ప్రహరీలు నిర్మించి షెడ్డులు వేసి ఆక్రమణలు

కిరాయిలకు ఇచ్చుకుంటూ రూ.లక్షల్లో వసూళ్లు






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలంలోని మౌలాలి నాచారం విలేజ్‌లోని తెలంగాణ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భూములను హైడ్రా కాపాడింది. సర్వే నెంబరు 29/1 తో పాటు 30 లలో 23.28 ఎకరాల భూమిని తెలంగాణ ఆగ్రోస్‌కు రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేటాయించింది. అయితే ఈ భూమికి అనుకుని ఉన్న దుర్గానగర్, కమలా బాయ్ నగర్, బాబానగర్ కాలనీల వైపు కొంతమేర ఆక్రమణలు జరిగాయి. ఇలా ఇప్పటికే 4 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. ఇలా వరుసగా కబ్జాలు జరుగుతున్నాయని వెంటనే కబ్జాలను తొలగించి ఆగ్రోస్ భూమిని కాపాడాలంటూ తెలంగాణ ఆగ్రోస్ సంస్థ ఛైర్మెన్ కాసుల బాలరాజు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివాసం ఉన్న వాటిని మినహాయించారు. వాటి జోలికి వెళ్లకుండా, ప్రీకాస్ట్ ఇటుకలతో ప్రహరీ నిర్మించి, అందులో వేసిన చిన్న షెడ్డులను తొలగించారు. సేకరించిన చెత్తను వేరు చేసేందుకు వినియోగిస్తున్న షెడ్డులను, స్క్రాప్ దుకాణాన్ని ఖాళీ చేయించి వాటిని హైడ్రా తొలగించింది.

### ఇప్పటికే పలు కేసులు..

ఇక్కడ లావణ్య అనే మహిళ తప్పుడు పత్రాలతో రెండు ఎకరాలకు పైగా చిన్న ప్లాట్లుగా చేసి అమ్మేశారు. తెలంగాణ ఆగ్రోస్ వారు ఆమెపై నాచారం పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టారు. ఈ కేసుల్లో ఆమె అరెస్టు అయ్యారని తెలంగాణ ఆగ్రోస్ సంస్థ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ ఆగ్రోస్‌లోనే పనిచేస్తున్న రాజు అనేవ్యక్తితో కలిసి 1200చదరపు గజాల ఆక్రమణలో భాగస్వామ్యం అయినట్టు సంస్థ అధికారులు తెలిపారు. మహేందర్ అనే వ్యక్తి 2 వేల గజాలకు పైగా ఆక్రమమించి ప్లాట్లుగా విడదీసి, ప్రస్తుతానికి చిన్న షెడ్డులు వేసి వాటిని కిరాయికి ఇచ్చినట్టు ఆగ్రోస్ అధికారులు ఫిర్యాదు చేశారు. వీరందరికీ ఇప్పటికే నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇలా వివిధ కట్టడాలతో ఆక్రమణలకు పాల్పడితే, వాటిని తొలగించి, తెలంగాణ ఆగ్రోస్‌కు చెందిన భూమి చుట్టు హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మల్లాపూర్ డివిజన్‌లో ఎక్కడా నివాసాల జోలికి వెళ్లలేదని హైడ్రా స్పష్టం చేసింది.

## బిసి అభ్యర్థులనే ఆదరించండి

బిసి ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ చిరంజీవులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దాలు గడుస్తు న్నా, గ్రామాల స్థాయిలో బిసిల జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, నాయకత్వం మాత్రం ఇతర వర్గాల చేతుల్లోనే ఉందని, సర్పంచ్ ఎన్నికల్లో బిసి అభ్యర్థులనే గెలిపించాలని బిసి ఇంటెలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు (రిటైర్డ్ ఐఎఎస్) అన్నారు. ఇప్పుడు బిసి సమాజం బలంగా గ్రహించాల్సిన సమయం వచ్చిందని, ఈసారి జరుగుతున్న సర్పంచ్ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావు, ఇవి బిసిలకు నాయకత్వం రావాలా? లేక బిసిలు ఓటుగా మాత్రమే మిగలాలా? అని నిర్ణయించే ఎన్నికలని పేర్కొన్నారు. అందుకే ఓటు డబ్బుకు, సారాకు అమ్ముకునే వస్తువు కాద ని, భవిష్యత్తును నిర్ణయించే ఆయుధమని, ఆలోచించి బిసి అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించాలని పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ ఈ శతాబ్దపు అత్యున్నత నాయకులలో ఒకరు

దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** డాక్టర్ బిఆర్. అంబేద్కర్ ఈ శతాబ్దపు అత్యున్నత నాయకులలో ఒకరని, సాధారణ నేపథ్యం గల కుటుంబం నుండి, ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగ నిర్మాతగా ఎదిగారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మహాపరినిర్వాణ దివస్‌ను సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ బాబాసాహెబ్‌కు నిజమైన నివాళి మనం చెప్పే మాటలలో కాదు, మనం చేసే పనులలో ప్రతిఫలించాలన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన అపారమైన కృషిని ప్రముఖంగా ఆయన ప్రస్తావించారు. అంబేద్కర్‌ను, అందరికీ సమానత్వం, స్వేచ్ఛ మరియు న్యాయం హామీ ఇచ్చే భారత రాజ్యాంగం ద్వారా ప్రతిరోజూ ఆయనను స్మరించుకుంటారని పేర్కొన్నారు. అంబేద్కర్ యొక్క ఆశయాల ప్రభావం రాజకీయాలు, చట్టం, సామాజిక శాస్త్రం, ఆర్థిక విధానం మరియు మతాలలో ఉందని, బౌద్ధమతం పుట్టిన జన్మభూమిలో బౌద్ధమతాన్ని పునరుద్ధరించడంలో ఆయన పాత్రను ఆయన హైలైట్ చేశారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జిహెచ్‌ఎంసి ప్రజావాణికి 226 అర్జీలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 60ఫిర్యాదులు అందాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్‌ల నుంచి మొత్తం 166 అర్జీలు వచ్చాయి. జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా మొత్తం 226 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వేణు గోపాల్, సుభద్రా దేవి, కె.సత్యనారాయణ, మంగతాయారు, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్లు వెంకన్న, జాయింట్ కమిషనర్లు మహేష్ కుల్‌కర్ణి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పౌరులు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ ప్రజావాణి కార్యక్రమం ఒక వేదికగా ఉపయోగపడుతోందని అధికారులు అన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రజావాణిలో అందజేసిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అధికారులను సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని, విన్నపాలను తక్షణమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల వాట్సాప్ నెంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 246 అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, కలెక్టరేట్ ఇన్‌చార్జ్ ఎఒ విజయ లక్ష్మి, జిల్లా సర్వే అధికారి శ్రీరామ్ పాల్గొన్నారు.



### కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదులు

ప్రభుత్వ భూములను కబ్జాదారులు తప్పుడు సర్వే నెంబర్లతో, నకిలీ పత్రాలతో కొల్లగొడుతున్నారని హైడ్రా ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేశారు. ఖాళీ భూమి కనిపిస్తే వాలిపోయి, సామాన్యులను పాత్రధారులుగా పెట్టి, వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను బడాబాబులు కాజేస్తున్నారన్నారు. విభజన సమయంలో వెళ్లిపోయిన వారి భూములు, రెవెన్యూ సరిహద్దుల్లో సర్వే నెంబర్ల ఓవర్‌లాపింగ్‌ను, అర్బన్‌ల్యాండ్ సీలింగ్ భూములను వదలకుండా ఆక్రమిస్తున్నారని, మొదట సామాన్యులతో గుడిసెలు వేయించి, తర్వాత బడాబాబులు రంగంలోకి దిగి ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 41 ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.



‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025’పై..

## యువతకు అవగాహన కల్పించాలి

అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025’ సదస్సులో ప్రదర్శిస్తున్న అన్ని అంశాలపై యువత అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ జి.ముకుందరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంక్షేమశాఖ, విద్యాశాఖ, పరిశ్రమలశాఖ, క్రీడల శాఖల అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈనెల 10 నుండి 13 వరకు గ్లోబల్ సమ్మిట్‌ను ప్రజలతో పాటు విద్యార్థినీవిద్యార్థులు సందర్శించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఇందుకు గాను ఇంజనీరింగ్, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ తదితర విద్యార్థులను సందర్శనకు తీసుకెళ్లి, అక్కడి ఆవిష్కరణలు, ప్రదర్శనల ద్వారా అవగాహన పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులను సమకూరుస్తున్నామని, ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు నోడల్ అధికారులను, కాలేజీలవారీగా ఇన్‌చార్జ్ అధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఏపాఠశాల, కళాశాల చెందినవారో తెలిపే బ్యానర్లను బస్సులకు ఏర్పాటు చేసి, బయలుదేరే ముందు ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూప్‌లో అప్లోడ చేయాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆవిష్కరణలు, వ్యవస్థాపకతకు యువత సాధికారతను ప్రదర్శించే ఒక ప్రధాన అంతర్జాతీయ వేదిక అని, పరిశ్రమల నిపుణులతో ముఖాముఖి వివరించడం ద్వారా విద్యార్థులు జ్ఞానంపై అవగాహన పొందవచ్చునని ఆయన వివరించారు.

## ‘సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్ చేయాలి’



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** సికింద్రాబాద్‌ను ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, అభివృద్ధి చేయాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ప్రధానకార్యదర్శి సద్దాం బాల్‌రాజ్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు ఈ ప్రాంత పురోభివృద్ధికి నిధుల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని వారు కోరారు. సమావేశంలో ఎ.శైలేందర్, సి.హెచ్.సునిల్ కుమార్, వి.జగదీశ్ గౌడ్, డి.శ్రీకాంత్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, ఎన్.క్రిష్ణ ముదిరాజ్, ఎస్.కె.అశోక్, సీతా దయాకర్ పాల్గొన్నారు.

# విధులకు గైర్హాజరయితే కఠిన చర్యలు

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా సోమవారం పోలింగ్ సిబ్బందిని నియమించుట కై మూడవ విడతలో రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నారాయణరెడ్డి సమక్షంలో పూర్తిచేశారు. జిల్లాలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్, అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్‌తో పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రెండవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి 9వ తేదీన వారికి కేటాయించిన మండల కేంద్రాలలో రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని కలెక్టర్ హెచ్చరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డిపిఓ వి.సురేష్ మోహన్ పాల్గొన్నారు.


# పల్లెలను ప్రగతి సీమలుగా మార్చాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్/కొత్తూరు/కేశంపేట:** పల్లె సీమలను ప్రగతి సీమలుగా మార్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి, భీమారం, ఉప్పరిగడ్డ తండా, విఠ్యాల, రామేశ్వరం, రాయికల్, కమ్మదనం, వెల్‌జర్ల, కొండన్నగూడ, కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, కొత్తూరు మండల పరిధిలోని కొడిచర్ల తండా, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి బాటలు వేసే అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించేందుకు ఓటర్లు కృషి చేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి, సమస్యలను తక్షణమే స్పందించే వ్యక్తులను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నుకుంటే బాగుంటుందన్నారు. గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించడమే కాకుండా సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, విద్యుత్ దీపాలు వంటి సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## కిషన్‌నగర్ వాసికి అమెరికాలో అరుదైన గౌరవం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అగ్రరాజ్యంలో తమ ప్రాంతవాసికి అరుదైన గౌరవం లభించడంతో కిషన్‌నగర్ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అమెరికాలోని మిచిగన్ రిపబ్లికన్ పార్టీ కోచైర్మెన్‌గా తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా షాద్‌నగక్ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన సన్నీరెడ్డి ఎన్నిక కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఎన్నిక ద్వారా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టీమ్‌లో సన్నీరెడ్డి ఒకరిగా నిలిచారు. సన్నీరెడ్డికి అరుదైన గౌరవం లభించడంతో కిషన్‌నగర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయడంతోపాటు కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కట్టా వెంకటేష్ గౌడ్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రీల్

## 'దీక్ష' ట్రైలర్ ఆవిష్కరించిన సుమన్



ఆర్.కె ఫిలిమ్స్, స్నిగ్ధ క్రియేషన్స్ బ్యానర్లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ నిర్మాణ దర్శకత్వంలో బిఎస్ రెడ్డి సమర్పణలో ద్వి జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్స్‌గా, కిరణ్ హీరోగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ఆర్‌కె దీక్ష. హీరో సుమన్ చేతుల మీదుగా ఈ చిత్ర ట్రైలర్ ఆవిష్కరించారు. నిర్మాత సి.కళ్యాణ్, తెలుగు ఫిలిం చాంబర్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్, తెలుగు చిత్ర నిర్మాత మండలి సెక్రెటరీ తుమ్మల ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఈ సినిమా సుమారు ఒక సంవత్సరంలో పూర్తి చేశాము. 5 పాటలు, 3 ఫైట్స్‌తో సినిమా చాలా బాగా వచ్చింది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళి నాయక్‌కు ఒక పాట ఈ సినిమా ద్వారా అంకితం చేశాము అని చెప్పారు. హీరో కిరణ్ మాట్లాడుతూ ఈ సినిమాలో ఒక వ్యక్తి దీక్షతో, పట్టుదలతో ఎలా ఎదుగుతారో చూడబోతున్నారు. ఈ సినిమాలో సింగిల్ షాట్ లో సంస్కృత శ్లోకం ప్రత్యేకంగా ఆకర్షిస్తుందనే నమ్మకం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అక్స ఖాన్, నటి మౌనిక రెడ్డి, స్నిగ్ధ రెడ్డి, వైస్ చైర్మన్ గురు రాజ్, డి.ఎ స్ రెడ్డి, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, ఫిలిం ఛాంబర్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్ , నిర్మాత సి కళ్యాణ్ , హీరో సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లడ్ రోజస్ టీజర్ రిలీజ్



టిబిఆర్ సినీ క్రియేషన్స్‌లో కె.నాగన్న, కె.లక్ష్మ మ్మ సమర్పణలో హరీష్ కమర్తి నిర్మాతగా ఎల్లప్ప కో ప్రొడ్యూసర్‌గా ఎంజిఆర్ రచయిత, దర్శకత్వంలో వస్తోన్న చిత్రం బ్లడ్ రోజస్. ధర్మ కీర్తి రాజు, అప్సర రాణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ టీజర్ విడుదలైంది. బ్లడ్ రోజస్ టీజర్ ను చూసి నటుడు సుమన్, నటుడు అజయ్ ఘోష్ చిత్ర యూనిట్ సభ్యులను అభినందించారు. టీజర్ ఆసక్తికంగా ఉందని, త్వరలో విడుదల కాబోతున్న ఈ మూవీ విజయం సాధించాలని వారు కోరారు. ఈ సినిమాలో కీలక పాత్రలో శ్రీలు, క్రాంతి కిల్లి నటించగా,సుమన్, ఘర్షణ శ్రీ నివాస్, టార్జన్, రాజేంద్ర, జూనియర్ రేలంగి, జగదీశ్వరి, మణి కుమార్ , ధ్రువ, అనిల్, నరేంద్ర , ప్రగ్యా, నవిత, జబర్దస్త్ జీఎంఆర్, జబర్దస్త్ రా ము, జబర్దస్త్ బాబు, ఈటీవీ జీవన్, మమత రెడ్డి, జ్యోతి, ఆచార్యలు తదితరులు నటించారు. బ్లడ్ రోజస్ చిత్రం క్రైమ్ థ్రిల్లర్ మరియు యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కింది, ఈ చిత్రానికి కెమెరామెన్ ఒగి రెడ్డి శివకుమార్ సంగీతం పెద్దపల్లి రోహిత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మణికుమార్. ఈ చిత్రం దాదాపు షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగింది.



## సూర్య 47వ సినిమా ప్రారంభం

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న నలభై ఏడవ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. మలయాళ దర్శకుడు జీతూ మాధవన్ దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. సూర్య పక్కన ఈ సినిమాలో నజ్రియా నజీమ్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభోత్సవంలో చిత్రంలోని ముఖ్య తారాగణం పాల్గొన్నారు. జఘరాం స్టూడియోస్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ వేడుకకు చిత్ర నిర్మాత శ్రీమతి జ్యోతిక, నటుడు కార్తీ, రాజశేఖర్ పాండియన్ (2డి ఎంటర్టైన్మెంట్), నిర్మాతలు ఎస్ ఆర్ ప్రకాష్, ఎస్ ఆర్ ప్రభు (డ్రీమ్ వారియర్ పిక్చర్స్) వంటి విశిష్ట అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు జీతు మాధవన్ మాట్లాడుతూ.. కొత్త పరిశ్రమ, కొత్త ప్రారంభం, అది కూడా సూర్య లాంటి స్టార్తో.. ఇది మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. మేము కొత్తగా ఏదైనా చేయడానికి ప్రయత్నిస్తున్నాము. మేము అందించాలనుకుంటున్న కొత్తదనాన్ని ప్రేక్షకులు అంగీకరించి ఆనందిస్తారని ఆశిస్తున్నాను.జాన్ విజయ్, ఆనందరాజ్, అనేక మంది ప్రముఖ నటులు ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో వినీత్ ఉన్ని పలోడే సినిమాటోగ్రఫీ, సుషిన్ శ్యామ్ సంగీతం, అశ్విని కాలే ప్రొడక్షన్ డిజైన్, అబ్బల్ సాబు ఎడిటర్. చేతన్ డి సౌజా స్టంట్ మాస్టర్ గా పని చేస్తున్నారు.

## ఘనంగా ఫెయిల్యూర్ బాయ్స్ ప్రీ రిలీజ్

క్రాంతి, అవితేజ్, ప్రదీప్, సుహర్ష, పవన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా ఫెయిల్యూర్ బాయ్స్. ఇతర కీలక పాత్రల్లో సుమన్, నాజర్, తనికెళ్ళ భరణి నటించారు. ఈ చిత్రాన్ని శ్రీ గురుదక్షిణ మూర్తి ఫిలింస్ బ్యానర్ పై వి ఎస్ ఎస్ కుమార్, ధన శ్రీనివాస్ జామి, లక్ష్మి వెంకట్ రెడ్డి నిర్మించారు. వెంకట్ త్రినాథ్ రెడ్డి ఉసిరిక దర్శకత్వం వహించగా విజయ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'ఫెయిల్యూర్ బాయ్స్' సినిమా డిసెంబర్ 12వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు సిద్ధమైంది.ఈ నేపథ్యంలో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఫెయిల్యూర్ బాయ్స్ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ముఖ్యఅతిథిగా వచ్చిన బాబు మోహన్ మాట్లాడుతూ ఈ సినిమా ఎంతో అద్భుతంగా ఉండబోతుంది. ముఖ్యంగా ఈ సినిమాకు పాటలు ఎంతో బలాన్ని చేకూరుస్తాయి. ప్రేక్షకులంతా ఇటువంటి సినిమాలను సపోర్ట్ చేసి విజయాన్ని అందజేయాల్సిందిగా కోరుకుంటున్నాను' అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తెలుగు శ్రీను, శ్రీనివాస్ జమ్మి , నటుడు పింగ్ పాంగ్, అంజి శ్రీను, నిర్మాత వి ఎస్ ఎస్ కుమార్, దర్శకుడు వెంకట త్రినాథ రెడ్డి ఉసిరిక, హీరోయిన్ కోయిల్ దాస్, హీరో అవి తేజ్ తదితరులు పాల్గొన్నారు.





## 12న అఖండ-2 ?

నందమూరి బాలకృష్ణ హీరోగా నిర్మించిన సినిమా 'అఖండ2'. ఈ అఖండ సక్సెస్ తరువాత దీనికి సీక్వెల్ గా బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ సినిమా కొన్ని ఆర్థిక సమస్యల వల్ల విడుదల ఆగిపోయింది. నిజానికి డిసెంబర్ 5న విడుదల కావలసిన ఈ సినిమా నిర్మాతలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల సమస్యలతో రిలీజ్ ఆగిపోయిన నేపథ్యంలో ఈ సినిమాను విడుదల చెయ్యడానికి సినిమా పెద్దలు కొంత మంది తగ ప్రయత్నాలు చేశారు. నైజాం లో ఈ సినిమాను కొనుక్కున సినిమా లెజెండ్ నిర్మాతతో పాటు దిల్ రాజు, సురేష్ బాబు లాంటి పెద్ద నిర్మాతలు సైతం ఈ వివాదాన్ని పరిష్కరించడానికి తమ వంతు సహాయం చేసినట్టు ఫిలిం నగర్ టాక్. అయితే తాజా సమాచారం ప్రకారం ఈనెల 12వ తేదీన సినిమా విడుదల అయ్యే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఇది బాలకృష్ణకు తొలి పాన్ ఇండియా సినిమా. హిందీలో స్వయంగా బాలకృష్ణ డబ్బింగ్ చెప్పిన సినిమా కూడా. అనుకున్న సమయానికి రిలీజ్ కాకపోవడంపై బాలకృష్ణ కూడా కొంత అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు సినిమా వర్గాలు చర్చించుకుంటున్నాయి. గతంలో లెజెండ్ సినిమా తీసిన ఈ నిర్మాతలే రామ్ ఆచంట, గోపి ఆచంట ఇప్పుడు బాలయ్యతో అఖండ 2 తీశారు. కానీ విడుదల సమయం వరకు నిర్మాతలు కట్టాల్సిన ఆర్థిక సమస్యల గురించి ఎక్కడ ప్రస్తావించకపోవడం వల్లే సమస్య జఠిలమైందని చర్చించుకుంటున్నారు. అయితే ఈ సమస్య కొలిక్కి వచ్చిందని, 12వ తేదీన అఖండ2ను విడుదల చెయ్యడానికి ముహూర్తం నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

## మోసపూరిత ఆధ్యాత్మిక గురువుల భరతం పట్టే 'ఈషా'

మోసపూరిత ఆధ్యాత్మిక గురువుల వెనుక ఉన్న సత్యాన్ని వెలికితీసేందుకు బయలుదేరిన నలుగురు స్నేహితుల కథతో ఈ సినిమా ప్రారంభమవుతుంది. బబ్లూ పృథ్వీరాజ్ రంగంలోకి దిగి, దయ్యాల ఉనికిని నిరూపించాలని నిశ్చయించుకుని, వాటిని ప్రేక్షకులను భయంకరమైన క్షణాలతో నిండిన చీకటి, కలవరపెట్టే రాజ్యంలోకి లాగుతాడు. స్నేహితులు త్వరలోనే భయంతో మునిగిపోతారు. ట్రైలర్ విప్పుతున్నప్పుడు, దాగి ఉన్న ఆత్మలు నివసించే ఒక గగుర్పాటు, నిర్జనమైన ఇంటిని, నలుగురు స్నేహితులు లోపల చిక్కుకున్నట్లు తెలుస్తుంది. వారి మనుగడ కోసం పోరాటం కేంద్ర బిందువుగా మారుతుంది, ప్రేక్షకులు వారి విధి గురించి ఆసక్తిగా ఉంటారు. ఆ భయంకరమైన నిర్మాణం లోపల వారికి ఏమి జరిగింది? వదిలివేయబడిన భవనం యొక్క చీకటి చరిత్ర ఏమిటి? ఈ దృశ్యాలు అనేక బలవంతపు ప్రశ్నలను లేవనెత్తుతాయి. స్నేహితులు సజీవంగా



బయటపడ్డారా? దయ్యాలు ఏ రహస్యాలను దాచిపెడుతున్నాయి? 'ఇషా'సినిమాలో త్రిగున్ ,హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో నటించారు, అఖిల్ రాజ్, సిరి హన్మంత్ ,పృథ్వీరాజ్ కూడా ముఖ్యమైన పాత్రలు పోషించారు. ఈ సినిమా నుంచి ఉత్కంఠభరితమైన కొత్త ట్రైలర్ను విడుదల అయింది. ఈ ట్రైలర్ విజయవంతంగా ఉత్కంఠ , ఆసక్తిని పెంచుతుంది . సృష్టికర్తలు ప్రేక్షకులకు ఒక ఉత్కంఠభరితమైన, సీటు అంచున కూర్చునే భయానక అనుభవాన్ని హామీ ఇస్తున్నారు. ఆర్.ఆర్. ధ్రువన్ నేపథ్య సంగీతం ఉద్రిక్తతను పెంచుతుంది మరియు నిర్మాణ నాణ్యతతో పాటు విజువల్స్ ఆకట్టుకునేలా నిలుస్తాయి. హెచ్.వి.ఆర్. ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో పోతుల హేమ వెంకటేశ్వరరావు మద్దతుతో, ఈ చిత్రం నైపుణ్యం కలిగిన సాంకేతిక బృందాన్ని ఒక చోట చేర్చింది, వీరిలో సంతోష్ సనమోని సినిమాటోగ్రఫీ, ఆర్.ఆర్. ధ్రువన్ సంగీతం మరియు వినయ్ ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు.నిర్మాతలు బన్నీ వాస్ మరియు వంశీ నందిపాటి ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు.

## అమెజాన్ ప్రైమ్‌లో 'జటాధరా'



సుధీర్ బాబు హీరోగా ప్రేరణ అరోరా నిర్మించిన జటాధరా సినిమా ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. సోనాక్షి సిన్హా ఇందులో కీలక పాత్రను పోషించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా థియేటర్లలో పెద్దగా ఆడకపోయినా ప్రైమ్ వీడియోలో మంచి ట్రేండింగ్‌లో ఉందని నిర్మాత ప్రేరణ అరోరా తెలిపారు. ఈ సక్సెస్‌తో మరో సినిమా చెయ్యడానికి ప్లాన్ చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. 'రుస్తమ్' , 'జటాధరా' విజయాల తర్వాత, ఇది ప్రేరణ అరోరాకి జీ స్టూడియోస్‌తో మూడవ సహకారం. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సాల్, శివిన్ నారంగ్ , ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తుండగా, కీర్తన్ సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా, థియేట్రికల్ రన్ను విజయవంతంగా ముగించిన 'జటాధరా' ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలై టాప్ చార్ట్స్ ట్రెండింగ్ అవుతోంది. ఆమె అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టులు కేవలం హిందీ చిత్రసీమలోనే కాక దక్షిణ భారత ఫిల్మ్ ఇండస్ట్రీలో కూడా విశేష ఆదరణ పొందుతున్నాయి.అదృష్ట సంఖ్యగా ఎప్పటినుంచో ఆమె జీవితంలో ప్రత్యేక స్థానంలో నిలిచిన '8'ఇవాళ డిసెంబర్ 8వ తేదీ ఆమెకు మరింత శుభాన్ని తీసుకు వచ్చింది. కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతున్న ఈ సందర్భంలో, ప్రేరణ అరోరా భారీ సంస్థ జీ స్టూడియోస్తో కలిసి తమ తదుపరి పాన్ఇండియా అడ్వెంచర్ చిత్రం అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రేరణ అరోరాకు సినిమా టీమ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.1.88 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సోమవారం ప్రారంభమైన సమ్మిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రసంగించారు. సదస్సులో నోబుల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అభిజిత్ బెనర్జీ వీడియో సందేశం ఇవ్వగా, డబ్ల్యూఈఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ జెర్మీ జర్గెన్స్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్వైడర్, నోబెల్ అవార్డు గ్రహీత కైలాస్ సత్యార్థి, అపోలో ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ శోభనా కామినేని సందేశాలు ఇచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు స్వాగతోపన్యాసం చేయగా, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమానికి పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు వ్యాపార, వాణిజ్యవేత్తలు, 44దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రెండు రోజుల సమ్మిట్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన దిగ్గజాలు దాదాపు 3 వేల మంది ఇందులో పాల్గొంటున్నారు. తొలుత మధ్యాహ్నం 1 గంటలకు భారత్ ఫ్యూచర్ సిటీకి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా గ్లోబల్ సమ్మిట్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన పారిశ్రామిక, వాణిజ్య స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవాలతో పాటు తెలంగాణ రాష్ట్ర ఉజ్జ్వల అభివృద్ధి లక్ష్యంగా ఆవిష్కరించే ప్రణాళికలను వివరించారు.

### వివిధ రంగాల ప్రతినిధుల బృందాలతో సిఎం సమావేశం

గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవ వేడుకల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశవిదేశాల నుంచి వచ్చిన వివిధ రంగాల ప్రతినిధులు, దిగ్గజ కంపెనీల ప్రతినిధులను కలిశారు. ఆ తర్వాత సిఎం వివిధ రంగాలకు చెందిన ప్రతినిధుల బృందాలతో విడివిడిగా సమావేశమయ్యారు. ప్రతి 15 నిమిషాలకో వన్ టు వన్ రౌండ్ టేండ్ సమావేశంలో ముఖ్యమంత్రి భాగస్వామ్యమయ్యారు. సమ్మిట్ మొదటి రోజు సిఎం రేవంత్‌రెడ్డి 15 సమావేశాల్లో పాల్గొన్నారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రతినిధులు, ట్రంప్ మీడియా ప్రతినిధులు, అమెజాన్. ఐకియా ప్రతినిధులు, టెక్స్‌టైల్, ఫర్నిచర్ తయారీ,ఎంఎస్ఎంఇ , ఎలక్ట్రానిక్స్, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్, వేర్‌హౌజింగ్ రంగ ప్రతినిధులు, ,ఎస్ఐడిబిఐ వరల్డ్ బ్యాంక్, వెస్టన్ యూనియన్ ప్రతినిధులతో ఈ రౌండ్ టేండ్ సమావేశాలు జరిగాయి. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో పేరొందిన కంపెనీల ప్రతినిధులు, యూనివర్సిటీ ఆఫ్ లండన్ ప్రతినిధులు, వంతార, విన్ గ్రూప్ ప్రతినిధులు, వివిధ దేశాల నుంచి వచ్చిన రాయబారులు, ఇతర అంతర్జాతీయ ప్రతినిధుల సిఎం సమావేశమయ్యారు. తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2047 మొదటి రోజు వివిధ రంగాల్లో ప్రపంచంలో వస్తున్న మార్పులు, భవిష్యత్తుకు అవసరమైన అభివృద్ధి ప్రణాళికలపై చర్చలు కొనసాగాయి.



### సమ్మిట్ తొలిరోజు 12 అంశాలపై చర్చా కార్యక్రమాలు

గ్లోబల్ సమ్మిట్‌లో లో భాగంగా తొలి రోజు మూడు సెషన్లుగా12 అంశాలపై చర్చా గోష్ఠి కార్యక్రమాలు జరిగాయి. ప్రధాన వేదికకు దగ్గర సమాంతరంగా ఏర్పాటు చేసిన 4 మీటింగ్ హాల్స్‌లో ఈ ప్యానెల్ డిస్కషన్లు కొనసాగాయి. తొలి రోజున 12 అంశాలపై ఈ చర్చా వేదికలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వివిధ రంగాలు, విభిన్న అంశాలపై చర్చించారు. ఈ చర్చా కార్యక్రమాల్లో సంబంధిత శాఖల మంత్రుల సారథ్యంలో ఆయా రంగాల నిపుణులు, మేధావులు పాల్గొన్నారు. మొదటి సెషన్‌లో హాల్–1లో తెలంగాణ భవిష్యత్తు ఇంధనం, గ్రీన్ ఎనర్జీ దిశలో ముందడుగు, హాల్ 2లో ఎలక్ట్రిక్ వాహనాలు, నాన్‌ఎమిషన్ టెక్నాలజీ, హాల్–3లో సాంకేతిక రంగంలో సెమీ కండక్టర్, ఫ్రంటియర్ టెక్నాలజీ అవకాశాలు, హాల్–4లో విద్యా రంగంలో తెలంగాణను గ్లోబల్ సెంటర్‌గా తీర్చిదిద్దే వ్యూహం అనే అంశాల పై చర్చా కార్యక్రమాలు జరిగాయి. రెండవ సెషన్‌లో భాగంగా హాల్–1లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణ వృద్ధిపై చర్చ, హాల్–2లో అంతర్జాతీయ అవకాశాలు, నైపుణ్య మార్పిడి విధానాలపై చర్చ, హాల్–3లో ఆరోగ్యరంగం అభివృద్ధి దిశగా చర్చ, హాల్–4లో కోరియా, ఆస్ట్రేలియా ఈ రెండు దేశాలతో వివిధ రంగాల్లో సాంకేతిక, నైపుణ్యాల సహకారం,పెట్టుబడి భాగస్వామ్యంపై చర్చలు సాగాయి. మూడో సెషన్‌లో హాల్–1లో ఆసియా దేశాలతో ఆర్థిక భాగస్వామ్యంపై చర్చ. హాల్–2లో గిగ్ వర్కర్స్, డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఉద్యోగాల భవిష్యత్తుపై చర్చ, హాల్–3లో రైతుల ఆదాయం పెంపొందించే వ్యూహాలపై చర్చ, హాల్–4లోకెనడాతో వివిధ రంగాల్లో సహకార భాగస్వామ్యాలు, పారిశ్రామికవేత్తలుగా మహిళల సాధికారత అనే అంశాలపై చర్చా కార్యక్రమాలు జరిగాయి.


## అంతర్జాతీయ జూపార్క్

(మొదటి పేజీ తరువాయి)

ముఖేష్ అంబానీకి చెందిన 'వంతరా జూ' నిర్వాహకులతో తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వంతరా జూ ప్రపంచ స్థాయి జంతు సంరక్షణ, పునరావాసం, శాస్త్రీయ నిర్వహణలో ప్రసిద్ధిపొందిన సంస్థ. అక్కడ అమలు చేస్తున్న వివిధ నమూనాలను తెలంగాణలో ప్రతిపాదిత కొత్త జూ కోసం ఉపయోగించాలనే ఉద్దేశంతో ఈ ఒప్పందం కుదిరింది. ఈ అవగాహన ఒప్పందంతో తెలంగాణలో ఏర్పడబోయే కొత్త జూ దేశంలోనే కాక ఆసియా స్థాయిలో ఒక ప్రత్యేక ఆకర్షణ, అంతర్జాతీయ మోడల్ జూగా అభివృద్ధి చెందే అవకాశాలు మరింత బలపడుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, అటవీ దళాల ముఖ్య సంరక్షిణాధికారిణి డాక్టర్ సి సువర్ణ, అటవీ అభివృద్ధి సంస్థ ఎండి సునీత భగవత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఎంఒయు ప్రధాన అంశాలు..

- వంతరా జూ నిర్వహణలో అమలవుతున్న జంతు సంరక్షణ, పునరావాస చర్యలపై సాంకేతిక సహాయం
- నైట్ సఫారీ రూపకల్పన, నిర్వహణ నమూనాలు, భద్రతా ప్రమాణాలు
- ఫారెస్ట్‌బేస్డ్ ఎకో థీమ్ పార్క్ అభివృద్ధికి సాంకేతిక సలహాలు
- పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలో జూ అభివృద్ధి కోసం మార్గదర్శకాలు
- ఆధునిక ఎంక్లోజర్లు, వన్యప్రాణి సంక్షేమ ప్రమాణాలు, సందర్శకుల అనుభవం మెరుగుపరిచే ఉత్తమ పద్ధతులపై సహకారం



## విరమించండి

(మొదటి పేజీ తరువాయి)

నాయకులతో కలిసి బిల్లు పత్రాలను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పశ్యపద్మ మ్ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ విత్తన సంస్థలకు అనుకూలంగా తీసుకొచ్చిన బిల్లులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని తెలిపారు.కేంద్రం తీసుకువచ్చిన విధానాలు రైతులకు,చిన్న తరహా విత్తన ఉత్పత్తిదారులకు తీవ్ర హాని తలపెట్టి విధంగా ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి,కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్ లను తీసుకొచ్చారని ఆమె గుర్తు చేశారు.కావున రైతులు,కార్మికులు,ప్రజలు సంగటితమై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సంగటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.అనంతరం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొంత మాధవరెడ్డి మాట్లాడుతూ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు చల్ల నారాయణరెడ్డి,రైతు నాయకులు ఎల్లేష్, రాములు, ము త్తయ్య,యాదగిరి,పద్మ,సత్తమ్మ,అండాలు, నరేందర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కాగా, ఆదివారం నలుగురు మహిళలు సహా పది నక్సల్స్ ముఖ్యమంత్రి ఎదుట ఎకె ఎకె47, ఇన్సాస్ రైఫిల్స్‌తో పాటు ఆధునిక ఆయుధాలను వీడారు. వీరంతా నిషేధిత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) 'భోర్సాదేవ్ ఏరియా కమిటీ'లో భాగమని అధికారులు తెలిపారు. 'దిండోరి, మాండ్లాలు ఇప్పుడు నక్సల్ ప్రభావం నుండి పూర్తిగా విముక్తి పొందాయి. జనవరి నుండి బాలాఘాట్‌లో పూర్తి నక్సల్ నిర్మూలన ప్రచారం ప్రారంభమవుతుంది. ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చే వారికి 15 సంవత్సరాల పాటు పునరావాస ప్యాకేజీ లభిస్తుంది. ఆయుధాలు వీడని వారిపై కఠినమైన చర్యలు కొనసాగుతాయి' అని యాదవ్ అన్నారు. బాలాఘాట్ పోలీస్ లైన్స్‌లో జరిగిన 'పునర్వాస్ సే పూర్ణజీవన్' (పునరావాసం) కార్యక్రమంలో, సిఎం ప్రభుత్వ లొంగుబాటు విధానం కింద నక్సలైట్లను ప్రధాన స్రవంతిలో చేరాలని కోరారు. 'ప్రభుత్వ పునరావాస విధానం కేవలం ప్రకటన కాదు, హామీ. హింసను విడిచిపెట్టి లొంగిపోయే ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవితం, భద్రత, పునరావాసం కోసం పూర్తి అవకాశాలు లభిస్తాయి. 'అభివృద్ధి, శాంతి మార్గంలో నడవాలనుకునే ప్రతి వ్యక్తికి సురక్షితమైన భవిష్యత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మధ్యప్రదేశ్‌ను నక్సలిజం నుండి విముక్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని యాదవ్ అన్నారు. 'లాల్ సలామ్' కు చివరి సెల్యూట్ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ ప్రచారం మార్చి 2026 నాటికి పూర్తి కావాల్సి ఉంది, కానీ మన భద్రతా సంస్థలు, పోలీసుల అజేయ ధైర్యం కారణంగా, జనవరి 2026 నాటికి దీనిని పూర్తి చేయడానికి ఒక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసాము' అని ఆయన అన్నారు. ఆయుధాలు తీసుకోవడానికి ఎవరికీ అనుమతి లేదని అన్నారు. 'తాజాగా లొంగిపోయిన వారు మండలాల్లోని కన్హా టైగర్ రిజర్వ్, ఛత్తీస్‌గఢ్‌లోని కవర్ధా జిల్లాలోని భోరామ్‌డియో వన్యప్రాణుల అభయారణ్యంతో కూడిన మహారాష్ట్ర–ఎంపి–ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసి) జోన్‌కు చెందిన కొత్త డివిజన్ కెబికి చెందిన వారని అధికారులు చెప్పారు. దీనికి అల్ట్రా సుందర్ అలియాస్ కబీర్ నాయకత్వం వహించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం మహారాష్ట్రలోని గోండియా జిల్లాతో పాటు ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్, ఖైరాఘర్, కవర్ధాతో సరిహద్దులను పంచుకుంటుందని ఒక అధికారి తెలిపారు. లొంగిపోయిన కార్యకర్తలను సుందర్ అలియాస్ కబీర్ అలియాస్ సోమ (ఎకె47, బౌంటీ రూ. 62 లక్షలు), రాకేష్ ఓడో అలియాస్ బీమా, సమర్ అలియాస్ సమ్రు అలియాస్ రాజు (.303 రైఫిల్, బౌంటీ రూ. 14 లక్షలు), సలిత అలియాస్ సవిత (ఎస్ఎల్ఆర్, బౌంటీ రూ. 14 లక్షలు), విక్రమ్ అలియాస్ హిడ్మా (బౌంటీ రూ. 14 లక్షలు), లాల్సింగ్ మాదవి అలియాస్ సీంగూ (ఇన్సాస్, బౌంటీ రూ. 14 లక్షలు)గా గుర్తించారు. మిగిలిన వారు శిల్ప (ఇన్సాస్, బౌంటీ రూ. 14 లక్షలు), జరీనా అలియాస్ జోగి (బౌంటీ రూ. 14 లక్షలు), జయశీల (సింగిల్‌షాట్ గన్, బౌంటీ రూ. 14 లక్షలు), నవీన్ అలియాస్ హిడ్మా (సింగిల్‌షాట్ గన్, బౌంటీ రూ. 14 లక్షలు)గా గుర్తించారు. ఈ సందర్భంగా, భద్రతా సిబ్బంది కొత్త శిబిరాలను ఏర్పాటు చేశారని, నక్సల్ వ్యతిరేక హాక్ ఫోర్స్, పోలీసులను బలోపేతం చేస్తున్నారని పోలీస్ డైరెక్టర్ జనరల్ కైలాష్ మక్వానా తెలిపారు.

## శక్తి, ప్రేరణనిచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

జవహర్‌లాల్ నెహ్రూను కూడా మోదీ లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. నెహ్రూ సుభాష్ చంద్రబోస్‌కు రాసిన లేఖను మోదీ ఉదహరించారు. లక్నోలో మహ్మద్ అలీ జిన్నా నిరసన తర్వాత ఈ లేఖ రాశారని ఆయన అన్నారు. ఈ లేఖను ఉటంకిస్తూ, నెహ్రూ పాట నేపథ్యాన్ని తాను చదివానని, అది ముస్లింలలో కోపాన్ని రేకెత్తించవచ్చని రాశారని మోదీ అన్నారు. వందేమాతరం ఉపయోగాన్ని సమీక్షించడానికి కాంగ్రెస్ 'బంకిం చంద్ర ఛటర్జీ బెంగాల్'లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కానీ, అక్టోబర్ 26న, కాంగ్రెస్ వందేమాతరం విషయంలో రాజీ పడిందని, వారు సామాజిక సామరస్యం అనే ముసుగులో దానిని ముక్కలుగా విరిచారన్నారు. 'చరిత్ర సాక్షిగా ఉంది.. ఇది కాంగ్రెస్ సంతృప్తి రాజకీయాలకు చేసిన ప్రయత్నం. సంతృప్తి రాజకీయాల ఒత్తిడిలో, కాంగ్రెస్ వందేమాతరంను విభజించడానికి అంగీకరించింది.. అందుకే కాంగ్రెస్ కూడా విభజన డిమాండ్‌కు తలొగ్గింది..,'అని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ ముస్లిం లీగ్ ముందు మోకరిల్లి, ఒత్తిడిలో ఇలా చేసిందనడానికి చరిత్ర నిదర్శనమని ప్రధానమంత్రి అన్నారు. 'ఇది కాంగ్రెస్‌ను సంతృప్తిపరిచే రాజకీయాలకు ఒక ఉదాహరణ. వందేమాతరం విభజనకు తలవంచింది కాబట్టి, తరువాత భారతదేశ విభజనకు తలవంచింది. కాంగ్రెస్ నేటికీ అదే సంతృప్తికరమైన రాజకీయాలను కొనసాగిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. 1905లో మహాత్మా గాంధీ వందేమాతరం చాలా ప్రజాదరణ పొందిందని, అది జాతీయ గీతంగా ఉద్భవించిందని రాసిన విషయాన్ని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. దానికి అన్యాయం ఎందుకు జరిగిందో అని ఆశ్చర్యపోయారు. జాతీయ గేయం వందేమాతరం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పుడు రాజ్యాంగం అణచివేయబడింది, అత్యవసర పరిస్థితి ద్వారా దేశం బంధించబడిందని మోదీ విచారం వ్యక్తం చేశారు.బ్రిటిష్ అణచివేత ఉన్నప్పటికీ వందేమాతరం ఒక శిలలా నిలిచి ఐక్యతను ప్రేరేపించిందని కూడా ప్రధానమంత్రి పేర్కొన్నారు. 'అత్యవసర పరిస్థితి మన చరిత్రలో ఒక చీకటి అధ్యాయం. ఇప్పుడు మనకు వందేమాతరం యొక్క గొప్పతనాన్ని పునరుద్ధరించే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని దాటనివ్వకూడదని నేను నమ్ముతున్నాను' అని మోదీ అన్నారు. వందేమాతరం ముద్రణ, ప్రచారాన్ని నిరోధించడానికి చట్టాలు తీసుకువచ్చినప్పటికీ బ్రిటిష్ వారు వందేమాతరంను నిషేధించవలసి వచ్చిందని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. '1857 తిరుగుబాటు తర్వాత, బ్రిటిష్ ప్రభుత్వం అప్రమత్తమై, వివిధ రకాల అణచివేతలను అమలు చేస్తున్న సమయంలో వందేమాతరం రాశారు. బ్రిటిష్ జాతీయ గీతం 'గాడ్ సేవ్ ది క్వీన్'ను ప్రతి ఇంటిలోకి ప్రవేశపెట్టడానికి ప్రచారం జరుగుతోంది. 'వందేమాతరం ద్వారా, బంకిం చంద్ర చటోపాధ్యాయ ఈ సవాలుకు గొప్ప బలం, సంకల్పంతో స్పందించారు. 1905లో బ్రిటిష్ వారు బెంగాల్‌ను విభజించారు, కానీ వందేమాతరం ఒక శిలలా నిలిచి ఐక్యతను ప్రేరేపించింది' అని ఆయన అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com